www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

గురువారం | 13-3-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 327 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, పాల్గుణమాసం, శుక్లపక్షం, తిథి: చతుర్దశి ఉ.10:36 తదుపరి పౌర్ణమి, నక్షత్రం: పుబ్బ తె.6:19 తదుపరి ఉత్తర, వర్జ్యం: మ.12:49-2:34, అమృతఘడియలు: రా.11:19-1:04, దుర్ముహూర్తం: ఉ.10:25-11:13, మ.3:10-3:58, రాహుకాలం: మ. 1:30-3:00 సూర్యోదయం: 6:28, సూర్యాస్తమయం: 6:21 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఓటరు కార్డుకు ఆధార్, మొబైల్ లింక్

ఎన్నికల సంఘం ఆదేశం.. అన్ని రాష్ట్రాల సీఈవోలకు ఉత్తర్వులు జారీ



న్యూఢిల్లీ, మార్చి 12: ఓటర్ల గుర్తింపు సక్రమంగా జరిగేలా ఓటరు గుర్తింపు కార్డులను ఆధార్, మొబైల్ నంబర్లతో అనుసంధానించాలని కేంద్ర ఎన్నికల కమిషన్(ఈసీఐ) ఆదేశించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్య ఎన్నికల అధికారుల(సీఈవోల)కు సర్క్యులర్ జారీ చేసినట్టు ఒక ఆంగ్ల పత్రిక వెల్లడించింది. ఈనెల 4న నిర్వహించిన సీఈవోల సదస్సులో 'ఓపెన్ రిమార్క్స్ ఆఫ్ సీఈసీ' పేరిట సీఈవోలందరికీ పంపిణీ చేసిన పత్రాల్లోనూ అవే ఆదేశాలు

మిగతా 14వ పేజీలో...



రోడ్లకు మహర్దశ!

మరో 2వేల కి.మీ. పునర్నిర్మాణానికి ఓకే
రూ.1860 కోట్ల నిధులతో పనులు
నియోజకవర్గాల వారీగా ప్రతిపాదనలు
తక్షణమే చేపడతామన్న మంత్రి జనార్దన్‌రెడ్డి

2



2

నెలాఖరుకు ఉద్యోగుల బకాయిల చెల్లింపు!

రూ.5 వేల కోట్ల వరకు చెల్లించే అవకాశం



పోలవరానికి రూ. 2,704కోట్లు

2

ప్రాజెక్టు కోసం ప్రత్యేక ఖాతాలో జమ

చేసిందంతా విక్రాంత్ రెడ్డే



కాకినాడ సీ పోర్టు 'డీల్'లో సూత్రధారి



విచారణ తర్వాత సీఐడీ కార్యాలయం నుంచి బయటకొస్తున్న విజయసాయి

కేవీ రావు-శరత్‌చంద్రారెడ్డి షేర్ల బదిలీ వ్యవహారంలో కర్త, కర్మ, క్రియ ఆయనే
వైవీ సుబ్బారెడ్డి కుమారుడిగా నాకు తెలుసు
శరత్‌తో ఉన్నది కుటుంబ సంబంధమే
సంతానం కంపెనీని వలవన్ తీసుకొచ్చారు
పోర్టు 'వ్యవహారం'లో నా ప్రమేయం లేదు
అన్ని కేసుల్లో నాకు 'ఏ2'ను స్థిరం చేశారు
ఉత్తరాంధ్ర లేటరైట్ తవ్వకాలపైనా సీఐడీ ఆరా
విక్రాంత్ కోట్లు ఆర్జించారో లేదో తెలియదు
విచారణ తర్వాత మీడియాతో విజయసాయి
మరోసారి విచారణకు పిలిచే అవకాశం

"సీ పోర్టు వ్యవహారాన్ని ఆది నుంచి అంతిమం వరకు విక్రాంత్‌రెడ్డే నడిపించారని కేవీ రావు మా కామన్ ఫ్రెండ్స్‌కు చెప్పారు. ఇదే విషయాన్ని సీఐడీకి వివరించాను. వైవీ సుబ్బారెడ్డి కుమారుడిగా విక్రాంత్ రెడ్డి నాకు తెలుసు"
- విజయసాయిరెడ్డి

విజయవాడ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కాకినాడ సీ పోర్టు ప్రైవేటు లిమిటెడ్ 'వ్యవహారం'లో వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్‌రెడ్డే సూత్రధారని మాజీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి వెల్లడించారు. కేవీ రావు, అరబిందో కంపెనీ శరత్‌చంద్రారెడ్డి షేర్ల 'డీల్'లో విక్రాంత్‌రెడ్డి కర్త, కర్మ, క్రియగా వ్యవహరించారన్నారు. బుధవారం విజయవాడ కానూరులోని ప్రాంతీయ సీఐడీ కార్యాలయంలో అధికారులు ఆయనను విచారించారు. సుమారు మూడు గంటల పాటు విచారణ సాగింది. అనంతరం బయటకు వచ్చిన విజయసాయి మీడియాతో మాట్లాడారు. సీ పోర్టు వాటాలు లాక్కోవడంలో ఆది నుంచి చివరి వరకు

మిగతా 2వ పేజీలో...

కోటరీ వల్లే జగన్‌కు దూరం



వైసీపీలో అవమానాలు, ఇబ్బందులు
నా మనసు విరిగిపోయింది
ఆయన మనసులో నాకు స్థానం లేదు
అదే మాట జగన్‌కు చెప్పి బయటకొచ్చా
మాజీ ఎంపీ విజయసాయి వ్యాఖ్యలు

మద్యం స్కామ్ సూత్రధారి కసిరెడ్డే...




వైసీపీ ప్రభుత్వంలో ఐటీ సలహాదారుగా పనిచేసిన కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి మద్యం కుంభకోణం సూత్రధారి అని విజయసాయిరెడ్డి తెలిపారు. ఇదే విషయాన్ని ఇంతకు ముందు చెప్పానని, భవిష్యత్తులో మరిన్ని వివరాలు చెప్పాల్సివచ్చినా చెబుతానని అన్నారు. "భయం అనేది నా రక్తంలో లేదు. జగన్ మీద ఇంతకుముందు భక్తి, ప్రేమ ఉండేవి. ప్రస్తుతం అవి దేవుడి మీద మాత్రమే ఉన్నాయి. జగన్ చాలా పదవులు ఇచ్చారు. కానీ, అక్కడ పొందిన అవమానాలు, ఇబ్బందులతో మనసు విరిగిపోయింది. నేను ఏ ప్రలోభాలకూ లొంగలేదు. ఆత్మగౌరవం, విశ్వసనీయతను కోల్పోలేదు. జగన్‌లోనే మార్పు వచ్చింది." అని విజయసాయి అన్నారు.

"రాష్ట్రంలో మహిళలకు తొలిసారి ఆస్తి హక్కు కల్పించింది టీడీపీ. కానీ, జగన్ తన చెల్లెలి ఆస్తి కోసం కోర్టుకు వెళ్లారు. ఇలాంటి అంశాలను ఎవరూ ఉపేక్షించకూడదు. తల్లికి, చెల్లికి న్యాయం చేయనివారు సమాజానికి ఏం చేస్తారు?. ఇది మహిళా సాధికారత అనిపించుకోదు. జగన్ చర్యను మహిళలను వేధించడంగానే చూడాలి."
- సీఎం చంద్రబాబు

ఏడాదిలో లక్షమంది మహిళా పారిశ్రామికవేత్తలు

నియోజకవర్గానికి వెయ్యిమంది చొప్పున...

డ్వాక్రాలకు 65వేల కోట్ల రుణాలు



వారి జోలికి వస్తే ఎక్కడున్నా పట్టుకొస్తాం
మహిళల అమరావతి పోరు చరిత్రాత్మకం
అసెంబ్లీలో చంద్రబాబు వ్యాఖ్యలు
మహిళా సాధికారతపై మాట్లాడిన సీఎం
తల్లి, చెల్లిపై కోర్టుకెళ్లినవారు మహిళలను గౌరవిస్తారా?
జగన్ చర్య మహిళలపై వేధింపే: బాబు

అమరావతి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రానున్న ఏడాదికాలంలో రాష్ట్రవ్యాప్తంగా లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారుచేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో డ్వాక్రా, ఎస్‌హెచ్‌జీలకు రూ.65వేల కోట్ల రుణాలు ఇప్పించడం ద్వారా వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామని

మిగతా 14వ పేజీలో...

జగన్ సర్కారు ఫీజు బకాయిలు రూ. 4,271కోట్లు

దశలవారీగా వాటిని చెల్లిస్తున్నాం
ఏప్రిల్ 24 తర్వాత కాలేజీల ఖాతాల్లో జమ: లోకేశ్

12

బెయిల్ ఇవ్వకపోతే ఆత్మహత్యే

గుంటూరు కోర్టులో పోసాని బెదిరింపులు
తప్పుంటే మెడ నరికేయండంటూ ఆవేశం
మెజిస్ట్రేట్ ముందు ఎమోషనల్ బ్లాక్‌మెయిల్
14 రోజుల రిమాండ్ విధించిన కోర్టు
క్వాష్ పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు



అమరావతి/గుంటూరు/కర్నూలు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో ఉన్నపుడు హద్దూపొద్దూ లేకుండా ఇష్టమొచ్చినట్లు రెచ్చిపోయిన సినీ నటుడు పోసాని కృష్ణమురళి ఇప్పుడు గుంటూరు మెజిస్ట్రేట్ ముందు ఆవేశంతో ఊగిపోయారు. తన తప్పు ఉందని తేలితే

మిగతా 14వ పేజీలో...

బోరుగడ్డ లొంగుబాటు

రాజమండ్రి జైలులో ఉదయాన్నే ప్రత్యక్షం.. వెంటనే గుంటూరుకు తరలింపు

జాప్యానికి కారణమడిగితే అనంత కోర్టులో ఆలస్యమైందని జవాబు



ఆధారాలు కోరడంతో హైకోర్టుకు చెబుతానన్న రౌడీ షీటర్?
గుంటూరులో బెయిల్ మంజూరుచేసిన మెజిస్ట్రేట్
తిరిగి రాజమండ్రి జైలుకు తరలింపు
అనంత కోర్టులో బోరుగడ్డకు దక్కని ఊరట
బెయిల్ పిటిషన్ కొట్టేసిన న్యాయస్థానం

13

నాకేమైనా అయితే వివేకా కేసు నిర్వీర్యమే!

ఆ హత్య కేసులో కీలక సాక్షిని.. భద్రత పెంచాలి: దస్తగిరి



2+2+ఎస్కార్ట్ వాహనం ఉండేది.. కూటమి ప్రభుత్వం కుదించింది
వైసీపీ నేతలు, కార్యకర్తల నుంచి నాకు ప్రమాదం పొంచి ఉంది
సాక్షుల మరణాలు సహజమా, హత్యలో నిగ్గుతేల్చాలి
'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి'తో దస్తగిరి.. రక్షణ కోసం కడప ఎస్పీకి వినతి

13

మండలిలో వైసీపీ రచ్చ!

పోడియంపైకి ఎక్కి.. చైర్మన్ చుట్టూ మోహరింపు

వాయిదా తీర్మానాన్ని తిరస్కరించినా ఫీజులు, నిరుద్యోగ భృతిపై చర్చకు పట్టు
విపక్ష ఎమ్మెల్సీల నినాదాలు, అరుపులతో గందరగోళం
3 సార్లు వాయిదా వేసినా అదే పరిస్థితి.. మార్షల్స్‌ను రప్పించిన చైర్మన్
ఇది దుష్ట సంప్రదాయమన్న బొత్స.. తిప్పికొట్టిన మంత్రి పయ్యావుల
ఆయనకు జ్ఞాపక శక్తి పోయిందేమోనని ఎద్దేవా

12



ముగ్గురు ఐపీఎస్‌ల సస్పెన్షన్ 6 నెలలు పొడిగింపు

ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ విజయానంద్
నటి జెత్వానీ కేసులో పీఎస్ఆర్, కాంతిరాణా, విశాల్ గున్నీపై వేటు

13

దోపిడీకొచ్చి దొరికిపోయారు

చిత్తూరులో డమ్మీ తుపాకులతో చోరీ యత్నం


స్థానికుల అప్రమత్తతతో ప్లాన్ విఫలం
పోలీసుల అదుపులో ఐదుగురు
పరారీలో మరో ఇద్దరు దొంగలు
దివాలా తీసిన వ్యాపారే సూత్రధారి
మరో వ్యాపారిని దోచుకునే ప్రణాళిక

2



సంఘటనా స్థలం వద్ద మోహరించిన బలగాలు

తిరుమలను కాంక్రీట్ జంగిల్‌గా మార్చొద్దు



భవన నిర్మాణాల విషయంలో అప్రమత్తంగా ఉండండి
టీటీడీకి స్పష్టం చేసిన హైకోర్టు
ప్రతివాదులకు నోటీసులు

13

కాల్పుల విరమణకు ఉక్రెయిన్ సై

సౌదీలో ఫలించిన అమెరికా చర్చలు
ఉక్రెయిన్‌కు సైనిక సాయం పునరుద్ధరణ

14

రోడ్లకు మహర్దశ!




- మరో 2వేల కి.మీ. పునర్నిర్మాణానికి ఓకే
- తక్షణమే చేపడతామన్న మంత్రి జనార్దన్‌రెడ్డి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ జమానాలో పూర్తిగా చిన్నాభిన్నమైపోయిన రహదారులను పునర్నిర్మించాలని కూటమి సర్కారు నిర్ణయించింది. గ్రామీణ, జిల్లా, రాష్ట్ర ప్రధాన(ఎస్‌హెచ్) రహదారులను తిరిగి 2014 నాటి స్థితికి తీసుకొచ్చేందుకు ఆర్ అండ్ బీకి భారీగా నిధులు ఆఫర్‌చేసింది. అదనంగా మరో రూ.1,860 కోట్ల నిధులు ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేసింది. దీంతో వివిధ పద్దుల కింద రహదారుల నిర్మాణానికి నిధులు ఇవ్వాలని కోరుతూ ఆర్థికశాఖకు ఇప్పటికే ఆర్‌అండ్‌బీశాఖ ప్రతిపాదనలు పంపించింది. మరోవైపు ఎమ్మెల్యేలు, ఇతరప్రజాప్రతినిధుల కోరిక మేరకు రూ.600 కోట్లతో నియోజకవర్గాల వారీగా రహదారుల నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ కార్యాచరణ సిద్ధం చేసింది. ఆ ప్రతిపాదనలు కూడా అందినట్లు రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 17వేల కి.మీ. పరిధిలోని అన్ని రకాల రహదారుల్లో గుంతలు పూడ్చేకార్యక్రమం నడుస్తోంది. ఈ నెలాఖరు నాటికి ఆ పనులు పూర్తికానున్నాయి. గుంతలు పూడ్చినా ఏమాత్రం బాగుపడని రోడ్లు, అంటే పూర్తిస్థాయిలో చిన్నాభిన్నమై, నిర్వహణకు నోచుకోని వాటిని పునర్నిర్మించాలని ఆర్‌అండ్‌బీశాఖ ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద జరిగిన సమావేశంలో ప్రస్తావించింది. అందుకు కనీసం వెయ్యికోట్లపైనే ఖర్చుకానుందని తెలిపింది. దీనికి ఆర్థిక శాఖతో చర్చించిన తర్వాత నిధులు ఇచ్చేందుకు సీఎం అంగీకారం తెలిపినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో 2వేల కి.మీ. పరిధిలోని 300 రోడ్లను పునర్నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. రూ.400 కోట్లను నాబార్డు కింద జిల్లా ప్రధాన రహదారుల (ఎండీఆర్) నిర్మాణం కోసం కేటాయించేందుకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు. గ్రామీణ, జిల్లా రహదారులపై ఇటీవల జిల్లాల వారీగా ఎమ్మెల్యేలతో మంత్రి మాట్లాడారు. ఏ ఏ రహదారులను తక్షణమే అభివృద్ధి చేయాలి? వేటిని పునర్నిర్మించాలనేది ప్రతిపాదనలు తీసుకున్నారు. తొలుత 230 రోడ్లను పునర్నిర్మించాలని నిర్ణయించారు. ప్లాన్ కింద 600 కోట్ల నిధులు ఇస్తామని ఆర్‌అండ్‌బీకి ఆర్థికశాఖ సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. దీంతో ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన నియోజకవర్గ రహదారులను ఈ నిధులతో చేపట్టేలా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గతంలో ఎన్‌డీబీ కింద చేపట్టి మధ్యలో వదిలేసిన రహదారులు, సీఆర్‌ఎఫ్‌లో వదిలేసినవి, ఇంకా, మధ్యలో పనిఆపేసిన పనులను కూడా ఈ జాబితాలోకి తీసుకురావాలని మంత్రి జనార్దన్‌రెడ్డి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

లోకం తీరు



ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లు మరో 2 నెలలు నిలిపివేత

- సర్కారు ఉత్తర్వులు

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): అసైన్డ్ భూముల దుర్వినియోగంపై విచారణకు గడువు మరో రెండు నెలలు పొడిగించారు. గడువు ముగిసినా విచారణ పూర్తి కాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్ల నిలుపుదల గడువు కూడా మంగళవారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో విచారణ పూర్తయ్యేవరకు అసైన్డ్ భూముల్లో శాశ్వత యాజమాన్య హక్కు(ఫ్రీ హోల్డ్) పరిధిలోకి వచ్చే భూముల రిజిస్ట్రేషన్లను నిలపుదల చేస్తూ రెవెన్యూశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఫ్రీ హోల్డ్ అక్రమాలపై విచారణ ఇంకా పూర్తికానందున రిజిస్ట్రేషన్ల నిలుపుదలను మరో రెండు నెలలు పొడిగిస్తున్నట్లు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అసైన్డ్ ఫ్రీ హోల్డ్ భూములపై విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. విచారణ దాదాపు 90 శాతం పూర్తయింది.

ఇంకా కొన్ని జిల్లాల్లో రికార్డుల పునఃపరిశీలన పూర్తికావాల్సి ఉంది. దీంతో విచారణ పూర్తయ్యేవరకు రిజిస్ట్రేషన్లు జరగవు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూశాఖ జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. అలాగే, గతంలో రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన ఫ్రీ హోల్డ్ భూముల డాక్యుమెంట్లను భద్రపరచాలని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా రిజిస్ట్రేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం ఈనెల 19వ తేదీన సచివాలయంలో భేటీ కానుంది. ఉపసంఘం ఏర్పాటు తర్వాత జరిగే తొలి సమావేశం ఇది. ఈ సమావేశంలో అసైన్డ్, ఇనాం భూములపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిసింది.

15న తణుకులో స్వచ్ఛాంధ్ర దివస్

- పాల్గొననున్న సీఎం చంద్రబాబు

అమరావతి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరిజిల్లా తణుకుపట్టణంలో ఈనెల 15న జరిగే స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొననున్నారు. ప్రతి నెలా మూడో శనివారాన్ని స్వచ్ఛాంధ్ర దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం-పునర్వియోగ వస్తువులకు ప్రోత్సాహం' అనే థీమ్‌తో ఈ నెల రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు మున్సిపల్ పట్టణాభివృద్ధిశాఖ తెలిపింది. ఈ కార్యక్రమాన్ని బహుళ శాఖల సమన్వయంతో అమలు చేయాలని ఇటీవల జరిగిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర సమీక్ష సమావేశంలో సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈమేరకు అన్ని జిల్లా కలెక్టర్లకు 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' పేరిట కార్యాచరణ మార్గదర్శకాలను విడుదల చేసింది.

నెలాఖరులోగా మొదటి సిలిండర్ బుక్ చేసుకోవాలి

- పౌర సరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): దీపం-2 పథకంలో ఇప్పటి వరకు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఒక్కసారిగా కూడా బుక్ చేసుకోనివారు ఈ నెలాఖరులోగా మొదటి సిలిండర్ బుక్ చేసుకోవాలని పౌర సరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్‌గౌర్ సూచించారు.

లేదంటే మూడు ఉచిత సిలిండర్లకు గాను ఒకటి కోల్పోతారని స్పష్టం చేశారు. ఏప్రిల్ నుంచి రెండో సిలిండర్ బుకింగ్‌లు ప్రారంభమవుతాయని తెలిపారు.సూపర్-6 హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'దీపం-2' పథకం కింద ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 97 లక్షల మంది లబ్ధిదారులు ఉచిత గ్యాస్ సిలిండర్లను బుక్ చేసుకోగా.. వారిలో 94 లక్షల మంది బ్యాంకు ఖాతాల్లో 48 గంటల్లోనే సబ్సిడీ డబ్బులు జమ చేసినట్లు బుధవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఇంకా 14 వేల మందికి సబ్సిడీ చెల్లింపులు పూర్తి కాలేదని వెల్లడించారు.

దోచుకుందామని వచ్చి దొరికిపోయారు

చిత్తూరులో డమ్మీ తుపాకులతో దోపిడీ యత్నం



పట్టుబడిన సుబ్రమణ్యాన్ని భవనంపై నుంచి కిందకు తీసుకొస్తున్న స్థానికులు

- స్థానికుల అప్రమత్తతతో ప్లాన్ విఫలం
- పోలీసుల అదుపులో ఐదుగురు

చిత్తూరు, అనంతపురం క్రైం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): డమ్మీ తుపాకులతో ఓ షాపులో దోపిడీకి ప్రయత్నించిన దొంగలు స్థానికుల అప్రమత్తతతో దొరికిపోయారు. దివాళా తీసిన ఒక వ్యాపారే ఈ దోపిడీ ప్రయత్నానికి సూత్రధారి కావడం గమనార్హం. మరో షాపు యజమానిని దోచుకునేందుకు వేర్వేరు జిల్లాల నుంచి ఆరుగురిని రప్పించి రంగంలోకి దిగాడు. వీరిలో ఐదుగురు పోలీసుల అదుపులో ఉండగా.. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. పోలీసుల కథనం మేరకు చిత్తూరు నగరం గాంధీరోడ్డులో చంద్రశేఖర్ రెడ్డి అనే వ్యక్తి చాలా ఏళ్లుగా 'పుష్ప కిడ్స్ వరల్డ్' షాపును నిర్వహిస్తూ ఆర్థికంగా బాగా స్థిరపడ్డారు. ఆయన నివాసం కూడా ఆ షాపు ఉన్న భవనంలోనే ఉంది. కాగా, చిత్తూరు కలెక్టరేట్ సమీపంలోని ఎస్‌ఎల్‌వీ ఫర్నిచర్స్ షాపు యజమాని సుబ్రమణ్యం మోసాలు చేస్తూ, ఐపీలు పెడుతూ కుదేలైపోయాడు. దీంతో చంద్రశేఖర్ రెడ్డిని దోచుకుందామని పథకం వేసిన సుబ్రమణ్యం తనకు పరిచయమున్న ఆరుగురిని అనంతపురం, నంద్యాల ప్రాంతాల నుంచి మంగళవారం ఉదయం చిత్తూరుకు రప్పించాడు. అప్పటికే మూడు డమ్మీ తుపాకులు, 15 డమ్మీ బుల్లెట్లు, గ్లౌజులు, మాస్కులు, కారం పొడి, నాలుగైదు కత్తులు కొనుగోలు చేశాడు. చంద్రశేఖర్ రెడ్డి ఎన్ని గంటలకు షాపు తెరుస్తారు, సిబ్బంది ఎన్ని గంటలకు వస్తారు తదితర సమాచారాన్ని సుబ్రమణ్యం తెలుసుకున్నాడు. ప్రణాళికలో భాగంగా సుబ్రమణ్యం సహా ఏడుగురు బుధవారం ఉదయం 6.20 గంటలకు పుష్ప కిడ్స్ వరల్డ్ దుకాణం ఎదుట ఓమ్నీ వ్యాను నిలిపి నేరుగా రెండో ఫ్లోర్‌లోకి వెళ్లి చంద్రశేఖర్ రెడ్డిని తుపాకులతో బెదిరించి డబ్బు, నగలు ఇవ్వాలని బెదిరించారు. చంద్రశేఖర్ రెడ్డి వెంటనే మరో గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుని బిగ్గరగా కేకలు పెట్టడంతో బయట ఉన్న స్థానికులు అప్రమత్తమయ్యారు. ఏడుగురు దుండగులు లోపలికి వెళ్లే సమయంలోనే పక్కనున్న టీ షాపులోని కొందరు వ్యక్తులు గమనించారు. చంద్రశేఖర్ కేకలతో వారు అప్రమత్తమై పోలీసులకు సమాచారమిచ్చారు. 15-20 నిమిషాల వ్యవధిలోనే సుమారు 50-60 మంది స్థానికులు అక్కడ గుమికూడారు. దొంగలు పారిపోకుండా వారంతా భవనాన్ని చుట్టుముట్టారు. అయితే, తప్పించుకునేందుకు దొంగలు పక్కనున్న పాత భవనంపైకి దూకేశారు. 15 అడుగుల ఎత్తు నుంచి దూకడంతో వారికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో స్థానికులు వారిని పట్టుకొని చితకబాదారు. వారిలో నలుగురు దొంగల్ని పోలీసులు అదుపులోకి తీసుకోగా, ముగ్గురు పారిపోయారు. ఆ ముగ్గురిలోనూ ఒకరిని అన్నమయ్య జిల్లా పరిధిలోని మదనపల్లె- ములకలచెరువు మధ్య అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. సుబ్రమణ్యంతోపాటు వ్యాను నడిపిన సంపత్, నవీన్, రాజశేఖర్, ఇబ్రహీమ్ పోలీసుల అదుపులో ఉన్నారు. పరారీలో ఉన్న ఇద్దరి వివరాలు తెలియాల్సి ఉంది.

బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లతో పోలీసులు..

స్థానికుల సమాచారంతో చిత్తూరు ఎస్పీ మణికంఠ సహా పోలీసు అధికారులు ఘటన స్థలానికి చేరుకున్నారు. బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు, చేతిలో పిస్టల్స్ పట్టుకుని రంగంలోకి దిగారు. ఉదయం 7 గంటల నుంచి 8 గంటల మధ్యలో ఆపరేషన్ పూర్తయింది. నలుగుర్ని అదుపులోకి తీసుకున్న తరువాత ఇంకా ముగ్గురు లోపలే ఉన్నారనే అనుమానంతో తిరుపతి ఆక్టోపస్ యూనిట్ రంగంలోకి దిగి పోలీసుల సహకారంతో ఆపరేషన్‌ను పూర్తిచేసింది. కాగా, కీలక నిందితుడు సుబ్రమణ్యం నంద్యాల జిల్లా కేంద్రంలో ఐపీ పెట్టి పలువురిని మోసం చేసినట్టు సమాచారం.

దొంగల్లో ముగ్గురు అన్నదమ్ములు!

- వారి తండ్రి రౌడీషీటర్

చిత్తూరులో దోపిడీకి ప్రయత్నించిన దొంగలలో ముగ్గురు అనంతపురం జిల్లా వాసులు ఉన్నట్లు తెలిసింది. జిల్లాలోని వజ్రకరూరు మండలం జరుట్ల రాంపురం గ్రామానికి చెందిన దొమ్మర రామాంజినేయులు, దొమ్మర రాజశేఖర్, దొమ్మర నెట్టికల్లు ఏడేళ్ల క్రితమే తల్లిదండ్రులతో కలిసి అనంతపురం నగరానికి వచ్చారు. రామాంజినేయులు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా, రాజశేఖర్, నెట్టికల్లు అనంతపురం మార్కెట్‌యార్డులోని కూరగాయల మార్కెట్‌లో కూలి పనులు చేస్తుంటారు. వీరి రేషన్‌కార్డులు, ఆధార్‌కార్డులు ఇప్పటికీ వజ్రకరూరు మండల పరిధిలోనే ఉన్నాయి. అప్పుడప్పుడు స్వగ్రామానికి వెళ్లి వస్తుంటారు. ఈ ముగ్గురిపై ఇప్పటి వరకు ఎలాంటి కేసులూ లేవు. కానీ, వీరి తండ్రి దొమ్మర రామకృష్ణపై వజ్రకరూరు పోలీస్‌స్టేషన్‌లో 2012లో రౌడీషీట్ నమోదైంది. పలు హత్య కేసుల్లో రామకృష్ణ నిందితుడు. ఈ రెండు కేసులనూ కొట్టివేశారు.

నెలాఖరుకు ఉద్యోగుల బకాయిల చెల్లింపు!

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల నుంచి పేరుకుపోయిన ఉద్యోగుల బకాయిలను చెల్లించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. జగన్ దిగిపోయే నాటికి ఉద్యోగుల బకాయిలు రూ.25 వేల కోట్లు ఉన్నాయని ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది. సంక్రాంతి సమయంలో ఉద్యోగుల బకాయిలను కొంత చెల్లించింది. ఈ నెలాఖరు నాటికి జీపీఎఫ్, రిటైర్‌మెంట్ ప్రయోజనాల రూపంలో రూ.4 వేల కోట్ల నుంచి రూ.5 వేల కోట్ల వరకు చెల్లించాలని భావిస్తోంది. ఈ నెలాఖరుకి కేంద్రం నుంచి నిధులు వచ్చే అవకాశం ఉందని, వాటిని ఉద్యోగుల బకాయిల చెల్లింపునకు ఉపయోగించనున్నట్టు ఆర్థిక శాఖ అధికారులు తెలిపారు.

పోలవరానికి రూ.2,704 కోట్లు జమ

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు పనులకు కేంద్రం రూ.2,704 కోట్ల అడ్వాన్స్ నిధులు విడుదల చేసింది. ఈ నిధులు బుధవారం రాష్ట్రానికి చేరాయి. కేంద్ర జలశక్తి ఆదేశాల మేరకు పోలవరం ప్రాజెక్టు కోసం ప్రత్యేకంగా తెరిచిన బ్యాంకు ఖాతాలో జమ చేశామని ప్రాజెక్టు చీఫ్ ఇంజనీరు నరసింహ మూర్తి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

టెన్త్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- పాఠశాల విద్యాశాఖ అధికారులతో సీఎస్ సమీక్ష

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ ఆదేశించారు. ఈ నెల 17 నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో బుధవారం సచివాలయంలో పాఠశాల విద్యాశాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, డీఈవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్ మినహా పరీక్షా కేంద్రంలోకి ఎవరూ సెల్‌ఫోన్లు తీసుకెళ్లకూడదని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాలకు వంద మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలు చేయాలని, సమీపంలోని జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లను పరీక్ష సమయంలో మూసి ఉంచాలని సూచించారు. పేపరు లీకేజీపై వదంతులు వ్యాప్తి చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎస్ ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 3,450 పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు పాఠశాల విద్య డైరెక్టర్ వి.విజయరామరాజు తెలిపారు. వాటిలో 163 కేంద్రాలు సున్నితమైనవిగా గుర్తించామన్నారు. మొత్తం 6,19,275 మంది టెన్త్ పరీక్షలు రాయబోతున్నారని వివరించారు. 156 ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, 682 సిటింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఓపెన్‌స్కూల్ పరీక్షలకు 30334 మంది హాజరవుతారని తెలిపారు.

మోడల్ స్కూళ్లలో ఇంటర్ అడ్మిషన్లు

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 164 మోడల్ స్కూళ్లలో ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు పాఠశాల విద్యాశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 17 నుంచి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉంటుందని, 18 నుంచి 22లోగా దరఖాస్తులు సమర్పించాలని తెలిపింది. టెన్త్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా మెరిట్ ప్రాతిపదికపై మే 26న విద్యార్థులకు సీట్లు కేటాయిస్తారు.

15 నుంచి ఈఏపీసెట్ దరఖాస్తులు.. మేలో పరీక్షలు

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీలో ప్రవేశాలకు నిర్వహించే ఈఏపీసెట్ నోటిఫికేషన్‌ను ఉన్నత విద్యామండలి బుధవారం విడుదల చేసింది. ఈనెల 15 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభవుతుందని, అపరాధ రుసుము లేకుండా ఏప్రిల్ 24 వరకు దరఖాస్తులు సమర్పించవచ్చని వివరించింది. ఫైన్‌తో మే16 వరకు దరఖాస్తు చేసుకోచవ్చని పేర్కొంది. మే12 నుంచి విద్యార్థులు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చంది. మే 19, 20 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మా స్ట్రీమ్ ప్రవేశ పరీక్షలు, 21 నుంచి 27 వరకు ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్షలు జరగనున్నాయి. ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 13(నేడు) నుంచి ఏప్రిల్ 9 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని, మే 7న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపింది. ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలకు ఈసెట్‌కు ఈనెల 12 నుంచి ఏప్రిల్ 7 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని, మే 6న ప్రవేశ పరీక్ష జరుగుతుందని వివరించింది.

కోటరీ వల్లే జగన్‌కు దూరం

- కోటరీ నుంచి బయటపడితేనే భవిష్యత్తు
- వైసీపీలో అవమానాలు, ఇబ్బందులు: విజయసాయి

విజయవాడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్ చుట్టూ ఉన్న కోటరీ వల్లే ఆ పార్టీని వదిలి బయటకు వచ్చానని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి తెలిపారు. వైసీపీలోని ద్వితీయశ్రేణి నాయకులు తనకు, అధినేత జగన్‌కు మధ్య అభిప్రాయ భేదాలు సృష్టించారని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి వ్యాఖ్యానించారు. జగన్ మనస్సు విరిచి ఆయననుంచి తనను దూరం చేయడంలో వారు విజయం సాధించారన్నారు. కాకినాడ సీపోర్టు వ్యవహారంలో బుధవారం సీఐడీ విచారణ అనంతరం మీడియాతో విజయసాయి మాట్లాడారు. మూడున్నరేళ్లలో అవమానాలు ఎదుర్కొని తాను దిగిన ప్రతి మెట్టులోను చాలామంది పాత్రధారులు, సూత్రధారులు ఉన్నారని వ్యాఖ్యానించారు. వైసీపీ నుంచి బయటకు రావడం వల్ల తాను ఏవిధంగాను నష్టపోలేదన్నారు. ఆ పార్టీలో ఉన్నంత కాలం చిత్తశుద్ధితో పనిచేశానని, అక్కడినుంచి బయటకు వచ్చినా జగన్ బాగుండాలని కోరుకుంటున్నానని తెలిపారు. అయితే, చుట్టూ ఉండే కోటరీ నుంచి బయటపడినప్పుడే జగన్‌కు భవిష్యత్తు ఉంటుందని, ఇంతకన్నా తాను చెప్పగలిగిందేమీ లేదన్నారు. "బయటినుంచి వెళ్లే సమాచారం తనకు అనుకూలంగా ఉంటున్నప్పుడు, ఆర్థికంగా, రాజకీయంగా తనకు లాభం ఉందనుకున్న వారిని మాత్రమే జగన్ వద్దకు కోటరీ పంపుతుంది. లేకపోతే దేవుడి వద్దకు చేరుకోలేం. నాయకుడు చెప్పుడు మాటలను నమ్మకూడదు. దానివల్ల నాయకుడితోపాటు పార్టీ, ప్రజలు కూడా నష్టపోతారు. వైసీపీలో ప్రస్తుతం అదే జరుగుతోంది." అని విజయసాయి వివరించారు. జగన్ మనస్సులో తనకు స్థానం లేదని తెలిసినప్పుడు మనస్సు విరిగిపోయిందని, ఇక వైసీపీలో కొనసాగాల్సిన అవసరం లేదని జగన్‌కు చెప్పి వచ్చేశానన్నారు. చుట్టూ ఉన్న వారి మాటలు వినవద్దని, ప్రజలకు భవిష్యత్తులో ఎంతో సేవ చేయాలని లండన్‌లో ఉన్నప్పుడు ఫోన్‌లో జగన్‌కు చెప్పానన్నారు. తిరిగి వైసీపీలో చేరే ఉద్దేశం లేదని స్పష్టంచేశారు. ఘర్‌వాపసీ తనకు వర్తించదని, ప్రస్తుతం వ్యవసాయం చేసుకుంటున్నానని తెలిపారు. వేరే రాజకీయ పార్టీలో చేరే ఉద్దేశం లేదని తెలిపారు. సీఐడీ అధికారుల ఎదుట ఏ విషయాలు చెప్పానో, భవిష్యత్తులోను భగవంతుడి సాక్షిగా అవే విషయాలు చెబుతానని విజయసాయి వ్యాఖ్యానించారు. .

పని ఒత్తిడిలో 52 శాతం ఉద్యోగులు

న్యూఢిల్లీ, మార్చి 12: కొవిడ్ తర్వాత ఉద్యోగులు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారని తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఉద్యోగం, వ్యక్తిగత జీవితాన్ని బ్యాలెన్స్ చేసుకోలేక భారత్‌లోని దాదాపు 52% మంది ఉద్యోగులు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని న్యూయార్క్ కేంద్రంగా పనిచేస్తున్న వెర్టెక్స్ గ్రూప్ తాజా సర్వేలో వెల్లడించింది. ఈ సంస్థ ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, పంజాబ్ తోపాటు ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న మొత్తం 1500 మందిపై సర్వే నిర్వహించి ఫలితాలను వెల్లడించింది. 23 శాతంపైగా ఉద్యోగులు సాధారణ పని గంటలకు మించి పనిచేస్తున్నారని ఈ సర్వే వెల్లడించింది.

చేసిందంతా విక్రాంత్‌రెడ్డే

(మొదటి పేజీ తరువాయి)

తన ప్రమేయం లేదని స్పష్టంగా చెబుతున్నానన్నారు. కేవీ రావు ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై సీఐడీ అధికారులు విచారించారని తెలిపారు. "కేవీ రావు తెలుసా? అని అధికారులు ప్రశ్నించారు. ఆయనతో ముఖ పరిచయం ఉంది తప్ప, ఎలాంటి సామాజిక, రాజకీయ, ఆర్థిక సంబంధాలు లేవని అధికారులకు స్పష్టం చేశాను. అరబిందో కంపెనీ నుంచి సుమారుగా రూ.500 కోట్ల బదిలీ జరిగిన విషయంపై ప్రశ్నించారు. దాని గురించి ఎవరూ నాకు చెప్పలేదని, తెలియదని సమాధానం ఇచ్చాను. నా కుమార్తెను అరబిందోకు చెందిన కుటుంబంలో ఇచ్చానని, ఆ కంపెనీకి సంబంధించిన ఆర్థిక, వ్యాపార వ్యవహారాల్లో నేను ఎప్పుడూ జోక్యం చేసుకోలేదని తెలిపాను. విక్రాంత్‌రెడ్డి తెలుసా అని అధికారులు అడిగారు. వైవీ సుబ్బారెడ్డి కుమారుడిగా నాకు తెలుసునని చెప్పాను. సీ పోర్టు వ్యవహారాల్లో జరిగిన లావాదేవీలు నేను, విక్రాంత్‌రెడ్డి కలిసి చేశామా? అని అధికారులు ప్రశ్నించారు. ఈ విషయంలో నా ప్రమేయం ఏమాత్రం లేదని చెప్పాను. ఆరోపణలు వచ్చిన కేసులో నా పేరు ఎందుకు చేర్చారని కొంతమంది కామన్ స్నేహితుల ద్వారా అడిగించాను. ఒక అధికారి ఆదేశాలతో నా పేరు చేర్చానని కేవీ రావు కామన్ స్నేహితుడికి చెప్పారు. వైవీ సుబ్బారెడ్డి, కేవీ రావు అత్యంత ఆప్త మిత్రులని సీఐడీకి వివరించాను. విక్రాంత్‌రెడ్డిని కేవీ రావుకు నేను పరిచయం చేయాల్సిన అవసరం లేదు. సుబ్బారెడ్డి ఎప్పుడు కాలిఫోర్నియాకు వెళ్లినా కేవీ రావుకు చెందిన రాజభవనంలో నివసిస్తారు. సీ పోర్టు వ్యవహారాన్ని ఆది నుంచి అంతిమం వరకు విక్రాంత్‌రెడ్డి నడిపించారని కేవీ రావు కామన్ స్నేహితులకు చెప్పారు. ఇదే విషయాన్ని సీఐడీకి వివరించాను" అని వెల్లడించారు.



సీఐడీ కార్యాలయం నుంచి బయటకు వస్తున్న సాయిరెడ్డి

విజయసాయి కేసులపై ఆరా

కాకినాడ సీ పోర్టు షేర్లను కేవీ రావు నుంచి బదలాయించుకున్న తర్వాత విక్రాంత్ రెడ్డికి, ఆయనకు మధ్య బంధం మరింత బలపడిందని సీఐడీ విచారణలో విజయసాయి చెప్పినట్టు సమాచారం. అందుకే షేర్లు బదిలీ అయినా కాకినాడ సీ పోర్టు ప్రైవేట్ లిమిటెడ్‌కు కేవీ రావు చైర్మన్‌గా కొనసాగారని వివరించారు. ఈ షేర్ల బదిలీ వ్యవహారంలో తన ప్రమేయం ఉందో లేదో స్వయంగా కేవీ రావును పిలిచి మాట్లాడాలని సూచించినట్టు తెలిసింది. ఇప్పటివరకు కేవీ రావుకు తాను ఏనాడూ ఫోన్ చేయలేదని, షేర్ల వ్యవహారం గురించి మాట్లాడలేదని చెప్పినట్టు విశ్వసనీయంగా తెలిసింది. దర్యాప్తు అధికారులు విజయసాయిపై ఉన్న కేసుల గురించి ప్రశ్నించగా.. తనపై కేసులున్నమాట వాస్తవమేనని ఆయన అంగీకరించారు. అందుకోసమే తనను ఈ కేసులో ఏ2గా పెట్టారన్నారు. తమకు పాత కేసులతో సంబంధం లేదని, ఫిర్యాదును బట్టి కేసు నమోదు చేశామని అధికారులు అన్నట్టు తెలిసింది. విజయసాయి చెప్పిన ప్రతి మాటను అధికారులు వాంగ్మూలంగా నమోదు చేశారు.

ఆ విషయం ధనుంజయరెడ్డి చెప్పారు

"ఆడిట్ నివేదికలకు సంబంధించి శ్రీధర్ అండ్ సంతానం కంపెనీ నా పేరు చెబుతోందని సీఐడీ అధికారులు ప్రశ్నించారు. నా పేరు చెప్పిన శ్రీధర్ అండ్ సంతానం కంపెనీ వేంకటేశ్వరస్వామి సాక్షిగా చెప్పాలని జవాబు ఇచ్చాను. వాళ్లు ఎవరో నాకు తెలియదని చెప్పాను. మనోహర్ చౌదరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టడ్ అకౌంటెంట్స్‌కు అధ్యక్షుడన్న విషయం తెలుసునని సమాధానం చెప్పాను. ముంబైకి చెందిన కంపెనీ ఏమాత్రం తెలియదని వివరించాను. ఆడిట్ కోసం శ్రీధర్ అండ్ సంతానం ఆడిట్ కంపెనీని ధనుంజయరెడ్డి ద్వారా నేనే సిఫార్సు చేయించానని అధికారులు అడిగారు. శ్రీధర్ అండ్ సంతానం కంపెనీని అప్పటి పరిశ్రమల శాఖ కార్యదర్శిగా ఉన్న కరికాల వలవన్ తీసుకొచ్చారని ధనుంజయరెడ్డి చెప్పారని అధికారులకు తెలియజేశాను. ఇందులో ధనుంజయరెడ్డికి సంబంధం లేదు. కరికాల వలవన్ తమిళుడు కాబట్టి, తమిళనాడుకు చెందిన కంపెనీని ఆయన అపాయింట్ చేశారని తెలిసింది. ఇదే విషయాన్ని అధికారులకు చెప్పాను. ఉత్తరాంధ్రలో లేటరైట్ గనుల్లో వేల కోట్ల రూపాయలను విక్రాంత్‌రెడ్డితో కలిసి ఆర్జించానని అధికారులు అడిగారు. విక్రాంత్‌రెడ్డి కోట్లాది రూపాయలు ఆర్జించారో లేదో నాకు తెలియదని, నేను ఉత్తరాంధ్రలో ప్రజాదర్బార్ నిర్వహించినప్పుడు విక్రాంత్‌రెడ్డికి చెందిన మైనింగ్ కంపెనీలో ఉద్యోగాలు ఇప్పించాలని కొందరు వినతి పత్రాలు ఇచ్చారన్న విషయాన్ని అధికారులకు వివరించాను" అని విజయసాయి తెలిపారు.

జగన్ పాత్ర గురించి ప్రశ్నించారు

ఈడీ పది కేసులతో పాటు సీబీఐ 11 కేసుల్లో అప్పటి జేడీ లక్ష్మీనారాయణ తనను ఏ2గా పెట్టారు కాబట్టి కాకినాడ సీ పోర్టు కేసులోను ఏ2గా చేర్చారని విజయసాయి అన్నారు. తనకు ఏ2ను స్థిరం చేశారని వ్యాఖ్యానించారు. ఎక్కడ ఏ కేసు నమోదు చేసినా తనను ఏ2గా చేశారన్నారు. కాకినాడ సీ పోర్టు కేసు నమోదు చేసే సమయానికి తాను ఇంకా ఎంపీ పదవికి, పార్టీకి రాజీనామా చేయలేదని తెలిపారు. పార్లమెంటు వెలుపల మీడియాతో ఈ కేసుపై మాట్లాడానన్నారు. అప్పటికి తనకు పూర్తి వివరాలు తెలియవన్నారు. ఇప్పుడు ఈ కేసుపై ఎవరెవరు ఏం చేశారు? ఎలా చేశారన్న దానిపై పూర్తి అవగాహన వచ్చిందన్నారు. కాకినాడ సీ పోర్టు వ్యవహారంలో జగన్ లబ్ధిదారుడని, ఆయనను పక్కకు తప్పించడానికి తాను, విక్రాంత్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నామని సీఐడీ అధికారులు ప్రశ్నించారని తెలిపారు. ఆ విషయాలు ఏవీ తనకు తెలియవని చెప్పానన్నారు. ఈ కేసులో ఉన్న శరత్‌చంద్రారెడ్డి తన అల్లుడికి సోదరుడు కాబట్టి తాను చెప్పిన విషయాన్ని నమ్మకపోవచ్చన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశానన్నారు. తన అల్లుడికి సంబంధించిన వ్యాపార వ్యవహారాల్లో తాను ఏనాడూ జోక్యం చేసుకోలేదని చెప్పారు. తనకు కుటుంబ సంబంధాలు ముఖ్యమని, వ్యాపార సంబంధాలు ముఖ్యం కాదని వ్యాఖ్యానించారు. ఆ కంపెనీలో ఒక్క ఉద్యోగమూ తాను అడగలేదన్నారు. జగన్‌కు ఈ డీల్‌లో సంబంధం ఉందా అని అధికారులు అడగ్గా, ఆయనకు సంబంధం లేదని చెప్పానని వివరించారు.

ఫిర్యాదులో రాజకీయ కుట్ర

కాకినాడ సీ పోర్టుకు సంబంధించి కేవీ రావు దురుద్దేశపూర్వకంగా ఫిర్యాదుచేశారని విజయసాయి వ్యాఖ్యానించారు. ఈ ఫిర్యాదులో రాజకీయకుట్ర దాగి ఉందన్నారు. ఈ విషయాన్ని ఇంతకుముందు చెప్పానని, ఎప్పుడూ చెబుతానని అన్నారు. తనపై ఫిర్యాదును ఎవరు డ్రాఫ్ట్ చేశారన్న విషయం ఓ అధికారికి, కేవీ రావుకు తెలుసన్నారు. తనకు రక్షణ అవసరం కాబట్టి ఆ అధికారి ఎవరన్నది బహిరంగంగా చెప్పలేనన్నారు. కేసు ఇక్కడితో ఆగినా, ఆగకపోయినా తనకు వచ్చే నష్టమేమీ లేదన్నారు. కేవీ రావు తనతో మాట్లాడినట్టు, కేవీ రావుతో తాను మాట్లాడినట్టు కాల్ రికార్డ్స్ ద్వారా నిరూపించాలని సవాల్ విసిరారు. ప్రజాదర్బారు నిర్వహించినప్పుడు ఉద్యోగాల కోసం వినతి పత్రాలు ఇచ్చినప్పుడు ఫోన్ చేసేవాడినని, ఎవరి నుంచి ఎలాంటి ప్రతిఫలం ఆశించలేదని, ఆశించేవాడిని కాదని అన్నారు.

మరోసారి విచారణకు!

కానూరులోని సీఐడీ విజయవాడ ప్రాంతీయ కార్యాలయానికి ఉదయం 11 గంటలకు విజయసాయిరెడ్డి న్యాయవాదులతో కలిసి చేరుకున్నారు. సిబ్బంది న్యాయవాదులను గేటు వద్ద అడ్డుకున్నారు. విజయసాయిని మాత్రమే లోపలికి పంపారు. అదనపు ఎస్పీ ప్రసాద్, డీఎస్పీ శ్రీనివాసరావు, ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు ఎస్ఐలు ఆయనను విచారించారు. అనేక ప్రశ్నలను వారు సంధించారు. ప్రతి ప్రశ్నకు విజయసాయి సమాధానం ఇచ్చినట్టు తెలిసింది. మరికొద్ది రోజుల్లో ఆయనను మరోసారి విచారణకు పిలిచే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది.

పర్యావరణహిత నగరంగా శ్రీసిటీ

- నిర్మాణ పనుల్లో 90శాతం ఎం-శాండ్ వినియోగం
- మట్టి పునర్వినియోగంపై మార్గదర్శకాలు

వరదయ్యపాళెం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీని పర్యావరణ హిత నగరంగా తీర్చిదిద్దేందుకు యాజమాన్యం తన పారిశ్రామిక భాగస్వాములతో కలిసి స్థిరమైన వనరుల వినియోగ విధానాలను మరింత బలోపేతం చేస్తోంది. రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్.. అనే వృత్తాకార ఆర్థిక వ్యవస్థ (సర్క్యులర్ ఎకానమీ) మూల సూత్రాల ఆధారంగా పర్యావరణానికి హానిని గణనీయంగా తగ్గించే చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా అన్ని నివాస, వాణిజ్య, పారిశ్రామిక ప్రాజెక్టుల పనుల్లో ఇసుకకు ప్రత్యామ్నాయంగా ఎం-శాండ్ (గ్రానైట్ రాళ్ల పొడితో తయారయ్యే ఇసుక)ను విధిగా 90 శాతం ఉపయోగించాలని నిర్ణయించింది. ఫిల్లింగ్ కోసం బయట మట్టిని కొనుగోలు చేయడం తగ్గించి ఆయా ప్లాట్లలో తవ్విన మట్టినే ఉపయోగించే విధానాన్ని ప్రోత్సహించనుంది. దీంతో పాటు భూ ఉపరితలాన్ని సమర్థంగా నిర్వహించి వర్షపు నీటి సంరక్షణ, నీటి నిల్వకు ఉత్తమ పరిష్కారాలు చూపనుంది. హరిత నగర లక్ష్యాన్ని సాధించే దిశగా సుస్థిర వనరుల నిర్వహణ, పర్యావరణ హిత కార్యకలాపాలను అమలు చేయడంలో శ్రీసిటీ ఎప్పుడు ముందుంటుందని ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి చెప్పారు. సర్క్యులర్ ఎకానమీ సూత్రాలను అవలంబించడం ద్వారా స్థిరమైన పారిశ్రామిక వృద్ధికి దోహదపడే చర్యలను అమలు చేస్తామన్నారు. కాలుష్య రహిత ఇంధన వినియోగాన్ని వేగవంతం చేసేందుకు ఏజీ అండ్ పీ నెట్‌వర్క్ ద్వారా.. కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్‌ను శ్రీసిటీ అందుబాటులోకి తెచ్చిందన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాన్ని అందించే పద్ధతి వల్ల ఉత్పత్తి నాణ్యత మెరుగుపడటమే కాకుండా బొగ్గు వినియోగంతో ఏర్పడే కాలుష్య బెడదను అరికడుతుందన్నారు. పారిశ్రామిక సంస్థలు వీలైనంత త్వరగా సీఎన్‌జీకి మారడం ద్వారా ఈ ప్రయోజనాలను అందిపుచ్చుకోవచ్చని తెలిపారు. ఈ నూతన విధానాల అమలు ద్వారా పారిశ్రామికాభివృద్ధికి, పర్యావరణ పరిరక్షణకు మధ్య సమతుల్యతను నెలకొల్పి ప్రముఖ సుస్థిర పారిశ్రామిక కేంద్రంగా శ్రీసిటీ తన నిబద్ధతను చాటుకుంటుందని వెల్లడించారు.



శ్రీసిటీ : పర్యావరణ హిత సుస్థిర చర్యలు

విశాఖ నుంచి రాయ్‌పూర్, ఇండోర్‌కు విమాన సర్వీసులు

విశాఖపట్నం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి రాయ్‌పూర్, ఇండోర్‌లకు ఈ నెల 31వ తేదీ నుంచి ఇండిగో విమాన సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. ఇవి వారంలో ఐదు రోజులు (సోమ, మంగళ, బుధ, గురు, శుక్రవారం) అందుబాటులో ఉంటాయని ఏపీ టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ ప్రతినిధులు కె.విజయమోహన్, ఓ.నరేశ్‌కుమార్ తెలిపారు. రాయ్‌పూర్ విమానం ఉదయం 8.50 గంటలకు అక్కడ బయలుదేరి 10.20 గంటలకు విశాఖపట్నం వస్తుంది. తిరిగి ఇక్కడ ఉదయం 11 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12.30 గంటలకు రాయ్‌పూర్ చేరుతుంది. ఇండోర్ విమానం ఉదయం 6.35 గంటలకు అక్కడ బయలుదేరి 10.20 గంటలకు విశాఖపట్నం చేరుతుంది. తిరిగి ఇక్కడ ఉదయం 11 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 2.45 గంటలకు ఇండోర్ చేరుతుంది.

శ్రీవారి సేవలో జస్టిస్ గోపాలకృష్ణారావు


శ్రీవారి ఆలయం ముందు జస్టిస్ గోపాలకృష్ణారావు

తిరుమల, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు బుధవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అంతకుముందు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సి.నాగప్పన్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం, అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

'అధిస్తాన్'కు ప్రభుత్వ సహకారం

- సీఎం భరోసా ఇచ్చారు: 'బ్రాండిక్స్' దొరస్వామి


అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన దొరస్వామి

అనకాపల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భరోసా ఇచ్చారని అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలంలో గల 'అధిస్తాన్' (బ్రాండిక్స్) సంస్థ భారత్ భాగస్వామి దొరస్వామి తెలిపారు. బుధవారం ఆయన అమరావతిలో ముఖ్య మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బ్రాండిక్స్ సంస్థ పేరు 'అధిస్తాన్' ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ పార్కుగా మార్పు, విస్తరణ, ఉపాధి పెంపు లక్ష్యాలను చంద్రబాబుకు వివరించారు. అధిస్తాన్‌గా పేరు మార్పుతో వస్త్ర పరిశ్రమతో పాటు నూతనంగా ఫార్మా, మాన్యుఫ్యాక్చరింగ్ పరిశ్రమలు ఇండస్ట్రియల్ పార్కులో విస్తరించే అవకాశం ఉందని తెలిపారు. సంస్థలో ప్రస్తుతం 20 వేల మంది మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ గ్రామీణ ప్రాంత ప్రజల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కృషిచేస్తున్నట్టు వివరించారు. దీనిపై స్పందించిన సీఎం మాట్లాడుతూ మరొక 20 వేల మందికి ఉపాధి కల్పించే దిశగా చర్యలు వేగవంతం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎటువంటి సహకారం అవసరమైనా అందిస్తామని భరోసా ఇచ్చారని దొరస్వామి బుధవారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

అత్యాచారం కేసులో జీవిత ఖైదు

నరసాపురం: పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో బాలికపై అత్యాచారం జరిగినట్టు 2017లో ఫిర్యాదు రావడంతో పోలీసులు కేసు నమోదు చేసి, పేదారి నర్సింహరాజును నిందితుడిగా పేర్కొన్నారు. నేరం రుజువు కావడంతో భీమవరం పోక్సో కోర్టు న్యాయమూర్తి డాక్టర్ బి.లక్ష్మీనారాయణ ముద్దాయికి జీవితకాల శిక్ష, రూ.50 వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బలూచ్ హెచ్చరిక!

బలూచిస్థాన్ వేర్పాటువాదులు ఒక రైలును హైజాక్ చేసిన ఉదంతం పాకిస్థాన్‌కు అత్యంత అవమానకరం. కథ సుఖాంతమైందని, ముప్పైమూడుమంది ఉగ్రవాదులను కాల్చిపారేశామని పాకిస్థాన్ ప్రభుత్వం చెబుతోంది. ఈ ఆపరేషన్‌లో మరణించిన సైనికుల, సామాన్యుల సంఖ్యకు సంబంధించి వేర్వేరు ప్రకటనల్లో తేడాలున్నప్పటికీ, సామాన్యులు బయటపడినందుకు సంతోషించాల్సిందే. మానవబాంబులుగా మారిన బలూచ్ తిరుగుబాటుదారుల గుప్పిట్లో ఐదువందల మందికి పైగా ప్రయాణికుల ప్రాణాలు ఉన్నందున, తక్కువ ప్రాణ నష్టంతో ఎక్కువమందిని ఆదుకోవడం సులువేమీకాదు. ఈ అత్యంత సంక్లిష్టమైన ఆపరేషన్‌లో ప్రస్తుతానికి పాకిస్థాన్ పైయి సాధించినప్పటికీ, ఇంతకాలమూ మూడు చీలికలుగా ఒకే లక్ష్యంకోసం పోరాడుతున్న శక్తులు ఇటీవలలై ఒక్కటైన తరువాత బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) ఎంత బలంగా తయారైందో ఈ ఘటన తెలియచెబుతోంది.

ఈ మార్గంలో ఎంతోకాలంగా నిలిచిపోయిన క్వెట్టా–పెషావర్ రైలు సర్వీసును ఇటీవలే తిరిగి ఆరంభించి, ఉగ్రవాదులకు భయపడేది లేదని పాకిస్థాన్ ప్రభుత్వం గొప్పలకు పోతున్న తరుణంలో ఈ ఘటన జరిగింది. 17 సొరంగాలున్న ఈ మార్గంలో, సాధారణ ప్రయాణికులతో పాటు నిరాయుధులైన సైనికులు కూడా పెద్దసంఖ్యలో ఆ రైలులో ప్రయాణిస్తున్నందున అది ఈ తరహా ప్రమాదాన్ని ఎదుర్కోవడంలో ఆశ్చర్యమేమీ లేదు. క్వెట్టాకు 150 కిలోమీటర్ల దూరంలోని మెష్కాఫ్ సొరంగంలో ఆ రైలు వందమంది సాయుధుల చేతికి చిక్కింది. బీఎల్ఏ హెచ్చరికలను, డిమాండ్లను పాకిస్థాన్ సైన్యం ఏ మాత్రం లక్ష్యపెట్టకుండా డ్రోన్లు, హెలికాప్టర్లతో అతివేగంగా ప్రతిస్పందించిందని, ఒక దశలో కాస్తంత తగ్గినా, తిరిగి విరుచుకుపడిందని వార్తలు వచ్చాయి. ఇప్పటివరకూ బీఎల్ఏ అనేక విధ్వంసాలు, ఆత్మాహుతిదాడులతో పాకిస్థాన్‌మీద కక్షతీర్చుకుంటున్నప్పటికీ, ఏకంగా ఒకరైలును హైజాక్ చేయడం, ఇలా సామాన్యులను బందీలుగా ఉంచుకోవడం ఎన్నడూ లేదు. ఈ ఆపరేషన్‌లో పాకిస్థాన్ ప్రభుత్వం అత్యంత నిరంకుశంగా, మరణాలను బీఎల్ఏ ఖాతాలో వేయవచ్చునన్న మొండిధైర్యంతో వ్యవహరించిందన్న ఆరోపణలు లేకపోలేదు. అలాగే, తిరుగుబాటుదారులు తమకు తాముగా విడుదల చేసిన మహిళలు, పిల్లల సంఖ్యలోనూ, సైనిక చర్య కారణంగా విడుదలైనవారి సంఖ్యలోనూ కొంత కలగాపులగం జరగవచ్చును. కొన్ని నిజాలు ఎన్నటికీ వెలుగుచూడని ఉదంతం ఇది.

పొరుగుదేశం ఆర్థిక, ఆయుధ సాయంతో బీఎల్ఏ రెచ్చిపోతున్నదంటూ పాకిస్థాన్ హోంశాఖ సహాయమంత్రి ఆఫ్ఘానిస్థాన్‌మీద విమర్శలు చేశారు. తెహ్రీక్ ఎ తాలిబాన్ పాకిస్థాన్ పేరు కూడా ప్రస్తావిస్తూ, తమ దేశం చల్లగా చక్కగా ఎదుగుతూంటే చూడలేని శక్తులన్నీ కలసికుట్రచేస్తున్నాయన్నారు. వీటికి మన శత్రువు భారతదేశం మద్దతు కూడా ఉన్నదని వ్యాఖ్యానించి కక్షతీర్చుకున్నారు. పాకిస్థాన్ సైన్యానికీ, బీఎల్ఏకీ మధ్య దశాబ్దాలుగా యుద్ధం సాగుతూనే ఉంది. దీనికితోడు, 2021లో తాలిబాన్ అధికారంలోకి వచ్చిన తరువాత అఫ్ఘానిస్థాన్‌తో వ్యవహారం మరీ చెడింది. పాక్ పశ్చిమ, నైరుతిప్రాంతాలు మండుతూనే ఉన్నాయి.


బలూచిస్థాన్ స్వాతంత్ర్యకాంక్షను అణచివేసేందుకు ఏడున్నర దశాబ్దాలుగా పాకిస్థాన్ అత్యంత అమానుషంగా వ్యవహరిస్తూ వస్తోంది. ఒక స్వతంత్ర సంస్థానంగా దాని విలీనం కూడా స్థానిక నాయకుల అభీష్టానికి వ్యతిరేకంగా జిన్నా కుట్రలూ, కుతంత్రాల మధ్యన జరిగిందని అంటారు. అత్యంత విలువైన ఖనిజనిక్షేపాలున్న ఈ ప్రాంతం చేజారిపోకుండా ఉండటానికి పాకిస్థాన్ పాలకులు ఈ ప్రావిన్సులో బూటకపు ఎన్నికలు నిర్వహిస్తూ, కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ప్రతిష్ఠిస్తుంటే, స్థానిక తెగలమధ్య చిచ్చు పెడుతూ బలూచ్‌లు బలపడకుండా సైన్యం జాగ్రత్తపడుతూంటుంది. సహజవనరులన్నా, నిరుపేదగా మిగిలిపోయిన ఈ ప్రావిన్సులో చైనా ఆరంభించిన బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ (బీఆర్ఐ) మరింత అశాంతిని రగిలించింది. స్వాతంత్ర్యం కోసం, వనరుల దోపిడీకి వ్యతిరేకంగానూ పోరాడుతున్న బలూచ్‌లను ఊచకోత కోయడం కాక, సయోధ్యతో దారికి తెచ్చుకున్నప్పుడే పాక్ పశ్చిమప్రాంతంలో హింస కాస్తంతైనా తగ్గుముఖం పడుతుంది. బలూచ్‌లను దేశ భద్రతకు ప్రమాదకారులుగా భావిస్తున్నంతకాలం వారి ఆవేదన అర్థంకాదు, సమస్య పరిష్కారం కాదు. బీఎల్ఏ ఇటీవలి కాలంలో జరిపిన దాడులను బట్టి అది మరింత శక్తిమంతంగా తయారైన విషయం అర్థమవుతూనే ఉంది. రైలు హైజాక్ ఘటన పాకిస్థాన్‌కే కాదు, చైనాకు కూడా ఓ బలమైన హెచ్చరిక.

నియోజకవర్గాల పునర్విభజన అవసరమా?

భారత్‌కు ఇప్పుడు అవసరమైనది ఏమిటి? లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన. ఎంత మాత్రం కాదు. ప్రభుత్వమూ, ప్రజలు ఆలోచించాల్సిన విషయాలలో అది ఆఖరిది అవడం మంచిది. ఆ పునర్విభజన ప్రక్రియను మరో 30 సంవత్సరాల పాటు వాయిదా వేయాలని కోరుతూ తమిళనాడులో అఖిలపక్ష సమావేశం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. కేవలం ఒక రాష్ట్రం లేదా ఒక ప్రాంత ప్రయోజనాలను కాపాడుకునే నిమిత్తం ఆమోదించిన తీర్మానం కాదు అది. జాతీయ సమైక్యతను మరింత పటిష్ఠం చేసేందుకు ఉద్దేశించిన తీర్మానమది. లోక్‌సభా సీట్ల పునః కేటాయింపును శాశ్వతంగా నిలిపివేయడమే భారత్ సమైక్యతను కాపాడుతుంది. దేశ సమైక్యతకు ఎదురయ్యే సవాళ్లనన్నిటినీ సమర్థంగా ఎదుర్కొనేందుకు పునర్విభజన నిలిపివేత దోహదం చేస్తుంది. భారత గణతంత్ర రాజ్య సంస్థాపనలో అంతర్ గర్భితంగా ఉన్న 'సమాఖ్య ఒప్పందం'ను గౌరవించేందుకు ఉత్తమ మార్గం లోక్‌సభా సీట్ల ప్రస్తుత కేటాయింపును ఎటువంటి మార్పు లేకుండా యథాతథంగా కొనసాగించడమే; రాజ్యాంగ నిర్మాతలు నిర్దేశించిన అధికార –భాగస్వామ్య ఒప్పందాన్ని అనుల్లంఘనీయమైనదిగా పరిగణించాలి. దానిపై పునరాలోచన ఎంతమాత్రం అవసరం లేదు. పునర్విభజనను వ్యతిరేకిస్తున్నవారు ఆ ప్రక్రియను శాశ్వతంగా నిలిపివేయాలని కోరడం లేదు. వారు ఒక పరిమిత, లోపభూయిష్ఠ వాదన చేస్తున్నారు. 'జనాభా నియంత్రణ'లో కొన్ని రాష్ట్రాల సంపూర్ణ విజయాలు, మరికొన్ని రాష్ట్రాల వైఫల్యాల ప్రాతిపదికన చేస్తున్న వాదన అది. రాజ్యాంగంలో అంతస్సూచితమైన, అయితే అనుల్లంఘనీయమైన 'సమాఖ్య ఒప్పందం' భావన భారతీయుల చర్చల్లో ప్రస్తావనకే రావడం లేదు. మన గణతంత్ర రాజ్యం ఏర్పాటై 75 సంవత్సరాలు గడచిన తరువాత ఇప్పుడు సమాఖ్య ఒప్పందం గురించి ఆలోచించడమెందుకు?

సమస్యను స్పష్టంగా అర్థం చేసుకుందాం. వర్తమాన చర్చ, ప్రస్తుత వాదన నియోజకవర్గాల తాజా పునర్విభజనకు సంబంధించిన రెండు అంశాలలో ఒకదానికే పరిమితమయింది. నియమానుసారం పార్లమెంటరీ నియోజకవర్గాల సరిహద్దులను మార్చి వేయడంపై ఎవరికీ ఆక్షేపణ లేదు. ఒక రాష్ట్ర పరిధిలోని లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దులను మార్చివేయడం లేదా అసెంబ్లీ స్థానాల సంఖ్యను పెంచడం సమాఖ్య సమతౌల్యతను ప్రభావితం చేయవు. అసలు సమస్యేమిటంటే వివిధ రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజనను చేపట్టడమే. యాభై సంవత్సరాల క్రితం రాష్ట్రాలకు కేటాయించే నియోజకవర్గాల సంఖ్యను నిర్ణయించారు. ఆ సంఖ్యను కొనసాగించాలా? లేక మార్చాలా? లేక ఎప్పటికీ యథాతథంగా కొనసాగించాలా? ఈ అంశాలపై నిశిత, నిష్పాక్షిక చర్చ జరగాలి.

జనాభా గణన అనంతరం విధిగా జరిగే నియోజకవర్గాల పునర్విభజన 'ఒక వ్యక్తి, ఒక ఓటు, ఒకే విలువ' అన్న సూత్రం ప్రాతిపదికన జరగాలని రాజ్యాంగ నిబంధన పేర్కొంది. లోక్‌సభకు ఎన్నికయ్యే ప్రతి సభ్యుడు ప్రాతినిధ్యం వహించే ఓటర్ల సంఖ్య సమానంగా ఉండి తీరాలని 'ఒక వ్యక్తి, ఒక ఓటు, ఒకే విలువ' అనే ప్రజాస్వామిక సూత్రం నిర్దేశిస్తుంది. ఈ సూత్రం ఉల్లంఘనకు గురైతే పెద్ద నియోజకవర్గాలలోని ఓటు విలువ చిన్న నియోజకవర్గాలలోని ఓటు విలువ కంటే తక్కువగా ఉంటుంది. ఉదాహరణకు యూపీలో 32 లక్షల మంది ప్రజలకు లోక్‌సభలో ఒక ఎంపీ ఉండగా కేరళలో 18 లక్షల కంటే తక్కువ మందికి లోక్‌సభలో ఒక ఎంపీ ఉన్నాడు. దీనివల్ల కేరళలో ఒక ఓటరుకు, యూపీలోని ఒక ఓటర్ కంటే రెట్టింపు ప్రాధాన్యముంటుంది. మరింత స్పష్టంగా చెప్పాలంటే జనాభాకు, లోక్‌సభ సభ్యుల సంఖ్యకు గల నిష్పత్తి సాధ్యమైనంతవరకు అన్ని రాష్ట్రాలకు ఒకేవిధంగా ఉండాలి. మరి అలా ఉన్నదా? లేదు. కనుక ఈ అసంబద్ధతను తొలగించాల్సి ఉన్నది. అయితే చిన్న రాష్ట్రాల విషయంలో రాజ్యాంగం ప్రకారమే ఈ సూత్రం వర్తించదు. ఇందుకు రాజ్యాంగమే వెసులుబాటు కల్పించింది జనాభాలో తమ వాటా కంటే లోక్‌సభలో ఎక్కువ మంది ప్రతినిధులను కలిగి ఉండే హక్కు చిన్న రాష్ట్రాలకు రాజ్యాంగం కల్పించింది. ఇటువంటి పరిస్థితులలో 'అసౌష్ఠవ సమాఖ్య విధానం' అమలులో ఉండేందుకు సమాఖ్యలోని వివిధ రాష్ట్రాలకు ప్రత్యేక రాజ్యాంగ విహిత రక్షణలు కల్పించారు.



రాష్ట్రాలకు లోక్‌సభా సీట్ల ప్రస్తుత కేటాయింపును ఎటువంటి మార్పు లేకుండా యథాతథంగా కొనసాగించాలి. భారత గణతంత్ర రాజ్య సంస్థాపనలో అంతర్ గర్భితంగా ఉన్న 'సమాఖ్య ఒప్పందం'ను గౌరవించేందుకు అదే ఉత్తమ మార్గం.

జనాభాకు, లోక్‌సభ సభ్యుల సంఖ్యకు గల నిష్పత్తి సాధ్యమైనంతవరకు అన్ని రాష్ట్రాలకు ఒకే విధంగా ఉండాలన్న నిబంధనకు (కొన్ని రాష్ట్రాల విషయంలో) ఇచ్చిన మినహాయింపును ఇప్పుడు ఒక సాధారణ సూత్రంగా పాటించాలి, రాజ్యాంగ నిర్మాతలు చూడలేకపోయిన, ఊహించలేకపోయిన పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే ఆ 'సాధారణీకరణ' ఆవశ్యకత అర్థమవుతుంది. ఇదేమీ జనాభా నియంత్రణ విధాన సాఫల్య వైఫల్యాలకు సంబంధించినది కాదు. జననాల, మరణాల రేట్లు జనసంఖ్యా సంబంధి మార్పులకు అనుగుణంగా ఉంటాయి. ఆర్థికంగా అభివృద్ధి చెందిన రాష్ట్రాలు లేదా సామాజిక సమూహాలు జనాభా పెరుగుదల శీఘ్రగతిన నిలిచిపోవడం కద్దు. అదొక సహజ పరిణామం.



■ యోగేంద్ర యాదవ్

భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన తరువాత జాతి జీవనంలో విభేదాలు, అనైక్యతలు తీవ్రమయ్యాయి. సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ రంగాలు మూడింటిలోనూ ఈ విపరిణామాలు చోటుచేసుకున్నాయి, సంలీనమవుతున్నాయి. ఈ పతన ప్రక్రియ గత మూడు దశాబ్దాలలో మరింత వేగవంతమయింది. ఈ నేపథ్యంలో తాజా నియోజకవర్గాల పునర్విభజన ద్వారా రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు లోక్‌సభ సీట్ల పునఃకేటాయింపు ఆ విభేదాలు, అనైక్యతలకు దోహదం చేసే మరొక ప్రమాదకర అంశమవుతుంది. ఇది జాతీయ సమైక్యతా స్ఫూర్తిని మరింతగా బలహీనపరుస్తుంది. భారతదేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే ఉన్న సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ అంతరాలు, అనైక్యతలను తొలగించేందుకు తక్షణ కృషి జరగాలి. ఈ దృష్ట్యా నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను పూర్తిగా నిలిపివేయాలి.

హిందీ భాష మాట్లాడే రాష్ట్రాలు, హిందీయేతర, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల మధ్య సాంస్కృతిక వ్యత్యాసాలు నెలకొనివున్నాయి. ఈ తేడాలు మొదటి నుంచీ ఉన్నప్పటికీ దేశ విభజన అనంతరం బాగా పెరిగిపోయాయి. అయితే తొలి నాటి రాజకీయ నాయకులు భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు, హిందీని ఏకైక అధికార భాషగా ఉండకూడదన్న డిమాండ్‌ను అంగీకరించడం ద్వారా హిందీ, హిందీయేతర రాష్ట్రాల మధ్య సమైక్యతను సంరక్షించారు. గత మూడు దశాబ్దాలుగా దేశ ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకున్న మార్పులు దక్షిణ–పశ్చిమ భారత రాష్ట్రాలు, ఉత్తర, తూర్పు భారత రాష్ట్రాల మధ్య తీవ్ర అసమానతలను సృష్టించాయి. దేశ రాజకీయాలలో ఒక ప్రధాన శక్తిగా బీజేపీ ప్రభవించడం ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల సంబంధాలను ప్రభావితం చేస్తోంది. ఉత్తరాది రాష్ట్రాలలో బీజేపీ ఒక తిరుగులేని శక్తిగా ఉండగా ఇతర రాష్ట్రాలలో ముఖ్యంగా దక్షిణాదిన దాని ఉనికికి తీవ్ర పోటీ ఎదురవుతోంది.

హిందీ, హిందీయేతర రాష్ట్రాల మధ్య సాంస్కృతిక వ్యత్యాసాలు, ఆర్థిక అసమానతలు, రాజకీయ అంతరాలను తొలగించని పక్షంలో దేశ సమైక్యతకు ముప్పు ఏర్పడుతుందనడంలో సందేహం లేదు.

నియోజకవర్గాల పునర్విభజనతో వ్యత్యాసాలు, అసమానతలు, అంతరాలు మరింత తీవ్రమయ్యే అవకాశమున్నది. 2026 జనాభా గణన అనంతరం జనాభా ప్రాతిపదికన ప్రతి రాష్ట్రానికి లోక్‌సభ సీట్ల కేటాయింపు పర్యవసానాలు ఎలా ఉంటాయో మిలన్ వైష్ణవ్, జమియె హింట్సన్‌లు విశ్లేషించారు. ఈ విశ్లేషణ ప్రకారం దక్షిణాది రాష్ట్రాలు భారీగా నష్టపోతాయి. లోక్‌సభలో కేరళ, తమిళనాడు చెరొక ఎనిమిది సీట్లను కోల్పోతాయి; తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు కలిసికట్టుగా ఎనిమిది సీట్లను నష్టపోతాయి; కర్ణాటక రెండు సీట్లను కోల్పోతుంది. ఇతర హిందీయేతర రాష్ట్రాలలో పశ్చిమ బెంగాల్ నాలుగు సీట్లను, ఒడిషా మూడు సీట్లను, పంజాబ్ ఒక స్థానాన్ని కోల్పోతాయి. ఉత్తరాదిలో హిమాచల్, ఉత్తరాఖండ్‌లు ఒక్కొక్క సీటును కోల్పోతాయి. అయితే యూపీ అదనంగా 11 సీట్లను పొందుతుంది. బిహార్‌కు అదనంగా పది సీట్లు, రాజస్థాన్‌కు అదనంగా ఆరు సీట్లు, మధ్యప్రదేశ్‌కు అదనంగా నాలుగు సీట్లు లభిస్తాయి.

ఆయా రాష్ట్రాలకు ఈ లాభనష్టాల వల్ల హిందీ, హిందీయేతర భాషా రాష్ట్రాల మధ్య ఉన్న సున్నితమైన సమతౌల్యత మరింతగా దెబ్బతింటుంది. ప్రస్తుతం లోక్‌సభలోని 543 స్థానాలలో 226 హిందీ భాషా రాష్ట్రాల్లో ఉన్నాయి. పునర్విభజన తరువాత వాటి సంఖ్య 259కి పెరుగుతుంది. ప్రస్తుతం 132 స్థానాలు ఉన్న దక్షిణాది రాష్ట్రాలు తూర్పు, పశ్చిమ రాష్ట్రాలతో కలిసి ఏదైనా కీలక రాజ్యాంగ సవరణను వీటో చేయగలిగే స్థితిలో ఉన్నాయి. పునర్విభజన అనంతరం వాటికి ఇటువంటి వెసులు బాటు ఉండదు. ఇది భారత గణతంత్ర రాజ్య సంస్థాపక సూత్రాల స్ఫూర్తికి విరుద్ధమైనది. భిన్నత్వంలో ఏకత్వం అనే భావనకు తీవ్ర విఘాత మేర్పడుతుంది. ఈ ప్రాథమిక సూత్రాలను గౌరవించడం అంటే మన రాజ్యాంగంలో అంతర్గతంగా ఉన్న ఒక సమాఖ్య ఒప్పందానికి ఒక ప్రాతిపదికను ఏర్పరచుకోవడమే అవుతుంది. మన సమాఖ్య, స్వతంత్ర రాష్ట్రాలు ఒక విశాల దేశాన్ని ఏర్పాటు చేయడానికి స్వచ్ఛందంగా కలిసిన రాజకీయ వ్యవస్థ కాదు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలతో అధికారంలో భాగస్వాములుగా ఉన్న సమాఖ్య రాజకీయ వ్యవస్థ మనది. ఈ కారణంగానే మన సమాఖ్య ఒప్పందం లిఖితపూర్వకంగా లేదు. అది రాజ్యాంగంలో సూచనప్రాయంగా మాత్రమే ఉన్నది. అయితే అదొక మౌలిక సూత్రం.


ఈ సమాఖ్య ఒప్పందాన్ని అంగీకరించడమంటే రెండు వాదనలకు శాశ్వతంగా ముగింపు పలకడమే. అవి: జనాభా ఆధారిత రాజకీయ ప్రాతినిధ్యం; పన్నుల రాబడి ప్రాతిపదికన ఆర్థిక వనరులలో వాటా. హిందీ భాషా రాష్ట్రాలు, హిందీయేతర భాషా రాష్ట్రాలు ఈ రెండు అంశాలలో ఒకదానితో లబ్ధి పొందగా మరొకదాని విషయంలో నష్టపోతాయి. ఎన్నికల ప్రయోజనాలను పక్కన పెట్టి ఈ సమాఖ్య ఒప్పందంపై జాతీయ ఏకాభిప్రాయాన్ని సాధించడం, భారత గణతంత్ర రాజ్యసంస్థాపక సూత్రమైన 'జస్ట్ రిపబ్లిక్' (న్యాయమైన గణతంత్రం) దిశగా ముందంజవేయడమే అవుతుంది.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

స్త్రీ ఔన్నత్యాన్ని ఆవిష్కరించిన రాయప్రోలు

మాతృ హృదయంతో పురుష రూపంలో జన్మించిన మొట్టమొదటి విమర్శకుడు, కవి ఎవరూ? అంటే ఈ శతాబ్దంలో రాయప్రోలు సుబ్బారావు గారనే చెప్పాలి! కవిత్వంలోను సాహిత్య విమర్శలోను ఆయన ప్రతిపాదించిన సిద్ధాంతాలకు భూమిక 'స్త్రీ'. కవిగా తృణకంకణాది కావ్యాలతోపాటు విమర్శకుడిగా స్త్రీవాద భావనను ఆలంబనగా చేసికొని రమ్యాలోకాది విమర్శ గ్రంథాలను రాశాడు. తన కాలంలోను, తన కాలానికి ముందున్న సాహిత్యంలోను స్త్రీ వర్ణన రాయప్రోలు మనసు కలచివేసింది. స్త్రీని భోగ, విలాస వస్తువుగా చూసే ఈ సమాజానికి తరుణోపాయం కనిపెట్టాలని తపించాడు. చిన్నతనంలో పిన్నమ్మ రామడుగు నరసమ్మ వద్ద పొందిన సంస్కారం ఈ తపనకు ప్రాణం పోసింది.

ఒకనాడు రాయప్రోలు 'అనసూయ చరిత్ర' చదువుతుండగా విన్న పిన్నమ్మ, "నాన్నా చూచావురా! త్రిమూర్తులు కూడా ఎలా తల్లికంటితో చూస్తే చంటిపిల్లలయినారో! ఇలాంటి భావం మన కథా కలాపాలలో ఇంకా అధికంగా ఉంటే ప్రేమ భాండం తొణికేదా! ఏ గ్రంథంలో విన్నా ఆడవాళ్ళను గురించి ఏమేమో రాస్తారు మగవాళ్ళు," అని అన్నది. కవిగా విమర్శకుడిగా రాయప్రోలుకు ప్రేరణను ఇచ్చిన ఈ మాటలు తక్షణ కర్తవ్య బోధకాలై సాహిత్య విమర్శలోను, కవితా రచనలోను ఒక అభినవ ఆదర్శాన్ని, దర్శనాన్ని కలిగించినవి. పిన్నమ్మ నరసమ్మ మాటలే రాయప్రోలు సాహిత్య విమర్శలో మూడు గ్రంథాలుగా రూపుదిద్దుకున్నవి. అవి: 'రమ్యాలోకం', 'మాధురీ దర్శనం', 'రూపనవనీతం'. ఈ మూడు విమర్శ గ్రంథాలు స్త్రీ ఔన్నత్యాన్నీ, స్త్రీ శక్తినీ, స్త్రీ వ్యక్తిత్వాన్నీ విస్తృత ప్రాతిపదికపై చర్చించి విశ్లేషించినవి. సామాజిక సాంస్కృతిక సంబంధాల దృష్టితో కుటుంబ నిర్వహణలో పురుషుని కంటే స్త్రీ ఉన్నతమైన భూమికను ధరిస్తున్నదని రాయప్రోలు ఈ గ్రంథాలలో నిరూపించినాడు.



"నా అమలిన శృంగార విషయంలో శబ్దౌచిత్యమును పాటించాను. చక్రస్తనీ, రంభోరూ, లలనా ఇత్యాదులు కేవల స్త్రీ వాచకములుగా వాడక జాగ్రత్తపడ్డాను" అంటూ తన కావ్యాలలో వీలైనంతవరకు ఎక్కడా స్త్రీని తక్కువ దృష్టితో చూసే పదాలను రాయప్రోలు ఉపయోగించలేదు. దాదాపు స్త్రీని సంబోధిస్తూ వాడిన పదాలన్నీ లలితా సహస్రనామాలలోనో, లేక మరే స్తోత్రంలోనో దేవీపరంగా ఉన్నటువంటివే కావడం రాయప్రోలు స్త్రీభావనా దృక్పథంలోని విశిష్టతను వెల్లడిస్తుంది.

ఆధునిక విద్యా సౌకర్యాల వలన స్త్రీ పురుషులు కలిసి చదువుకోవడం, ఉద్యోగాలు చేయడం మొదలైన సామాజిక అవసర నేపథ్యంలో మగవాడి మోసానికి బలైపోతున్న స్త్రీల జీవితాలను, ఆత్మత్యాగాలను చూసిన రాయప్రోలు వాటికి పరిష్కార మార్గంగా అమలిన శృంగార సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టినాడు. 'తృణకంకణ' కావ్య పీఠికలో– సంభోగ పరిణామం పొందని కేవల భావాత్మకమైన స్నేహయోగంగా నవీన ప్రేమ సిద్ధాంతాన్ని ప్రతిపాదించానని చెప్పాడు రాయప్రోలు. ఆ రోజుల్లో తెలుగు కవిత్వానికి ఇది ఒక నూతన లక్ష్యంగా గుర్తింపబడింది.

'రమ్యాలోకమ్', 'మాధురీదర్శనమ్' గ్రంథాలలో రాయప్రోలు స్త్రీ దృష్టితో వ్యాఖ్యానించిన అంశం 'నరనారీ సంబంధం'. మానవులందరూ స్త్రీ పురుష భేదం చేత మౌలికంగా రెండే రెండు వర్గాలు. ఈ రెండు వర్గాల పరస్పర సంబంధం మీదనే మానవ జీవితం, మానవ సమాజం అభివృద్ధి మార్గంలో విస్తరిస్తున్నది. రాయప్రోలు ఈ సంబంధాలను నాలుగు రూపాలుగా స్త్రీ యందు ఇట్లు చూపినాడు: "నరనారీ సంబంధము/ పరిభావింపుము దిశా విభాగము వరుసన్/ ధర జననీ, భగినీ, సహ/చరీ కుమారీ క్రమము నిజంబగుట సుధీ!" అన్నాడు. జననీ, భగినీ, సహచరీ, కుమారీ అని నాలుగు రూపాలలో స్త్రీ పురుషుని జీవితాన్ని నాలుగు దిక్కులుగా, ఆవరించి ఉంటుందని దీని తాత్పర్యం. పురుషునికి జన్మించిన వెంటనే ఒక్క స్త్రీతో కలిగే మొట్టమొదటి సంబంధం జనని, ఆ తరువాత అతని పెరుగుదలలో స్త్రీతో కలిగే తరువాత సంబంధం భగిని (సోదరి), యౌవన దశకు వచ్చేసరికి స్త్రీతో ఏర్పడే సంబంధం సహచరి, ఆ తరువాతది కుమారి. ఈ విధంగా పురుషుని జీవితంలో స్త్రీ నాలుగు రూపాలతో ఆవరించి ఉంటుందని రాయప్రోలు వ్యాఖ్యానించడం మానవ జీవితంలో స్త్రీ ప్రాముఖ్యాన్ని వెల్లడించడమే!

రాయప్రోలు తన 'నవకవిత' వ్యాసంలో స్త్రీ పురుషుల సంబంధాన్ని విశ్లేషిస్తూ రామాయణకాలం కంటే ముందు స్త్రీ పురుషుల సంబంధం పశుపక్ష్యాదులలో వలె అవ్యవస్థితంగా ఉండేది అంటూ సత్యకామ జాబాలి కథను ఉదాహరిస్తాడు. దశరథుడికి ముగ్గురు భార్యలు ఉండటం కూడా ఈ అవ్యవస్థకి ఉదాహరణ అనీ, అందుకే వాల్మీకి రామాయణాన్ని రాసి సీతారాముల ద్వారా ఒక్క స్త్రీకి ఒక్క పురుషుడు, ఒక్క పురుషుడికి ఒకే స్త్రీ అని సమాజ ధర్మంగా ప్రకటించినాడని అంటాడు. సూత్రభాష్యం రాసి తత్త్వోపదేశం చేసిన శంకరాచార్యులు సారసత్వాన్ని దేవీస్తన్యంగా వర్ణించడం స్త్రీ భావనలోని విశిష్టతగా పేర్కొంటాడు.

"నా అమలిన శృంగార విషయంలో శబ్దౌచిత్యమును పాటించాను. చక్రస్తనీ, రంభోరూ, లలనా ఇత్యాదులు కేవల స్త్రీ వాచకములుగా వాడక జాగ్రత్తపడ్డాను" అంటూ తన కావ్యాలలో వీలైనంతవరకు ఎక్కడా స్త్రీని తక్కువ దృష్టితో చూసే పదాలను రాయప్రోలు ఉపయోగించలేదు. దాదాపు స్త్రీని సంబోధిస్తూ వాడిన పదాలన్నీ లలితా సహస్రనామాలలోనో, లేక మరే స్తోత్రంలోనో దేవీపరంగా ఉన్నటువంటివే కావడం రాయప్రోలు స్త్రీభావనా దృక్పథంలోని విశిష్టతను వెల్లడిస్తుంది. ఈ విధంగా 'స్త్రీ భావన' కేంద్రంగా సాగిన రాయప్రోలు సాహిత్య విమర్శ గత శతాబ్దంలో ఆధునిక కవులకు ఒక సిద్ధాంతంగా ఒక తత్త్వోపదేశంగా ఎంతో ఉపకరించింది.

● ఆచార్య కె. యాదగిరి
పూర్వ సంచాలకులు, తెలుగు అకాడమి

(నేడు రాయప్రోలు సుబ్బారావు జయంతి)

కమ్యూనిస్టుల ఐక్యతే ప్రత్యామ్నాయం

భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమానికి నూరేళ్లకు పైగా చరిత్ర ఉంది. స్వాతంత్ర్యానికి ముందు, తరువాత అనేక సమరశీల పోరాటాలకు నేతృత్వం వహించింది. 1925లో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం తరువాత అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం, రష్యా సోషలిస్టు విప్లవం స్ఫూర్తితో తిరువాన్కూర్ సంస్థాన విముక్తి, తెలంగాణ నిజాం సంస్థాన విముక్తి సాయుధ పోరాటాలను పార్టీ నిర్వహించింది. అశేష త్యాగాలు చేసింది. వేలాది పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రాణాలు అర్పించారు. ప్రస్తుతం దేశ పరిస్థితులు కమ్యూనిస్టుల ఐక్యతను వాంఛిస్తున్నాయి. కానీ చీలిక నాటి పిడివాదం నేటికీ కొనసాగుతున్నది. 1964లో చీలికకు కారణమైన వారు నేడు ఐక్యతను నిరాకరిస్తున్నారు. భారత ఉపఖండంలోని శ్రీలంక, నేపాల్ వంటి దేశాలలో ఐక్యత ద్వారా రాజ్యాధికారం ప్రజాస్వామ్యయుతంగా సాధించిన అనుభవం కళ్లకు కట్టినట్టు కనిపిస్తున్నా కమ్యూనిస్టు పార్టీల ఐక్యతను గుడ్డిగా నిరాకరిస్తున్నారు. నేడు దేశంలో ఫాసిస్టు శక్తులు విజృంభించి మత కలహాలను సృష్టించి స్వార్థ రాజకీయ ప్రయోజనాలను సాధించుకుంటున్నా కమ్యూనిస్టులు ఐక్యత గురించి ఆలోచించడం లేదు. పశ్చిమ బెంగాల్, త్రిపుర వంటి రాష్ట్రాల్లో వామపక్షాలు అధికారం కోల్పోయి, పార్టీలు బలహీనపడుతున్నా ఐక్యతకు చొరవ చూపడం లేదు. పార్టీ శ్రేణుల ఆకాంక్షలకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ప్రజాస్వామ్య పద్ధతులను అనుసరిస్తూ రాజ్యాంగ పరిధిలో పనిచేస్తూ, సైద్ధాంతికంగా ఏకాభిప్రాయం ఉన్న సీపీఐ, సీపీఐ(ఎం)లు ఐక్యతా దిశగా పయనిస్తే, విప్లవ పార్టీలు, మావోయిస్టు పార్టీల మధ్య ఐక్యత సాధించటం పెద్ద సమస్య కాదు.

ప్రస్తుత పరిస్థితులలో మావోయిస్టు విప్లవకారుల వ్యూహం ఎత్తుగడలలో లోపం కనిపిస్తున్నది. చరిత్ర నుంచి పాఠాలు తీసుకోవడంలో వారు విఫలమవుతున్నారు. అడవులలో వారికి ప్రజాదరణ తగ్గింది. నేడు ప్రజాకోర్టులు లేవు. రాజ్యహింస పెరిగిపోయింది. మావోయిస్టుల నిర్మూలన లక్ష్యంతో సైన్యం ఆధునిక యుద్ధ తంత్రాన్ని అడవులలో అమలు చేస్తున్నది. వందలాది మంది కార్యకర్తలను, నాయకులను నిర్దాక్షిణ్యంగా మట్టుబెడుతున్నారు. నూతన పరిస్థితులకు అనుగుణంగా నూతన సైద్ధాంతిక ఆలోచన, ఆచరణ లేకుండా పాత పోరాట మార్గంలో వెళ్లటం భారీ నష్టాలను కలిగిస్తున్నది. లౌక్యం లోపించడం వల్ల దండకారణ్యం రక్త పంకిలం అవుతున్నది.

నేడు దోపిడీ కొత్త రూపాలను సంతరించుకుంది. నూతన పోరాట రూపాలను మనం ఎంచుకోవలసి ఉంది. ప్రజాస్వామ్య క్రమంలో ప్రజా క్షేత్రంలో పోరాటాలు నిర్వహించాలి. ఎన్ని లోటుపాట్లు ఉన్నా ప్రజలు ప్రజాస్వామ్య రాజ్యాంగ పరిధిలో పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యం వహిస్తున్నారు. మావోయిస్టులు కాదన్నా ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటున్నారు. ఒకప్పుడు మావోయిస్టు ఉద్యమానికి వెన్నెముకగా ఉన్న గిరిజనులు, ప్రజలు నేడు దూరంగా జరిగిపోయారు. అయినా సాయుధ పోరాటమే శరణ్యం అనడం 'నేల విడిచి సాము చేయటమే' అవుతుంది. నేడు దేశంలో ప్రజలు సాయుధ పోరాట అవసరాన్ని గుర్తించటం లేదు. రాజ్యహింస పెచ్చుమీరుతున్న దశలో ఇకనైనా కమ్యూనిస్టు శ్రేణులు దేశ, ప్రజా ప్రయోజనాల రీత్యా పునః పరిశీలన చేయాలి. తమ విధానాలను పునః సమీక్షించాలి. ప్రజాస్వామ్య ప్రక్రియలో ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి. ప్రజలకు, ప్రజా ఉద్యమాలకు రక్షణగా నిలవాలి. భేషజాలకు, ఆధిపత్య ధోరణులకు స్వస్తి చెప్పి ఐక్యతా చర్చలకు తెరతీయాలి. లేని పక్షంలో కమ్యూనిస్టులను చరిత్ర క్షమించదు.

– చలసాని వెంకటరామారావు

అసెంబ్లీకి వచ్చే ధైర్యం లేదా!

ప్రజాస్వామ్య దేశంలో చట్ట సభలే ప్రజలకు దేవాలయాలు. చట్ట సభల్లో ప్రజల కోసం ప్రజల చేత ఎన్నుకోబడిన నాయకులు ప్రజల సమస్యల పరిష్కారానికి స్వరమై నిలుస్తారు. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని నిజం చేసేలా చట్ట సభల్లో నిలబడతారు. నియోజకవర్గ సమస్యలపై గొంతెత్తుతారు. ఇటువంటి వారే ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచే నేతలవుతారు. "వై నాట్ 175" అని విర్రవీగిన జగన్‌రెడ్డికి జనం గట్టిగా బుద్ధి చెప్పారు. అయినా ఆయన బుద్ధి మారడం లేదు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించడం లేదు. గెలిపించిన నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలను చర్చించేందుకు కూడా చట్టసభలకు రావడం లేదు. అలాంటప్పుడు ఇంకెందుకు ఆ ఎమ్మెల్యే పదవి? అనర్హత వేటు నుంచి తప్పించుకొనేందుకు మొక్కుబడిగా అటెండెన్స్ కోసం అసెంబ్లీ సమావేశాలకు హాజరై ప్రతిపక్ష హోదా ఇవ్వాలని నినాదాలు చేసి గవర్నర్ ప్రసంగాన్ని బాయ్‌కాట్ చేసి జగన్ వెళ్లిపోయారు.

గతంలో పుచ్చలపల్లి సుందరయ్య, వెంకయ్య నాయుడు, జయపాల్ రెడ్డి, జయప్రకాష్ నారాయణ లాంటి ఎందరో నేతలని ప్రజలు నమ్మి చట్టసభలకు పంపిస్తే, అధికారం, ప్రతిపక్షంతో సంబంధం లేకుండా సమస్యలపై ప్రజావాణిని గట్టిగా వినిపించారు. కాని నేడు ప్రజలు ఇవ్వని ప్రతిపక్ష హోదా కోసం పాకులాడుతూ గెలిపించిన ప్రజలను విస్మరిస్తున్న జగన్, ఇతర వైసీపీ నేతలను చూస్తుంటే వీరికి భారత రాజ్యాంగం గురించి బొత్తిగా తెలియదని అర్థమవుతుంది. నిరాధార ఆరోపణలతో ప్రతిపక్ష హోదా కోసం ఎమ్మెల్యే జగన్ కోర్టుకు కూడా వెళ్లారు. ప్రతి విషయం జగన్ చెప్పినట్లే జరగడానికి ఇది ఏమన్నా రాచరికమా? హోదా కోసం అసెంబ్లీకి వెళ్లకుండా బహిష్కరించడం ప్రజాస్వామ్యాన్ని కాపాడటమా? ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులుగా చట్టసభకు వెళ్లాలి. తమ అభిప్రాయం చెప్పాలి. సభను గౌరవించే లక్షణం లేనప్పుడు సభ్యులుగా కొనసాగడం ఎందుకు?

ప్రతిపక్ష హోదా ఇవాల్సింది స్పీకర్ కాదు, ప్రజలు. ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటే సరైన సంఖ్యా బలం ఉండాలని లోక్‌సభలో రూలింగ్ చట్టం స్పష్టంగా చెప్తుంది. 175 మంది సభ్యులు ఉన్న సభలో కనీసం 18 మంది సభ్యుల బలం ఉంటే తప్ప ప్రతిపక్ష హోదా రాదు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ శాసనసభలో మాట్లాడుతూ "మీ దగ్గర నుంచి ఐదారుగురు సభ్యులను లాగేస్తే ప్రతిపక్ష హోదా కూడా ఉండదు" అని ఎద్దేవా చేశారు. ఇప్పుడు కేవలం 11 మంది ఎమ్మెల్యేలు ఉన్న వైసీపీకి ప్రతిపక్ష హోదా కావాలని అడగడంలో అర్థముందా? రాష్ట్ర పునర్నిర్మాణానికి పునాది లాంటి బడ్జెట్‌పై చర్చించడానికి, నిర్మాణాత్మకమైన సూచనలు ఇవ్వడానికి కూడా జగన్ సభకు రాకపోవడం దేనికి సంకేతం? శాసన సభలో చంద్రబాబును ఎదుర్కొనే ధైర్యం లేదా?

రాష్ట్ర పునర్నిర్మాణానికి పునాది లాంటి బడ్జెట్‌పై చర్చించడానికి, నిర్మాణాత్మకమైన సూచనలు ఇవ్వడానికి కూడా జగన్ సభకు రాకపోవడం దేనికి సంకేతం? శాసనసభలో చంద్రబాబును ఎదుర్కొనే ధైర్యం లేదా? 2019లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించి చంద్రబాబు నాయుడు, టీడీపీ నేతలు చట్ట సభలకు హాజరై రాష్ట్ర సమస్యలు, ప్రజల బాధలపై గళమెత్తారు. నమ్మి గెలిపించిన నియోజకవర్గ ప్రజల సమస్యలపై పోరాడారు.



2019లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించి చంద్రబాబు నాయుడు, టీడీపీ నేతలు చట్టసభలకు హాజరై రాష్ట్ర సమస్యలు, ప్రజల బాధలపై గళమెత్తారు. నమ్మి గెలిపించిన నియోజకవర్గ ప్రజల సమస్యలపై పోరాడారు. వైసీపీ నేతలకు అధికార దాహం తప్ప, నమ్మి ఓట్లు వేసిన ప్రజలు ఏమైపోయినా పట్టదు. పార్టీ గౌరవ అధ్యక్ష పదవి నుండి కన్న తల్లిని తొలగించి సొంత అమ్మకే అన్యాయం చేసిన వ్యక్తి జగన్‌రెడ్డి. మరో వైపు ఆస్తికోసం చెల్లి, తల్లిని కోర్టుకు ఎక్కించిన ఘనుడు. ఇటువంటి వ్యక్తి రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మలను ఉద్ధరిస్తాడంటే నమ్ముతారా?

నాడు అధికారం కోసం నవరత్నాలంటూ నవ మోసాలకు తెరలేపారు. ఒక్క రత్నాన్ని కూడా సరిగ్గా అమలు చేయకుండా ప్రజలను నట్టేట ముంచారు. ప్రజలపై పెనుభారాలు మోపి వారి నడ్డి విరిచారు. చివరకు చెత్తపై కూడా పన్ను వేసిన చెత్త పాలన ఏదైనా ఉంది అంటే అది వైసీపీ పాలనే. ఉత్తుత్తి బటన్ నొక్కుళ్లతో ప్రజలను బురిడీ కొట్టించారు. రాష్ట్ర ప్రజలపై పది లక్షల కోట్లకు పైగా అప్పులకుప్పను పెట్టి ల్యాండ్, శ్యాండ్, వైన్, మైన్ అంటూ దేన్నీ వదలకుండా దోచుకుని ఖజానాను నింపుకున్నారు. మద్యపాన నిషేధం అని దాన్ని అమలు చేయకపోగా నాసిరకం మద్యం అమ్మి ప్రజలు ప్రాణాలు తీసి లక్షల కోట్లు కొల్లగొట్టారు. ఇసుకను ఆపి భవన నిర్మాణ కార్మికుల కడుపు కొట్టారు. చివరకు ఎన్నికల ముందు పెంచి ఇస్తానన్న పింఛన్‌ను కూడా సక్రమంగా ఇవ్వకుండా రాజకీయ లబ్ధికోసం అవ్వాతాతలను ఎండలో నిలబెట్టి 30 మందికి పైగా ప్రాణాలు తీశారు. ఇలాంటి వారు నేడు సూపర్ సిక్స్ హామీల అమలు గురించి సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారు.

"నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ" అంటూనే జగన్‌రెడ్డి వారికి చేసిన ద్రోహం అంతా ఇంతా కాదు. వారి సంక్షేమాన్ని పూర్తిగా పాతరేశారు. వారి నిధులను దారి మళ్లించారు. ఎస్సీ, ఎస్టీ, పేదల అభివృద్ధిని అస్సలు పట్టించుకోలేదు. దళిత కాలనీలను దారుణంగా మార్చారు. వీధి దీపాలు కూడా పెట్టకుండా చీకట్లలో మగ్గేలా చేశారు. విదేశీ విద్యకు పేరు మార్చారే తప్ప ఆ విద్య పేదలకు ఎస్సీ, ఎస్టీలకు అందకుండా చేశారు. బడులను విలీనంతో పేద పిల్లలను చదువుకు దూరం చేశారు.

శాసనసభకు రాకపోవటం వల్ల అక్కడ జరిగే అర్థవంతమైన చర్చలలో పాల్గొని తన వాదన వినిపించే అవకాశాన్ని జగన్ కోల్పోతున్నారు. శాసన సభ్యులు అందరికీ దాదాపు మాట్లాడే అవకాశం దొరికింది. ప్రభుత్వం చాలా హుందాగా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్య విలువలతో సభ నడుపుతున్నది. జగన్ మాత్రం ప్రజలను మభ్యపెట్టి, రాజకీయ ప్రయోజనం పొందాలని చూస్తున్నారు.



■ అనగాని సత్యప్రసాద్
ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖ మంత్రి

'పేట'లో సవాల్.. ప్రభుత్వమేదైనా మేమే తవ్వుకుంటాం.. దమ్ముంటే అడ్డుకోండి చూద్దాం.. అంటూ జగ్గయ్యపేటలోని కొంగర మల్లయ్యగట్టు వద్ద అక్రమార్కులు బరి తెగిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో గట్టును గుల్లచేసింది చాలక.. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా కొనసాగిస్తున్నారు. 500 క్యూబిక్ మీటర్ల నుంచి ఏకంగా లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వుకోవడంతో మల్లయ్య గట్టు ప్రాంతం ప్రస్తుతం చెరువుల్లా మారిపోయింది. వైసీపీ, టీడీపీ, జనసేన నాయకులు కలిసి సాగిస్తున్న ఈ అక్రమాలకు కొండపై మల్లయ్య దేవరే కాదు.. కొండ కింద రైతులు కూడా బాధితులుగా మారిపోయారు.





వైసీపీ హయాంలో జరిగిన తవ్వకాలతో చెరువును తలపిస్తున్న ప్రాంతం

మల్లయ్యగట్టు.. కొల్లగొట్టు..!

జగ్గయ్యపేటలోని కొంగర మల్లయ్యగట్టు వద్ద జరిగిన అక్రమ తవ్వకాలు

జగ్గయ్యపేటలోని కొంగర మల్లయ్యగట్టులో అక్రమ క్వారీయింగ్

కూటమి ప్రభుత్వం రాగానే మూడు నెలలు బంద్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అక్రమార్కులు మూడు నెలలు తమ కార్యకలాపాలను నిలుపుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా రాష్ట్రవ్యాప్తంగా అక్రమ మైనింగ్ కార్యకలాపాలపై విజిలెన్స్ విచారణకు ఆదేశించటంతో జాగ్రత్త పడ్డారు. గ్రావెల్ రుచి మరిగిన మాఫియాకు ఖాళీగా ఉండటం ఇష్టంలేక తిరిగి మళ్లీ అక్రమ మైనింగ్ చేపట్టారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : జగ్గయ్యపేటలోని కొంగర మల్లయ్యగట్టు పరిసరాల్లోని 100 ఎకరాల అసైన్డ్, ప్రైవేట్ పట్టా భూములను కొనుగోలు చేసి అక్రమంగా మైనింగ్ చేస్తున్నారు. వీటిలో చాలావరకు నామమాత్రపు లీజుకు తీసుకుని అక్రమంగా తవ్వేసినవే. కౌలు పేరుతో ఈ మైనింగ్ జరుగుతోంది. కొందరి భూములైతే, బలవంతంగా తమ స్వాధీనంలోకి తీసుకుని తాటిచెట్టంత లోతున తవ్వేశారు. ఈ అక్రమ మైనింగ్‌ను గుర్తించిన స్థానిక రైతులు లబోదిబోమంటున్నారు. స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవట్లేదని చెబుతున్నారు. విసుగెత్తిన కొందరు రైతులు ధైర్యంచేసి కలెక్టర్ లక్ష్మీశకు ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయి సందర్శనకు వస్తానని కలెక్టర్ చెప్పటంతో అక్రమార్కులకు రెవెన్యూ అధికారులు సమాచారం అందించారు. దీంతో ఎక్స్‌కవేటర్లను పొలాల్లో దాచి ఉంచారు. కలెక్టర్ తనిఖీలకు రాకపోవటంతో మళ్లీ ఎక్స్‌కవేటర్లను బయటకు తీసి యథేచ్ఛగా తవ్వేస్తున్నారు.

వైసీపీ హయాంలోనే అనుమతులు

- కూటమి ప్రభుత్వం వచ్చాక ఆగని అక్రమాలు
- సమీపంలోని 100 ఎకరాల్లోనూ తవ్వకాలు
- భూములు లీజుకు తీసుకుని, అసైన్డ్ భూములు కొనేసి..
- కొండచుట్టూ తాటిచెట్ల లోతున తవ్వకాలు
- వైసీపీ, టీడీపీ, జనసేన నాయకులు మిలాఖత్
- కలెక్టర్ లక్ష్మీశకు బాధిత రైతు ఫిర్యాదుతో వెలుగులోకి..

దారి పొడవునా వేగులను ఏర్పాటుచేసుకుని ఎప్పటికప్పుడు సమాచారం అందుకుంటున్నారు. కొంగర మల్లయ్యగట్టుతో పాటు సమీప 100 ప్రాంతాల్లో విచ్చలవిడిగా ఈ మైనింగ్ కార్యకలాపాలు సాగుతున్నాయి.



క్వారీ ప్రాంతంలో దాచి ఉంచిన ఎక్స్‌కవేటర్

వైసీపీ ప్రభుత్వ హయాంలోనే అక్రమాలు

ప్రస్తుతం లిక్కర్ స్కామ్‌లో నిందితుడైన ఓ అధికారి చిన్నమామ కొంగరమల్లయ్య గట్టు వెనుక ప్రాంతాన్ని కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారికంగా లీజుకు తీసుకున్నారు. లీజుకు తీసుకున్న చోట నిబంధనలకు విరుద్ధంగా అడ్డగోలుగా తవ్వేశారు. ఇప్పుడు తవ్వుకోవటానికి ఇక్కడ ఏమీ లేదు. కానీ, పదేపదే మిగతా 6లో..



భూషణగుళ్ల - పెదపారుపూడి మధ్యలో జరుగుతున్న పనులు

మార్గం సుగమం

గుడివాడ-కంకిపాడు రహదారికి మోక్షం

వైసీపీ హయాంలో ప్రమాదకరంగా మారిన రోడ్డు

- సీఆర్ఎఫ్ నిధులు మంజూరైనా దారి మళ్లింపు
- కూటమి ప్రభుత్వ రాకతో రోడ్డుకు మహర్దశ
- రూ.5 కోట్లతో 7 కిలోమీటర్ల మేర మరమ్మతులు
- రూ.40 లక్షలతో 2.2 కిలోమీటర్ల పనులు పూర్తి

వైసీపీ ప్రభుత్వ హయాంలో.. గుంతలు పడి.. కంకరపైకి తేలి.. కాలు వేయాలంటేనే భయపడేలా అగాధంలో ఉండేది ఈ రోడ్డు. ఎన్నో ప్రమాదాలు.. ఎన్నో మరణాలు.. మరెందరో క్షతగాత్రులు.. అడుగు పెట్టాలంటేనే దడ పుట్టించిన గుడివాడ-కంకిపాడు రహదారికి కూటమి ప్రభుత్వ రాకతో మహర్దశ పట్టింది. నాలుగు నియోజకవర్గాల మీదుగా సాగే ఈ రోడ్డు అభివృద్ధికి ఇన్నాళ్లకు అడుగు పడింది. ఇప్పటికే రూ.40 లక్షలతో 2.2 కిలోమీటర్ల మేర రహదారి అభివృద్ధిని గత డిసెంబరులోనే పూర్తిచేసిన ప్రభుత్వం.. మరో రూ.5 కోట్లతో 7 కిలోమీటర్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేసింది. ఈ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. 6లో

దాహం తీర్చడమే లక్ష్యం

- నందిగామ మున్సిపల్ అధికారుల భగీరథ యత్నం 6లో

రంజాన్ వేళలు



ఇఫ్తార్ (సాయంత్రం): 06-17(గురు)
సహర్ (ఉదయం) : 05-04 (శుక్ర)

కామన్ సైట్ స్వాహా..!

గొల్లపూడిలో రూ.కోటి విలువచేసే పంచాయతీ స్థలం కబ్జా

- వైసీపీకి చెందిన మాజీ నాయకుడి నిర్వాకం
- తన స్థలంలో కలుపుకొని గ్రూప్‌హౌస్ నిర్మాణం
- పంచాయతీకి ఫిర్యాదులు.. నోటీసులు జారీ

గొల్లపూడి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని సాయిపురం కాలనీలో ఉన్న 200 గజాల పంచాయతీ కామన్ స్థలాన్ని వైసీపీకి చెందిన ఓ మాజీ నాయకుడు దర్జాగా కబ్జా చేశాడు. దీని విలువ సుమారు రూ.కోటి పైగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. తాను పట్టా పొందిన 400 గజాల స్థలానికి ఆనుకుని 80 సెంట్ల పంచాయతీ కామన్ స్థలం ఉంది. అందులోని 200 గజాలు ఆక్రమించిన సదరు నేత గత ఆగస్టులో ఏకంగా ప్రహరీ నిర్మించి, షెడ్ వేసి గేట్లు పెట్టేశాడు. గ్రూప్‌హౌస్ నిబంధనలను అతిక్రమించి ఐదు ఫోర్లలో అపార్ట్‌మెంట్ నిర్మించాడు. 16 మందికి వాటిని విక్రయించేశాడు. కామన్ స్థలం ఆక్రమణలపై స్థానికుల ఫిర్యాదు మేరకు పంచాయతీ వారు ఇటీవల కొలతలు వేసి సాయితేజ రెసిడెన్సీ భవనం వరకు సొంత స్థలంలో ఉన్నట్లు ప్రహరీ మొత్తం కామన్ స్థలంలో ఉన్నట్లు గుర్తించి 16 ప్లాట్ల వారికి ఫిబ్రవరిలో నోటీసులు జారీ చేశారు. అయినా ఇప్పటి వరకు ఆక్రమణదారులు పంచాయతీ వారిని సంప్రదించలేదు.



కామన్ స్థలంలో నిర్మించిన ప్రహరీ

ఆక్రమణను గుర్తించాం

200 గజాల కామన్ సైట్ ఆక్రమణకు గురైనట్టు గుర్తించాం. కామన్ సైట్ వరకు ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నాం. త్వరలో 80 సెంట్ల కామన్ సైట్‌కు ప్రహరీ నిర్మిస్తాం.
- స్వరూపరాణి, గొల్లపూడి పంచాయతీ కార్యదర్శి

పోలీసుల అదుపులో దోపిడీ గ్యాంగ్?

విజయవాడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : చేతుల్లో ఎయిర్ గన్‌లు.. పక్కనే గ్యాస్ కట్టర్లు.. జేబుల్లో కటింగ్ బ్లేయర్లు.. కరుడుగట్టిన దొంగల్లా కనిపించిన ఓ గ్యాంగ్ రాత్రిపూట బీట్ విధులు నిర్వర్తిస్తున్న పోలీసుల కంటబడ్డారు. వెంటనే ఈ గ్యాంగ్‌ను వారు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగింది. భవానీపురం పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బంది గొల్లపూడి జంక్షన్‌లో అర్ధరాత్రి సమయంలో విధులు నిర్వహిస్తుండగా, రోడ్డు పక్కన ఇద్దరు యువకులు నిలబడి కనిపంచారు. వారి వద్ద గ్యాస్ కట్టర్లు, ఎయిర్ గన్‌లు కనిపించడంతో అనుమానం వచ్చి తనిఖీ చేశారు. ఈ యువకులిద్దరూ రాజస్థాన్ నుంచి వచ్చి వన్‌టౌన్‌లో ఉంటున్నట్టు గుర్తించారు. వారిని వెంటనే అదుపులోకి తీసుకున్నారు. బ్యాంక్, ఏటీఎంలో చోరీకి ఈ సరంజామాను సిద్ధం చేసుకున్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. దోపిడీకి బయల్దేరినట్టు యువకులు అంగీకరించినట్టు సమాచారం. వేరే నగరంలో దోపిడీ నిమిత్తం ఈ సరంజామాను తరలించాలని చూస్తుండగా, పోలీసుల చేతికి చిక్కారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను గురువారం వెల్లడించే అవకాశాలు ఉన్నాయి.

బాలుడి ప్రాణాలు తీసిన షెడ్డు



ఆడుకుంటుండగా కూలిన శ్లాబ్

- ఇద్దరు బాలురుకు తీవ్ర గాయాలు 8లో
- యనమలకుదురు లాకుల వద్ద ఘటన



వసూలు మేస్త్రులు

కార్పొరేషన్‌లో లీడ్ మేస్త్రుల వసూళ్లపర్వం

వైసీపీ హయాంలో అనధికారికంగా 162 మంది నియామకం

- శానిటరీ వర్కర్లుగా పనిచేస్తున్న వారికి అదనపు బాధ్యతలు
- పర్మినెంట్ శానిటరీ మేస్త్రుల పనులన్నీ లీడ్ మేస్త్రులతో..
- నెలకు రూ.లక్ష వసూలు చేయాలని టార్గెట్
- మంత్రి నారాయణ ఆగ్రహం వ్యక్తం చేసినా పట్టించుకోరు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్‌లోని శానిటరీ విభాగం అవినీతిలో కూరుకుపోయింది. ప్రజారోగ్య శాఖలో అత్యంత కీలకమైన ఈ విభాగంలోని కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అసలు విధుల కంటే కొసరు సంపాదనపై దృష్టిపెట్టారు. కార్పొరేషన్ పరిధిలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ల దిగువ శ్రేణిలో శానిటరీ మేస్త్రులు, వర్కర్లు మాత్రమే పనిచేస్తారు. కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో శానిటరీ లీడ్ మేస్త్రుల పేరుతో అనధికారికంగా 162 మందిని తెరపైకి తీసుకొచ్చారు. తమ కింద పనిచేయాల్సిన శానిటరీ వర్కర్లలో తమ మాట వినేవారు, తమకు నమ్మకంగా పనిచేసే వారిని లీడ్ మేస్త్రులుగా నియమించుకున్నారు. వీరి నియామకానికి ఎలాంటి అధికారిక ఉత్తర్వులు లేవు.

మామూలుగా కార్పొరేషన్ శానిటరీ విభాగంలో పనిచేసే శానిటరీ మేస్త్రులు పర్మినెంట్ ఉద్యోగులుగా ఉన్నారు. వీరికి జీతం రూ.లక్షపైనే ఉంది. దీంతో వీరు తమ విధులు గాలికొదిలేశారు. చాలామంది శానిటరీ మేస్త్రులు విధులకు హాజరు కావట్లేదు. అవినీతి శానిటరీ ఇన్‌స్పెక్టర్ల జాతకాలన్నీ వీరి దగ్గర ఉన్నాయి. దీంతో శానిటరీ మేస్త్రులు విధులకు హాజరు కాకపోయినా ఇన్‌స్పెక్టర్లు పట్టించుకోవట్లేదు.

అవినీతి ఇలా జరుగుతోంది..

కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి రుచి మరిగిన కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు.. పరిశుభ్రతపై మరింత పర్యవేక్షణ పేరుతో శానిటరీ వర్కర్లుగా పనిచేసే వారిలో కొందరిని లీడ్ మేస్త్రులుగా నియమించారు. తమకు కావాల్సిన శానిటరీ వర్కర్లలో 162 మందికి ఆ మిగతా 6లో..

వంశీ బెయిల్‌పై విచారణ నేటికి వాయిదా

- సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో వాదనలు 8లో
- టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో బెయిల్ దాఖలు



మొరాయించిన ఆర్టీసీ బస్సు

బెంజిసర్కిల్ వద్ద బుధవారం ఓ ఆర్టీసీ బస్సు ఆగిపోవడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. ప్రయాణికులే బస్సు దిగి రోడ్డు పక్కకు నెట్టారు.

అసెంబ్లీ వాయిస్

గుడివాడ - కంకిపాడు రోడ్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలి



గుడివాడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ - కంకిపాడు రహదారిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే వెనిగండ్ల బుధ వారం అసెంబ్లీ సమావేశాల్లో కోరారు. అధ్వాన స్థితిలో ఉన్న రహదారి వలన జరిగిన ప్రమాదాల ఫొటోలను ఆయన అసెంబ్లీలో ప్రదర్శించారు. గత నాలుగేళ్ల కాలంలో 75 ప్రమాదాలు చోటుచేసుకు న్నాయని, 15 మంది ప్రాణాలు కోల్పోయా రని, వందల సంఖ్యలో గాయపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రహదారిలోనే జరిగిన ప్రమాదంలో మాజీ ఎమ్మెల్యే రావి హరిగోపాల్ మరణించారని గుర్తు చేశారు. రిటైనింగ్ వాల్ కట్టి శాశ్వత పరిష్కారానికి చొరవ చూపాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరారు. రోడ్డు భవనాల శాఖ మంత్రి బి.సి.జనార్ధన్‌రెడ్డి సమాధానమిస్తూ గత వైసీపీ ప్రభుత్వం చేసిన పాపాలు ఆర్ అండ్ బీ శాఖను వెంటా డుతున్నాయన్నారు. ఇప్పటికే రూ.24 కోట్ల వ్యయంతో రహదారి అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయని, ఏప్రిల్ నెలాఖరులోపు పనులను పూర్తి చేస్తామని మంత్రి జనార్ధన్‌రెడ్డి వివరించారు.

మహిళా సాధికారతతో కుటుంబ వ్యవస్థ బలోపేతం : సౌమ్య



నందిగామ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మహిళా సాధికారతతో కుటుంబ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా కూటమి ప్రభుత్వం పని చేస్తుం దని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య అన్నారు. అసెంబ్లీలో మహిళా సాధికా రతపై జరిగిన చర్చలో ఆమె మా ట్లాడుతూ, టీడీపీ ఆవిర్భావం తరువాతే మహిళల అభున్నతి ప్రారం భమైంద న్నారు. మహిళలకు ఆస్తి హక్కు కల్పిం చిన ఎన్టీఆర్ బాటలో నడుస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం మహిళల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. ఎంతో మంది మహిళలు నేడు చిరు వ్యాపారాలు, చిన్న పరిశ్రమలు స్థాపించి కుటుం బాలను ఆర్థికం గా నిలబెడుతున్నారన్నారు. కూటమి పాలనలో మహిళలకు రక్షణ, ఆర్థిక సాధికారత లభిస్తుందన్నారు.. మహిళల కోసం పని చేస్తున్న ప్రభుత్వంలో ఉండడం గర్వంగా ఉందన్నారు.

కంకిపాడు హెడ్ రెగ్యులేటర్ మరమ్మతులకు నిధులివ్వాలి



పామర్రు, మార్చి 12 (ఆంధ్ర జ్యోతి) : కంకిపాడు హెడ్ రెగ్యులేటర్ మర మ్మతులకు అవస రమైన రూ.20 కోట్ల నిధులు విడుదల చేయాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అసెంబ్లీలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బందరు కాల్వ ఆధు నీకరణ అవ శ్యకత ను వివరించారు. పట్టిసీమ ప్రాజెక్టుతో గోదావరి జలాలను జిల్లా రైత న్నలకు అం దించి అపర భగీరథుడిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నిలిచార న్నారు. ఐదు నియో జకవర్గాల రైతులకు సాగునీటిని అందించే కంకిపాడు హెడ్ రెగ్యులేటర్ దెబ్బతిని నీటి సరఫరాకు ఇబ్బంది కరంగా మారిందన్నారు. కంకిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు మరమ్మతులు చేస్తే సాగు, తాగునీటి సమస్య పరిష్కారంతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పం నెరవే ర్చిన వారమౌతామని జలవనరుల శాఖ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

పోరంకి దేవదాయ భూములపై స్పష్టత ఇవ్వండి



పెనమలూరు, మార్చి12 (ఆంధ్రజ్యోతి) : పెనమ లూరు మండలం పోరంకి గ్రామంలోని దేవదాయ భూముల వ్యవహారంలో ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేయా లని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ బుధవారం అసెంబ్లీలో డిమాండ్ చేశారు. పోరంకిలోని 423-1, 2, 3 సర్వే నంబర్లలో పదిన్నర ఎకరాల దేవదాయ భూములను ఎంతో మంది కొనుగోలు చేసి ఇళ్లు కట్టుకుని, వాటిపై రుణాలు తీసుకొని పిల్లలను చదివిం చుకుంటున్నారన్నారు. సదరు భూములు నిషేధిత జాబితాలో ఉండడంతో వాటిపై పూర్తి హక్కులు లేక అమ్ముకోవడానికి వీలు లేకుండా పోయిందని ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. గతంలో ఎన్నోసార్లు ఈ సమస్యపై ప్రభుత్వానికి అర్జీలు ఇచ్చామని గుర్తు చేశారు. స్థలాలు అనుభవిస్తున్న వారికి ఏదో ఒక వి షయం తేల్చి చెప్పినట్లయితే, న్యాయస్థానాలను ఆశ్రయించే అవకాశం కల్పిం చిన వారమవుతామని మంత్రి రామనారాయణ రెడ్డికి విన్నవించారు.

తొమ్మిది గ్రామాలను ఒకే పోలీస్‌స్టేషన్ పరిధిలో చేర్చాలి



విజయవాడ రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : వి జయవాడ రూ రల్ మండలంలోని తొమ్మిది గ్రామాలను ఒకే పోలీస్‌స్టేషన్ పరిధిలోకి చేర్చాలని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ సమావేశం జీరో అవర్‌లో యార్లగడ్డ పోలీస్‌స్టేషన్‌ల సమస్యపై మాట్లాడారు. తన నియోజకవర్గంలోని విజయవాడ రూరల్ మండలం పరిధిలో తొమ్మిది గ్రామాలు ఉన్నాయని, ఆ గ్రామాలు పలు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఉండడం వల్ల ప్రజలు అయోమయానికి గురై ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తొమ్మిది గ్రామాల్లో రెండు గ్రామాలు కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉండగా, ఐదు గ్రామాలు పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు గ్రామాలు నున్న పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్నాయన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్ట్యా గ్రామాలు అన్నింటికీ ఒకే స్టేషన్ పరిధిలోకి తీసుకువచ్చి సమస్యను పరిష్కరించాలని కోరారు.



వీర్రాజుకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న డీసీ కిషోర్‌కుమార్

తిరుపతమ్మ సేవలో ఎమ్మెల్సీ అభ్యర్థి సోము వీర్రాజు

పెనుగంచిప్రోలు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే కూటమి ఎమ్మె ల్సీ అభ్యర్థి సోము వీర్రాజు బుధవారం సతీసమేతంగా తిరుపతమ్మ అమ్మ వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనం అనంతరం వారికి ఆలయ ప్రధాన అర్చకుడు మర్రెబోయిన గోపిబాబు ఆధ్వర్యంలో అర్చకులు వేద పండి తులు ఆశీర్వచనం అందజేశారు. శేషవస్త్రాలు, ప్రసాదాలు, చిత్రపటాన్ని ఆలయ డిప్యూటీ కమిషనర్ బి.హెచ్.వి.ఎస్.ఎన్ కిషోర్ కుమార్ అందజేశారు. టీడీపీ ప్రముఖులు కల్లూరి శ్రీవాణి, మన్నె శ్రీనివాసరావు, డాక్టర్ కర్ల కోటేశ్వరరావు, కీసర రాంబాబు, బబ్బూరి శ్రీరామ్ పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షణ రేపు

ఇంద్రకీలాద్రి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి పౌర్ణమినాడు జరిగే గిరి ప్రదక్షణ, మాసవారీ ఉత్సవాలను ఈనెల 14వ తేదీ శుక్రవారం నిర్వహిస్తు న్నట్లు ఈవో కె.రామచంద్రమోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5.55 గంటలకు ఘాట్‌రోడ్డులో టోల్ గేట్ వద్ద ఉన్న కామధేను అమ్మవారి ఆలయం వద్ద నుంచి గిరిప్రదక్షణ ప్రారం భమవుతుందన్నారు. ఘాట్‌రోడ్ అమ్మవారి గుడి, కుమ్మరిపాలెం సెంటర్, విద్యాధరపురం, పాల ఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణ వీధి నుండి తిరిగి ఇంద్రకీలాద్రి వరకు గిరి ప్రదక్షణ జరుగుతుందని తెలిపారు.

గత ఐదేళ్లలో జాతీయ మైనార్టీ అభివృద్ధి సంస్థ ద్వారా 3,191 మందికి లబ్ధి

- కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు

వన్‌టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గత అయిదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో 3,191 మంది లబ్దిదారులకు మాత్రమే జాతీయ మైనారిటీ అభివృద్ధి, ఫైనాన్స్ కార్పొరేషన్ (ఎన్‌ఎండీఎఫ్‌సి) రుణాలు అందజేసినట్లు కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. అయిదేళ్లలో ఏపీలో జాతీయ మైనారిటీల అభివృద్ధి, ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా లబ్ధి పొందిన లబ్దిదారుల వివరాలు, ఆ పథకానికి కేటాయించిన నిధులు గురించి, ప్రభుత్వ విద్యా రుణ పథకంలో క్రెడిట్ లైన్-1, క్రెడిట్ లైన్-2 లబ్ధి దారుల డేటా తెలి జేయాలంటూ విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ లోక్‌సభలో బుధవారం కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖను కోరారు. దీనికి కిరణ్ రిజిజు లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఐదే ళ్లలో దేశవ్యాప్తంగా రూ.3,600.21 కోట్లు నిధులు విడుదల చేయగా, ఏపీకి రూ.9.68 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు.

దాహం తీర్చడమే లక్ష్యం

వేసవిలో నందిగామలో తాగునీటి ఎద్దడిని అధిగవించేందుకు మునిసిపల్ అధికారు లు ప్రణాళికలు సిద్ధం చేశారు. గత ఏడాది ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ముందుగానే అప్రమత్తమైన అధికారులు మంచినీటి పథకాలను పటిష్టం చేశారు. అధికారులు చేస్తున్న భగీరథ ప్రయత్నాలను ప్రజలు హర్షిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-నందిగామ)

నందిగామ పట్టణంలో 50 వేలకు పైగా జనాబా ఉంది. ప్రజల నీటి అవసరాలు తీర్చాలంటే నిత్యం ఏడున్నర లక్షల లీటర్ల నీటిని సరఫరా చేయాలి. ఉన్నంతలో సమ ర్థంగా నీటిని అందించేందుక అధికా రులు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. కీసర మంచినీటి పథకం వద్ద 30 హార్స్‌పవర్ రెండు మోటార్లు పని చేస్తున్నాయి. ఈ పథకం నుంచి నిత్యం లక్షన్నర లీటర్ల నీరు అందుతుంది. మునేటి పథకం వద్ద 20 హార్స్‌పవర్ నాలుగు మోటార్లు ఉన్నాయి. దీని నుంచి 1.20 లక్షల లీటర్ల నీరు వస్తుం ది. కాట్రేనిపల్లి పథకం నుంచి 70వేల లీటర్ల నీరు వస్తుంది. నందిగామ జనాభా ప్రకారం తలకు 130 లీటర్ల నీటిని అందించాలంటే ఏడున్నర లక్షల లీటర్ల నీరు అవసరం ఉంది. దీనిపై దృష్టి సారించిన అధి కారులు ఇప్పటికే పట్టణంలో ఉన్న అన్ని పైప్‌లైన్‌లకు మరమ్మతు చేపట్టారు. అదనపు నీటిని వదిలినా పగల కుండా జాగ్రత్తలు చేపట్టారు. పైప్‌లైన్లు, మంచినీటి పథకాల వద్ద విద్యుత్ వ్యవస్థకు మరమ్మతులు చేయిం చారు. పైప్‌లైన్‌ల ద్వారా నీరు అందని బీసీ కాలనీ, డీవీఆర్ కాలనీ, ఏడవ వార్డులకు కొత్తగా పైప్‌లైన్లు వేశారు. ఎక్కడైనా పైప్‌లైన్లు పగిలి నీరు అందని స్థితి నెలకొంటే తక్షణమే ఆ ప్రాంతానికి నీరు అందించేం దుకు పది ట్యాంకర్లను సిద్దం చేశారు. మంచినీటి సర ఫరాలో ఏర్పడే అంతరాయలను అధిగమించేందు రూ.24 లక్షల నిధులను సిద్ధంగా ఉంచారు. కీసర ఎత్తి పోతల పథకం వద్ద మరో రెండు మోటార్లు, మునేరు వద్ద మరో మోటార్ ఏర్పాటు కూడా కూడా చర్యలు తీసుకున్నారు. ప్రజల సహకారం కూడా తీసుకొని వేసవిని ఎదుర్కొం టామని కమిషనర్ రమణబాబు, ఏఈ పణిశ్రీనివాస్, నీటి సరఫరా సిబ్బంది ఆత్మవిశ్వా సంతో చెప్పుకొస్తున్నారు. అధికారులు వాల్స్‌పై దృష్టి సారించకపోవడం వల్ల లీకేజీలు ఏర్పడి నీరు వృథాగా పోతోంది. కమిషనర్ రమణబాబు, ఏఈ పణిశ్రీని వాస్ నిశిత పరిశీలనతో వాటి మరమ్మతులపై దృష్టి పెట్టారు. ట్యాంక్‌ల వద్ద ఉన్న భారీ వాల్వ్‌కు మరమ్మ తులు చేపడుతున్నారు.



మునేటిలో కొత్త బోరు, పైప్‌లైన్‌కు మరమ్మత్తులు

చేజారిన ఏఐబీ ప్రాజెక్ట్

మునిసిపల్ ప్రజలకు తలకు 135 లీటర్ల నీటిని అందించే లక్ష్యంతో 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఏషియన్ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ద్వారా రాష్ట్రం లోని పలు పట్టణాలకు భారీ మంచినీటి పథ కాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా

నందిగామ మున్సిపల్ అధికారుల భగీరథ యత్నం

నందిగామ మునిసి పాలిటీకి రూ.70 కోట్ల అంచనా లతో కృష్ణానదిపై ఈ పథకం నిర్మిం చేందుకు అనుమ తులు తెప్పించారు. కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో నిర్మించే ఈ పథకాలకు 20 శాతం రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. ఈ ప్రక్రియ జరుగుతున్న సమ యంలో ఎన్నికలు రావడం, వైసీపీ అధికారం టలోకి రావడం జరిగింది. మౌలిక వసతుల కల్పనకు జగన్ ప్రభుత్వం పెద్దగా ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో ఆ పథకం పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తిరిగి ఈ ప్రాజెక్టుపై దృష్టి సారించారు. గత ప్రభుత్వంలోని అంచనాలను రివైజ్ చేసి కొత్త ధరల ప్రకారం 89 కోట్లతో డీపీఆర్ తయారు చేసి పంపారు. ఈ పథకం పూర్తయితే 2050నాటికి పెరిగే నందిగామ పట్టణ జనాభాకు సైతం తలకు 135 లీటర్ల నీటి అందించే అవకాశం ఉండేది.

జలజీవన్ మిషన్‌పై ఆశలు

పులిచింతల బ్యాక్ వాటర్‌పై జలజీవన్ మిషన్ భారీ వాటర్ గ్రిడ్ నిర్మాణానికి సిద్దమైంది. దీని ద్వారా శుద్ధి చేసిన నీటిని నందిగామ, జగ్గయ్యపేట ప్రాంతా లలోని గ్రామాలకు అందించనున్నారు. సంకల్పిం చారు. రూరల్ వాటర్ సప్లై శాఖ నిర్వహించబోయే ఈ పథకం ద్వారా నందిగామ, జగ్గయ్యపేట పట్టణా లకు లక్ష లీటర్ల చొప్పున నీటిని కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

పేదల గృహాలకు అదనపు ఆర్థిక సాయం



ఎన్టీఆర్ కలెక్టరేట్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం సువర్ణావకాశాన్ని కల్పించిందని, సద్విని యోగం చేసుకొని గృహ నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ, పట్టణ) 1.0 కింద గృహ నిర్మాణం చేపట్టిన లబ్దిదారులకు యూనిట్ వి లువ రూ.1,80,000కు అదనంగా వివిధ వర్గాల వారికి ప్రయోజనం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు. కలెక్టర్ లక్ష్మీశ, గృహ నిర్మాణ శాఖ అధికా రులతో కలిసి కలెక్టరేట్‌లోని వీడియా కాన్ఫరెన్సు హాలులో సమావేశం నిర్వహించారు.

ఎస్సీ, బీసీ లబ్దిదారులకు రూ .50 వేలు, ఎస్టీ లబ్ధిదారు లకు రూ.75 వేలు, పీవీటీజీ (పర్వత ప్రాంత షెడ్యూల్ తెగ లు)లకు రూ.లక్ష అదనపు సాయం అందుతుందని వివ రించారు. ఎస్సీలకు సంబంధించి ఇప్పటికే 3,822 ఇళ్లు, ఎస్టీలకు సంబంధించి 556 ఇళ్లు, బీసీలకు సంబంధించి 4,018 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్, ఆపై దశలో ఉన్నాయని తెలి పారు. మిగిలిన లబ్దిదారులు కూడా రూ.1.80 లక్షల యూనిట్ విలువకు అదనంగా ప్రభుత్వం అందించే మొత్తాన్ని ఉపయో గించుకొని త్వరితగతిన ఇళ్ల నిర్మాణా లను పూర్తిచేసుకో వాలన్నారు. గృహ నిర్మాణ పీడీ ఆర్.లీలారాణి, డీఈ ఒ.విజయ బాబు, ఈఈ జి.కపూర్ పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధుల క్రీడలు 18 నుంచి

విజయవాడ స్పోర్ట్స్), మార్చి12 (ఆంధ్ర జ్యోతి) : నిత్యం ప్రజా సమస్యలలో సతమత మయ్యే ప్రజా ప్రతినిధులకు ఆటవిడుపు కోసం ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ అసెంబ్లీ స్పోర్ట్స్ మీట్ నిర్వహించనుంది. ఈ నెల 18 నుంచి 20 వరకు ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం, డాక్టర్ దండమూడి రాజగోపాల్ ఇండోర్ స్టేడియంలలో ఈ స్పోర్ట్స్ మీట్ నిర్వహ ణకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఈ స్పోర్ట్స్ మీట్ షెడ్యూల్‌ను శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు బుధవారం అసెంబ్లీ స్పీకర్‌కు అందజేశారు. ఆ షెడ్యూల్‌ను పరిశీలించిన అనంతరం ఏఏ పోటీలలో ఎవరె వరు పాల్గొంటారో జాబితాను శాప్‌కు గురు వారం అందజేయనున్నారు. ఈ జాబితా వచ్చిన అనంతరం అందుకు తగిన ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేయనున్నారు. ఈ స్పోర్ట్స్ మీట్ ప్రారంబం లేదా ముగింపు కార్యక్రమానికి సీఎం చంద్రబాబు నాయుడు వస్తారని, మిగి లిన ప్రజా ప్రతినిధులు ఎవరెవరు ఈ స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొంటారో శుక్రవారం తెలుస్తుందని శాప్ చైర్మన్ తెలిపారు.

పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక చొరవ

ఎన్టీఆర్ కలెక్టరేట్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) :పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందని, దీనిలో భాగంగా పర్యాటకులకు మధు రానుభూతి మిగిల్చేలా ప్రత్యేక ప్యాకేజీలను అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తు న్నట్లు కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా పర్యాటక మండలి (డీటీసీ) సమా వేశం జరిగింది. ఎన్టీఆర్ జిల్లాలోని పర్యా టక ప్రాంతాలు, పర్యాటక ప్యాకేజీల రూప కల్పన తదితరాలపై చర్చించారు. ఉదా హరణకు ఒక రోజు ప్యాకేజీలో కనకదు ర్గమ్మ ఆలయం, బెరం పార్కు, కొండపల్లి ఫోర్ట్, పవిత్ర సంగమం, భవానీ ఐలాండ్, బాపూ మ్యూజియం, గాంధీహిల్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్మృతి వనం ఉంటాయని వివరించారు. రెండు రోజులు, మూడు రోజులు, నాలుగు రోజుల ప్యాకేజీలను కూడా రూపొందించి, గైడ్ సదుపాయం కూడా కల్పించడం జరుగుతుందన్నారు. సిటీ ప్యాకేజీ, టెంపుల్ ప్యాకేజీ, చారిత్రక స్థలాల ప్యాకేజీ వంటి వాటిని కూడా దశల వారీగా అందు బాటులోకి తెస్తామన్నారు. దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంతో పాటు జిల్లాలో వేదాద్రి, కోటిలింగ హరి హర మహాక్షేత్రం, తిరుపతమ్మ దేవ స్థానం, స్వయంభూ వల్మీకోద్భవ వేంకటేశ్వ రస్వామి దేవస్థానం, వేణుగోపాల స్వామి దేవస్థానా ల్లో సౌకర్యాలు కూడా కల్పిస్తే టెంపుల్ టూరిజం అభివృద్ధి చెందుతుంద న్నారు. నిర్మాణం పూర్తయిన కొండపల్లి షాపింగ్ కాంప్లెక్సును త్వరితగతిన అందు బాటులోకి తెచ్చేందుకు పర్యాటక అధికా రులు చర్యలు తీసుకోవాలన్నారు. ముక్త్యాల ఏపీ టూరిజం రెస్టారెంట్, గాంధీహిల్ డిజి టల్ ప్లానిటోరియం/స్పేస్ ఆస్ట్రానమీ సెంటర్, కొండపల్లి ఫోర్ట్ లేజర్ షో, కొండ పల్లి గ్రామంలో ఎక్స్‌పీరియన్స్ సెంటర్ అభివృద్ధి అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, ఏపీ టీడీసీ డివిజనల్ మేనేజర్ పీఎన్ కృష్ణచై తన్య, విజయవాడ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, జిల్లా అటవీ అధికారి జి.స తీష్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.శ్రీనివాస రావు, ఏపీ హోటల్స్ అసోసియేషన్ ప్రెసి డెంట్ ఆర్వీ వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలి

ధర్నాచౌక్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బి.వెంకట్, వి .వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికుల సమ స్యలు పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ సంఘం ఆధ్వర్యంలో ధర్నాచౌక్‌లో బుధవారం ధర్నా నిర్వహించారు. వలసలు ఆపేందుకు వంద రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలకు అదనంగా పని దినాలు కల్పించాలన్నారు. సమ్మర్ అల వెన్స్ పే స్లిప్‌లు, పెండింగ్ బకాయిలు తక్షణమే చెల్లించాలని, ఉపాధిహామీలో యంత్రాలు, కాంట్రాక్ట్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

స్వచ్ఛతా స్ఫూర్తి ఒక్కరోజుతో ఆగకూడదు

ఎన్టీఆర్ కలెక్టరేట్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రతినెలా మూడో శనివా రాన్ని స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర దివస్‌గా గుర్తించినందున, ఈసారి కూడా విజయ వంతం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ఈనెల 15వ తేదీ మూడో శనివారం నిర్వహించాల్సిన కార్యక్రమాలపై కలెక్టర్ లక్ష్మీశ, జిల్లాస్థాయి అధికారులు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు తదితరులతో టెలికా న్ఫరెన్సు నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం ప్రధాన అంశంగా కార్య క్రమాలు నిర్వహించాల్సి వుందన్నారు. క్లాత్ బ్యాగుల వినియోగాన్ని ప్రోత్సహించా లని ఆదేశించారు. చికెన్, మటన్ దుకాణాల్లోనూ పాలిథిన్ సంచులు ఉపయోగిం చకుండా నియంత్రణా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమాల్లో భాగంగా స్వచ్ఛంధ్ర ప్రతిజ్ఞను చేయించాలని సూచించారు. టెలికాన్ఫరెన్సులో విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, డీపీవో పి.లావణ్యకుమారి, విజయవాడ ఆర్డీఓ కావూరి చైతన్య, నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, తిరువూరు ఆర్డీవో కె.మా ధురి తదితరులు హాజరయ్యారు.

ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి

మచిలీపట్నం, మార్చి12(ఆంధ్రజ్యోతి) : పెండిం డ్ ఫీజులను కూటమి ప్రభుత్వం విడుదల చేయాలని కోరుతూ వైసీపీనాయకులు, కార్యకర్తలు బుధవారం కలె క్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. తొలుత ధర్నాచౌక్ వద్దకు వెళ్లకుండా పోలీసులు వైసీపీ నాయకులను అడ్డుకున్నారు. జిల్లా వైసీపీ అధ్యక్షుడు పేర్నినాని మాట్లా డుతూ కూటమి ప్రభుత్వం విదార్థులకు ఫీజు రీయింబ ర్స్‌మెంట్ విడుదల చేయలేదన్నారు. మొదటి సంతకం చేసిన డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా ఎప్పటిలోగా టీచర్ ఉద్యోగాలు ఇస్తారో తెలియకుండా ఉందన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాలహారిక, మాజీ శాసనసభ్యులు కైలే అనిల్‌కుమార్, సింహాద్రి రమేష్‌బాబు, మేయర్ చిటి కెన వెంకటేశ్వరమ్మ, వైసీపీ నాయకులు ఉప్పాలరాము, పేర్నికిట్టు, ధనేకుల చక్రవర్తి, డాక్టర్ భరత్ తదితరులు పాల్గొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని కోరుతూ కలెక్టర్ బాలాజీకి వైసీపీ నాయ కులు వినతిపత్రం అందజేశారు.



ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పేర్ని నాని



విజయవాడ ర్యాలీలో అవినాష్, వెలంపల్లి తదితరులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, : ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి, మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణపై కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని నిరసిస్తూ ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్వర్యంలో 'యువత పోరు'లో భాగంగా భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ కార్యాల యాన్ని ముట్టడించేందుకు వచ్చిన వైసీపీ నేతలు జోగి రమేష్, వెల్లంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు, దేవినేని అవి నాష్, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పోతిన మహేష్, పూనూరు గౌతంరెడ్డిలను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులకు, వైసీపీ నేతలకు మధ్య తోపులాట జరిగింది. దేవినేని అవినాష్, వెల్లంపల్లి శ్రీనివాస్, జోగి రమేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యార్థులకు అన్యాయం చేస్తోందన్నారు. షేక్ ఆసిఫ్, మొండితోక జగ న్మోహన్, మల్లాది విష్ణు, సింహాద్రి రమేష్, పోతిన మహేష్, డిప్యూటీ మేయర్‌లు శైలజారెడ్డి, బెల్లం దుర్గ, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

మార్గం సుగమం

ఆంధ్రజ్యోతి, గుడివాడ : గుడివాడ, పామర్రు, గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల పరిధిలో సుమారు 24 కిలోమీటర్ల పొడవున గుడివాడ- కంకిపాడు రహదారి వి స్తరించి ఉంది. గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం కనీస మరమ్మతులు కూడా చేయకపోవడంతో దారి పొడవునా భారీ గుంతలు ఏర్పడ్డాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విడత లవారీగా పనులు చేపట్టింది. భూషణగుళ్ల రోడ్డు నుంచి వెంట్రప్రగడ వరకు 7.8 కిలోమీటర్ల మేర మరమ్మతులకు రూ.5 కోట్లు విడుదల చేసింది. పనులు శరవేగంగా జరుగుతున్నాయి. డిసెంబరులోనే రూ.40 లక్షలతో వెంట్రప్రగడ-నందమూ రు అడ్డరోడ్డు వరకు 2.2 కిలోమీటర్ల మరమ్మతులు పూర్తి చేశారు.

వైసీపీ హయాంలో నిధులు దారి మళ్లింపు

టీడీపీ అధికారంలో ఉన్న 2018లో గుడివాడ-కంకిపాడు రహదారి విస్తరణ, అభివృద్ధి ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ రోడ్ ఫండ్ (సీఆర్ఎఫ్) రూ.165 కోట్లు మంజూరు చేసింది. తొలి ప్యాకేజీగా రూ.16 కోట్లతో గుడివాడ-కంకిపాడు మధ్య నాలుగు నియోజకవర్గాల పరిధిలో 21.6 కిలోమీటర్ల మేర రహదారిని పటిష్టపరిచి, ఇరువైపులా మీటరు వెడల్పు చేయాల్సి ఉండగా, అప్పటి మంత్రి కొడాలి నాని నిధులను దారి మళ్లించారు. గుడివాడ నియోజకవర్గ పరిధిలో 5 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణ, రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు పూర్తి చేశారు. .

అసెంబ్లీలో వెనిగండ్ల ప్రస్తావన

అధ్వానంగా ఉన్న గుడివాడ-కంకిపాడు రహదారిలో జరిగిన ప్రమాదాల చిత్రాలను అసెంబ్లీలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రదర్శించారు. ఈ రహదారికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. నాలుగేళ్లలో 75 ప్రమాదాలు చోటుచేసుకున్నాయని, 15 మంది మరణించారని, వందల సంఖ్యలో గాయాలపాలై వికలాంగులయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఏప్రిల్‌లోపు పూర్తిచేస్తాం : మంత్రి జనార్ధన్‌రెడ్డి

గత ప్రభుత్వం చేసిన పాపాలు ఆర్‌అండ్‌బీ శాఖను వెంటాడుతున్నాయని, రూ.24 కోట్లతో గుడివాడ-కంకిపాడు రహదారి అభివృద్ధి పనులు ప్రారంభమై పురోగతిలో ఉన్నాయని, ఏప్రిల్ నాటికి నూరుశాతం పూర్తి చేస్తామని మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి అసెంబ్లీలో హామీ ఇచ్చారు.

అత్యంత కచ్చితత్వంతో రీ సర్వే పనులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకా లకు అనుగు ణంగా భూ యజమానుల సమ క్షంలో అత్యం త పారదర్శకంగా, జవాబుదారీ తనంతో రీ సర్వే పనులు జరుగుతున్నట్లు ఎన్టీ ఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కంచికచర్ల మండలం గండే పల్లిలో జరుగుతున్న భూ ముల రీ సర్వే ప్రక్రి యను బుధవారం ఆయన పరిశీలించారు. రీ సర్వేలో కచ్చిత త్వానికి అత్యంత ప్రాధాన్య మివ్వాలని, ఎలాంటి తప్పిదాలకు తావులేకుం డా సజా వుగా నిర్వహించాలని స్పష్టం చేశారు. గ్రామాలను భూవివాద రహితంగా తీర్చిదిద్దేం దుకు నిర్వహిస్తున్న రీసర్వే పనులపై క్షేత్ర స్థాయి అధికారులు అప్రమత్తంగా వుండాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. కలెక్టర్ వెంట నందిగామ ఆర్డీఓ కె.బాలకృష్ణ, అసిస్టెంట్ డైరక్టర్ (సర్వే, భూ రికార్డులు) టి.తివిక్రమ రావు, కంచికచర్ల ఎమ్మార్వో మానస, గ్రామ సర్వేయర్లు తదితరులున్నారు.

పీ4 సర్వేతో ప్రతి గృహానికి లబ్ధి

ప్రభుత్వం, దాతల, ప్రజల భాగస్వామ్యం (పీ4) సర్వేతో ప్రతి ఇంటికి లబ్ధి, ప్రతి జీవి తానికి ప్రగతి చేకూరుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. తన చాంబర్‌లో ప్రణాళిక శాఖ రూపొందించిన అవగాహన, క్యూఆర్ కోడ్‌తో కూడిన వాల్ పోస్టర్‌ను ఆయ న ఆవిష్కరించారు. పేదరికం లేని సమాజాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం చిత్తశు ద్ధితో పనిచే స్తోందన్నారు. ప్రతి ఒక్కరూ తమ విలువైన అభిప్రాయాన్ని స్వర్ణాంధ్ర ఏపీ.జీఓవి.ఇన్/పీ4 వెబ్‌సైట్, క్యూఆర్ కోడ్ ద్వారా ఈనెల 25 తేదీ లోగా తెలియజేయాలన్నారు. జడ్పీ సీఈవో కె.కన్నమ నాయుడు, సీపీవో శ్రీలత, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, గ్రామ వార్డు సచివాల యాల ప్రత్యేక అధికారి జి. జ్యోతి, డీపీవో లావణ్యకుమారి, జిల్లా వ్యవ సాయ శాఖ అధి కారి డీఎంఎఫ్ విజయ కుమారి, డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని పాల్గొన్నారు.

మల్లయ్యగట్టు..కొల్లగొట్టు..!

(5వ పేజీ తరువాయి)

తవ్వుకోవటానికి రెన్యువల్స్ చేయించుకుం టున్నారు. ఇక్కడ తవ్వేదేమీ లేకపోవడంతో గట్టు చుట్టూ విచ్చలవిడిగా తవ్వేశారు. రెండు తాటిచెట్ల లోతున తవ్వేశారు. తీసుకున్న అను మతులు 500 క్యూబిక్ మీటర్లకు అయితే, లక్షల క్యూబిక్ మీటర్ల మేర తవ్వకాలు జరిగాయి. వైసీపీ హయాంలో జరిగిన ఈ అక్రమ తవ్వ కాల కారణంగా కొంగర మల్లయ్యగట్టు చుట్టూ భారీ గోతులు, అందులో చెరువులను తలపిం చేలా నీరు నిల్వ ఉండిపోయింది. కొండపై కొంగర మల్లయ్యను దర్శించుకోవటానికి వచ్చే భక్తులకు ఈ గోతులు ప్రాణాంతకంగా మారాయి. ఈ నీటిని రైతులు మోటార్లు వేసు కుని తోడుకుంటున్నారంటే.. ఎంత భారీస్థా యిలో నిల్వ ఉన్నాయో అర్థమవుతుంది.

కూటమి నాయకులతో జతకట్టి..

ఈసారి అక్రమార్కులు రూటు మార్చారు. కూటమి నేతలను కూడా తమ వ్యాపారంలో కలుపుకొని అక్రమ మైనింగ్‌కు తెరతీశారు. రాష్ట్ర టీడీపీలో ముఖ్యమైన నాయకుడి మేన మామ వరస అయిన ఓ నాయకుడిని భాగస్వా మిగా చేసుకున్నారు. దీంతో పాటు కూటమి లోనే మరో జనసేన నాయకుడిని కూడా కలు పుకొన్నారు. ఈ ముగ్గురికి బంధుత్వం కూడా ఉండటంతో అక్రమ మైనింగ్‌లో కలిసిపో యారు. మూడు పార్టీల నేతల భాగస్వామ్యం ఉండటంతో వ్యవస్థలు కూడా వారి కనుసన్న ల్లోనే పనిచేస్తున్నాయి. దీంతో స్థానిక రైతులు ఫిర్యాదులు చేసినా పట్టించుకునే పరిస్థితి లేకుండాపోయింది. కాగా, కడుపు మండిన రైతు గద్దె హరిబాబు స్థానిక పోలీసులు, తహ సీల్దార్, ఆర్డీవోలతో పాటు కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. తన దృష్టికి వచ్చిన ఫిర్యాదుపై కలెక్టర్ దృష్టిసారించారు. ఆకస్మిక తనిఖీలకు నిర్ణయించినా ఇప్పటివరకు వెళ్లలేదు. పరిశీలనల అనంతరం వైసీపీ, కూట మి నేతలు కలిసి సాగిస్తున్న అక్రమ మైనింగ్ బాగోతాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

వసూలు మేస్త్రులు

(5వ పేజీ తరువాయి)

హోదా కల్పించారు. వీరిని అధికారికంగా నియమించలేదు కాబట్టి లీడ్ మేస్త్రులుగా పనిచే యటానికి జీతం ఉండదు. కేవలం శానిటరీ వర్కర్లుగా మాత్రమే వీరికి జీతం వస్తుంది. ఈ లీడ్ మేస్త్రులను.. పర్మినెంట్ శానిటరీ మేస్త్రులు పర్యవేక్షించాలి. లీడ్ మేస్త్రుల అనధికారిక నియా మకాన్ని పర్మినెంట్ శానిటరీ మేస్త్రులే ముందు గా ఖండించాలి. కానీ, అలా జరగలేదు. చాలా మంది శానిటరీ మేస్త్రులు విధులకు హాజరు కాకపోవడమే ఇందుకు కారణం. దీంతో లీడ్ మేస్త్రులు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారు. నెలకు రూ.లక్ష వసూలు చేయాలని వీరికి అవినీతి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నిర్దేశిస్తున్నారు. దీంతో లీడ్ మేస్త్రులు ట్రేడ్ లైసెన్సులు లేని దుకాణాలు, ఉన్న దుకాణాలు, హోటళ్లు, కల్యాణ మండపాల నుంచి అక్రమ వసూళ్లకు తెగబడు తున్నారు. అక్కడ ఉన్న లోపాలను సాకుగా చూపి, బెదిరించి వసూలు చేస్తున్నారు. కొందరు లీడ్ మేస్త్రులు వ్యాపార దుకాణాల దగ్గర వచ్చే చెత్త, హోటళ్ల నుంచి వచ్చే వ్యర్థాలు, కల్యాణ మండపాల నుంచి వచ్చే వ్యర్థాలను తరలించేం దుకు వీలుగా నెలవారీ మామూళ్లు పెట్టుకుం టున్నారు. ఇలా వసూళ్లకు అవసరమైన అన్ని వనరులను లీడ్ మేస్త్రులు సద్వినియోగం చేసు కుంటున్నారు. నెలనెలా సగటున వసూలుచేసే రూ.లక్షలో 30 శాతం మేర లీడ్ మేస్త్రులు తీసుకుంటారు. మిగిలిన 70 శాతాన్ని శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు ఇస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా నడిచిన వసూళ్ల పర్వం ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో కూడా సాగుతోంది. ఈ వ్యవహారాలు రాష్ట్ర పురపాలక మంత్రి పి.నారాయణ దృష్టికి తీసుకెళ్లగా, ఆయ న ఆగ్రహం వ్యక్తం చేశారు. లీడ్ మేస్త్రులను తొలగించి, తక్ష ణం శానిటరీ మేస్త్రులతో పని చేయించాలని నిర్దేశించినా చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా కమిషనర్ ధ్యానచంద్ర దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

విజయవాడ తూర్పు

మర్యాదపూర్వక కలయిక

పటమట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నూతన డీజీపీగా ఇటీవల నియమితులైన హరిష్‌కుమార్ గుప్తాను టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. నేర రహిత ఆంధ్రప్రదేశ్‌గా ఏపీని తీర్చిదిద్దాలని ఆయనను కోరినట్లు గొట్టిపాటి తెలిపారు.



ఎన్ఎస్ఎం రోడ్డు

విస్తరణ పనులకు ప్రణాళికలు చేపట్టండి

కమిషనర్ ధాన్యచంద్ర సూచన



కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న ప్రసాద్

పటమట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్ఎం రోడ్డు విస్తరణ పనులు చేపట్టేందుకు ప్రణాళి కలు చేపట్టాలని నగర కమిషనర్ ధాన్యచంద్ర అధికారులకు సూచిం చారు. 13వ డివిజన్‌లో సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశిం చారు. బుధవారం తన పర్యటనలో భాగంగా కమిషనర్ కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్‌తో కలిసి డివిజన్‌లోని న్యూఆర్టీసీ కాలనీ, ఎలక్ట్రిసిటీ కాలనీ, తోటవారి వీధి, కోనేరు వారి వీధి, జేడీ నగర్ తదితర ప్రాంతాల్లోని సమస్య లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రామాయ ణపు వారి వీధి, తోటవారి వీధి, కృష్ణా నగర్‌లో అండర్ గ్రౌండ్ పైపులైన్‌లు శిథిలావస్థకు చేరుకోవడంతో వాటి స్థానంలో కొత్త పైపులైన్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రామలింగేశ్వరనగర్ నుంచి కృష్ణా జలాలు అందించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మదర్‌థెరెసా పార్క్‌లో వసతులు మెరుగు పర్చాలన్నారు. పారిశుధ్య పనులు మెరుగుదల చేయాలన్నారు. ఈ పర్యటనలో రెసిడెంట్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, జోనల్ కమిషనర్ కె.షమ్మీ, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు, ఈఈ సామ్రాజ్యం, గోపినాయక్, సిబ్బంది ఉన్నారు.

కామన్ స్థలం రిజిస్ట్రేషన్ సమస్యకు

త్వరలో శాశ్వత పరిష్కారం

ఏపీఐఐసీ కాలనీ పెద్దలకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ హామీ



కాలనీ పెద్దలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తూర్పు నియోజక వర్గ పరిధిలోని నాల్గవ డివిజన్ ఏపీఐఐసీ కాలనీలో ఉన్న కామన్‌స్థలం రిజిస్ట్రేషన్ సమస్యకు త్వరలో శాశ్వత పరిష్కారం చేస్తామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ హామీ ఇచ్చారు. ఏపీఐఐసీ కాలనీలోని కమ్యూనిటీహాల్‌లో కాలనీ పెద్దలతో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40సంవ త్సరాల క్రితం నగరంలో నిర్మాణం చేసిన మొట్టమొ దటి గేటెడ్ కమ్యూనిటీ ఏపీఐఐసీ కాలనీ అని అన్నారు. కాలనీలోని కామన్‌స్థలంను అప్పటి ఏపీఐఐసీ అధికా రులు ఇంటి యజమానుల పేరుతో రిజిస్ట్రేషన్ చేయకపో వడం వల్ల ఇబ్బందులు వస్తున్నాయని అన్నారు. ఈ అంశాన్ని తాను స్వయంగా ఏపీఐఐసీ చైర్మన్ రామ రాజు దృష్టికి తీసుకువెళ్లానని అన్నారు. ఈ అంశంపై కాలనీవాసులతో తరుచుగా సమావేశాలు నిర్వహిస్తున్నా మని అన్నారు. చట్టపరమైన ఇబ్బందులు రాకుండా ముందు జాగ్రత్తగా న్యాయనిపుణులతో కూడా చర్చలు జరిపిన తర్వాత ఏపీఐఐసీ చైర్మన్ రామరాజుతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొల్లపూడి నాగేశ్వరరావు, సాంబశివరావు, రెడ్డి రాంబాబు, అబ్దుల్ కలాం, సత్యనారాయణ, .అయ్యప్ప రెడ్డి, రమేష్, పాల్గొన్నారు.

సీపీఎం జనచైతన్య యాత్ర ప్రారంభం



జనచైతన్య యాత్రలో సీపీఎం నాయకులు

పటమట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): 14వ డివిజన్‌లోని సమస్యలపై బుధవారం సీపీఎం జనచైతన్య యాత్రను ప్రారంభిం చింది. కాల్వకట్ట పుట్ట రోడ్డులో సీపీఎం దళం పర్యటించింది. సీపీఎం తూర్పునగర్ కార్యదర్శి పుప్పాల కృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఈ పాదయాత్ర ప్రారం భించినట్లు చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చి 90 రోజులైనా సమస్యలు పరిష్కారం కాలేదని ఆవేదన చెందారు. విద్యుత్ బిల్లులు గత ప్రభుత్వం కంటే ఎక్కువగా వస్తున్నాయన్నారు. లంబాడీపేట ప్రాంతాల్లో కోతులను నివారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 14వ డివిజన్ కార్యదర్శి రవీంద్ర, నగర నాయకులు గురుమూర్తి, డి.వరప్రసాద్, కన్న బాబ్జి, ఏడుకొండలు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ

పిచ్చిమొక్కల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

భారతీనగర్, మార్చి 12 (ఆంధ్ర జ్యోతి): మూడవ డివిజన్‌లోని కరెన్సీ నగర్ కాలనీలోని నీలిశెట్టి రోడ్డు లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పెరి గిన పిచ్చి మొక్కలను గుణదల విద్యుత్ శాఖ అధికారి ఏఈ పి.హరి బాబు ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ సిబ్బంది బుధవారం తొలగించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ ఏదీ అనే శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంతో స్పందిం చిన విద్యుత్ శాఖ సిబ్బంది పిచ్చి మొక్కలను తొలగించారు. తర్వలోనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఇనుప తీగలతో రక్షణ చర్యలు ఏర్పాటు చేస్తామని ఏఈ తెలిపారు.



పిచ్చి మొక్కలను తొలగించిన విద్యుత్ శాఖ సిబ్బంది



ఉద్యోగార్హత సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఎస్.కల్పన

ప్రాంగణ ఎంపికల్లో 19 మందికి ఉద్యోగార్హత

లబ్బీపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కళాశాలలో జరిగిన ప్రాంగణ ఎంపికల్లో 19మంది విద్యార్థులు ఉద్యోగార్హత సాధించినట్లు సిద్ధార్థ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన తెలిపారు. టీసీఎస్ సంస్థ నిర్వహించిన ఈ ఎంపికల్లో పలు ఇంటర్వ్యూల అనంతరం 19మంది ఉద్యోగార్హత సాధించారని, వారికి రూ.2.4లక్షల వార్షిక వేతనం ప్రకటించారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎస్.కల్పన, స్పెషల్ ఆఫీసర్ ఆర్.మాధవి, కళాశాల యాజమాన్యం ఎం.రాజయ్య, పి.లక్ష్మణరావు, ఎస్.లలితప్రసాద్ అభినందించారు.



కేయూ ఉపకులపతి రాంజీ, బసవేశ్వరరావుకు వినతిపత్రం అందిస్తున్న ఏబీవీపీ నాయకులు

లయోలా కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

● ఏబీవీపీ వినతి

మచిలీపట్నం టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అటానమస్ హోదా ఉందని విద్యార్థులను మోసగిస్తున్న ఆంధ్ర లయోలా కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కేయూ ఉపకు లపతి రాంజీ, విశ్వవిద్యాలయం రెక్టార్ ఎం.వి.బసవేశ్వ రరావుకు బుధవారం అఖిల భారతీయ విద్యార్థి పరిష త్(ఏబీవీపీ) రాష్ట్ర కార్యదర్శి వెంకటగోపి వినతిపత్రం సమర్పించారు. లయోలా కళాశాలకు అటానమస్ హోదా పోయి మూడేళ్లు అవుతుందని, యాజమాన్యం హోదా ఉందని విద్యార్థులను మోసగిస్తోందని, దీనిపై ఎంక్వయిరీ కమిషన్ వేసి చర్యలు తీసుకోవాలని వెంకట గోపి కోరారు. ఏబీవీపీ రాష్ట్ర కన్వీనర్ మాదిరెడ్డి సుబ్రహ్మణ్యం, నాయకులు వరుణ్‌కోటి, పవన్‌కుమార్, ధనరాజ్, మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.

మీ కోసం

మీ సమీపంలోని స్థానిక సమస్యలను పరిష్కరించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా?
అయితే ఆ సమస్యను ఒక ఫొటో తీసి చిన్న క్యాప్షన్‌తో మాకు పంపండి. దానిని పరిష్కరించేలా ఆంధ్రజ్యోతి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తుంది.
మీరు పంపే సమస్య వ్యక్తిగతమైనది కాకూడదు.
పది మందికి, మీ ప్రాంత వాసులందరి సమస్య అయి ఉండాలి.
మీరు పంపాల్సిన వాట్సప్ నెంబరు
9985411602
సమయం : ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు పంపాలి

● గురునానక్ కాలనీలోని రామాలయం సమీపంలోని తిమ్మరుసు రోడ్డో మార్జిన్‌లో చాలా కాలం క్రితం పాత కరెంట్ స్తంభాలను పడవేశారు. అవి ప్రస్తుతం తుప్పపట్టి ప్రమాదకరంగా మారాయి. రాత్రి సమయంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది.

-ఈ.వి రామకృష్ణ(భారతీనగర్)

● వెంటనే సిబ్బందిని పంపించి తొలగిస్తాను

- టి.ఫణీంద్ర, ఏఈ, విద్యుత్ శాఖ

-భారతీనగర్, ఆంధ్రజ్యోతి



అన్నింట్లోనూ గణితశాస్త్రానిదే ప్రధాన పాత్ర

ప్రొఫెసర్ పి.వి.సుందరానంద్



ప్రొఫెసర్ పి.వి.సుందరానంద్‌ను సన్మానిస్తున్న రెక్టర్ పి.ఆర్.జాన్, ఫాదర్ సగాయరాజ్, ఫాదర్ కిరణ్

గుణదల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నేటి తరంలో ఏ రంగంలో రాణించాలన్నా గణితశాస్త్రానిదే ప్రథమ భూమిక అని రాయలసీమ విశ్వవిద్యాలయ గణితశాస్త్ర విభాగం ప్రొఫెసర్ పి.వి.సుందరానంద్ తెలిపారు. ఆంధ్రా లయోల కళాశాలలో గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సదస్సు బుధవారం ఉదయం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ పి.వి.సుందరానంద్ మాట్లాడుతూ గణిత శాస్త్రంలో ఉన్న పలు అంశాలను ఇతర రంగాల్లో ఎలా ఉపయోగించాలో వివరించారు. నిమ్స్ మెడికల్ కళాశాల ఆచార్యులు డాక్టర్ కృపాడానియేల్ వైద్య ఆరోగ్య సంరక్షణలోనూ గణితం పాత్ర కీలకమైనదన్నారు. ప్రొఫెసర్ పి.వి.సుందరానంద్‌ను కళాశాల రెక్టర్ పి.ఆర్. జాన్, కరస్పాండెంట్ సగాయరాజ్, వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ కిరణ్ కుమార్ సత్కరించారు. సదస్సు కో-ఆర్డినేటర్ డాక్టర్ వేణుగోపాలరావు, కన్వీనర్ కె.అనురాధ, కో-కన్వీనర్ డాక్టర్ తబిత, అధ్యాపకులు పి.చెంచుబాబు, హెప్సిబ్యూలా, డాక్టర్ నాగ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

బాలల సంఘం రాష్ట్ర కన్వీనర్‌గా

సాయికుమార్



భారతీనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బాలల సంఘం రాష్ట్ర కన్వీనర్‌గా ఎం. సాయికుమార్‌ను ఎన్నుకున్నట్లు ఏఐవైఎఫ్ నగర అధ్యక్ష కార్యద ర్శులు రంజిత్, జగదీష్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల తిరుపతిలో జరిగిన ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశంలో సాయికుమార్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

డప్పు కళాకారుల సమస్యలపై 18న నగరంలో మహాధర్నా

రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ ఆనంద్‌బాబు, కార్యదర్శి క్రాంతికుమార్

మొగల్రాజపురం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): డప్పు కళాకారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 18న నగరంలో మహాధర్నా జరగనుందని, ఈ ధర్నాలో పాల్గొనాలని డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ ఆనంద్‌బాబు, కార్యదర్శి క్రాంతికుమార్ పిలుపు ఇచ్చారు. బుధవారం సున్నపుబట్టీల సెంటర్‌లో ఉన్న కార్యాలయంలో వారు మాట్లాడుతూ వైసీపీ హయాంలో అందరికీ పెన్షన్ లు పెంచి డప్పు కళాకారులకు మాత్రం పెంచలేదని, కూటమి అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు దాటుతున్నా ఈ అంశంపై దృష్టి పెట్టలేదన్నారు. పాత పద్ధతిలోనే డీపీఆర్‌వో కార్యాలయాల ద్వారా కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ పథకాల ప్రచారంలో డప్పు కళాకారులను భాగస్వాములను చేయాలని కోరారు. ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని చెప్పారు. ఈ సమస్యలన్నీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం కోసం ధర్నా జయప్రదం చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు బి. కరుణాకర్, హనుమయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



బాల్ బ్యాడ్మింటన్‌లో విజేతగా నిలిచిన విజయవాడ సిద్ధార్థ మెడికల్ కళాశాల

బాల్ బ్యాడ్మింటన్ విజేత సిద్ధార్థ మెడికల్ కళాశాల

విజయవాడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో ఈ నెల 8నుంచి 11వరకు జరిగిన డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ 26వ ఇంటర్ కాలేజ్ గేమ్స్‌మీట్‌లో పలు క్రీడాంశాలలో పలు కళాశాలల జట్లు విజయాలు సాధించాయి. కబడ్డీలో విన్నర్‌గా రాజమండ్రి జీఎస్ఎల్ మెడికల్ కళాశాల, రన్నర్‌గా నెల్లూరు నారాయణ మెడికల్ కళాశాల నిలిచాయి.

వాలీబాల్‌లో విన్నర్‌గా విశాఖపట్నం ఆంధ్రా మెడికల్ కళాశాల, రన్నర్ గా గుంటూరు మెడికల్ కళాశాల, బాస్కెట్‌బాల్‌లో విన్నర్‌గా గుంటూరు ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల, రన్నర్ గా చినవుటుపల్లి పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల, బాల్ బ్యాడ్మింటన్‌లో విన్నర్ గా విజయవాడ సిద్ధార్థ మెడికల్ కళాశాల, రన్నర్‌గా విశాఖపట్నం ఆంధ్రా మెడికల్ కళాశాల, చెస్‌లో విన్నర్‌గా కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల, రన్నర్ గా అనంతపురం గవర్నమెంట్ కళాశాల నిలిచాయి.

దేవినేని వెంకటరమణ, ప్రణీత మెమోరియల్ క్రికెట్

బ్యాటర్ల హవా



మహీప్ 113 పరుగులు | వెంకటేష్ 92 పరుగులు

విజయవాడ(స్పోర్ట్స్), మార్చి 12 (ఆంధ్ర జ్యోతి): మూలపాడు గ్రౌండ్స్‌లో జరుగుతున్న దేవినేని వెంకటరమణ, ప్రణీత మెమోరియల్ బి లీగ్ మ్యాచ్ లలో బుధవారం రెండు మ్యాచ్‌లు జరిగాయి. కొండపల్లి, ఫ్రెండ్స్ సీసీ మధ్య జరిగిన మొదట మ్యాచ్‌లో ఫెండ్స్ జట్టు 38.3 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 210 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కొండపల్లి జట్టు 37.4 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 213 పరుగులతో విజయం సాధించింది. జట్టులో కె. మహీప్ 113 పరుగులు చేశాడు. రెండో మ్యాచ్ మంగళగిరిలో జరిగింది. వీవీకేఆర్ఎం, రాయల్ జట్లు మధ్య జరగగా వీవీకేఆర్ఎం 50 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 260 పరుగులు చేసింది. జట్టులో తరుణ్ 113 పరుగులు, బ్రహ్మతేజ 88 పరుగులు చేశారు.

అనంతరం బ్యాటింగ్ చేసిన రాయల్ జట్టు 49.1 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 261 పరుగులతో విజయం సాధించింది. జట్టులో వెంకటేష్ 92 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర వహించాడు.

చలివేంద్రాల్లో నీటి కొరత లేకుండా చూడండి

● కమిషనర్ ధ్యానచంద్ర

కార్పొరేషన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : చలివేంద్రాల్లో నీటి కొరత లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. ఇంజనీరింగ్ సిబ్బందితో బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలోని 77 చలివేంద్రాల్లో ఎటువంటి తాగునీటి కొరత ఉండకూడదన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సర్కిల్ పరిధిలో పర్యవేక్షిస్తూ ప్రస్తుత చలివేంద్రాలే కాకుండా, అవసరమైతే మరిన్ని ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చాలన్నారు. సర్కిల్-1 పరిధిలో 22, సర్కిల్-2లో 27, సర్కిల్-3లో 28 చలివేంద్రాలు ఏర్పాటు చేయగా, చలివేంద్రాల నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని, అసిస్టెంట్ ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పర్యవేక్షిస్తూ ఇబ్బందులు లేకుండా చూడాలని ధ్యానచంద్ర ఆదేశించారు.

పట్టించుకునే వారేరీ?

ఫెన్సింగ్ ధ్వంసం...ఎండిపోతున్న మొక్కలు

(భారతీనగర్, ఆంధ్రజ్యోతి): కాలనీ పెద్దలు, కార్పొరేషన్ సహకారంతో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా నాల్గవ డివిజన్ పరిధిలోని ఎల్ఐసీ కాలనీ మెయిన్, అంతర్గత రోడ్లలో మొక్కలను నాటారు. వీటిని పట్టించుకునే నాథుడు లేకపోవడంతో ప్రస్తుతం ఎండిపోతున్నాయి. ఈ మొక్కలు జంతువుల బారిన పడకుండా వాటికి రక్షణగా ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌లు పలు చోట్ల ధ్వంసమయ్యాయి. దీంతో మొక్కలు నాశనం అయిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.




ఎల్ఐసీ కాలనీ 1వ క్రాస్ రోడ్డులో వాడిపోతున్న మొక్కలు, ధ్వంసమైన ఫెన్సింగ్

కోడూరులో కవల దూడల జననం



కోడూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఆవు కవల దూడలకు జన్మనిచ్చిన ఘటన కోడూరు గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన జనసేన నాయకుడు ఉల్లి శేషగిరిరావు ఆవు మంగళవారం రాత్రి ఒక లేగ దూడ, పెయ్యి దూడకు జన్మనిచ్చింది. ఒక దూడ ఎరుపు రంగులో మరొక దూడ తెలుపు రంగులో అందర్నీ ఆకర్షిస్తున్నాయి. దూడలు ఆరోగ్యంగా ఉన్నట్లు శేషగిరిరావు తెలిపారు.

సీడ్ యాక్సెస్ రోడ్డును అందంగా తీర్చిదిద్దాలి

» ఏడీసీ చైర్‌పర్సన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డి.లక్ష్మీపార్థసారథి



పచ్చదనం పనులను పరిశీలిస్తున్న లక్ష్మీపార్థసారథి

ఎన్టీఆర్ కలెక్టరేట్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతి నగరానికి ప్రధాన రహదారి అయిన సీడ్ యాక్సెస్ రోడ్డును పచ్చదనంతో అందంగా తీర్చిదిద్దాలని అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) చైర్‌పర్సన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డి.లక్ష్మీపార్థసారథి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె సీడ్ యాక్సెస్ రోడ్డుపై జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. రహదారిపై ఏర్పాటు చేసిన మొక్కల మధ్య ఖాళీలు వస్తే సూర్యరశ్మిని తట్టుకొనే శక్తివంతమైన పూల మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. వేసవి ఎండలు, వడగాలుల నుంచి మొక్కలను సంరక్షించాలని సూచించారు. డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థను ఏర్పాటు చేసి మొక్కలకు సమృద్ధిగా నీరందించాలని జైన్ ఇరిగేషన్ ప్రతినిధి జితేంద్రకు ఆదేశాలు ఇచ్చారు. అనంతరం ఎన్-9 రోడ్డుపై బఫర్‌జోన్ అభివృద్ధి పరిచేందుకు ప్రణాళికలు రచించాలని ఉద్యాన అధికారులకు సూచించారు. ఏడీసీ నిర్మాణం చేపడుతున్న రహదార్లపై ఎక్కడా నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఏడీసీ జనరల్ మేనేజర్ కె.శ్రీహరిరావు, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, ఉద్యాన విభాగాధిపతి వి.ఎస్.ధర్మజ పాల్గొన్నారు.

బాలుడి ప్రాణాలు తీసిన షెడ్డు

» ఆడుకుంటుండగా కూలిన స్లాబ్
» ఇద్దరు బాలురకు తీవ్ర గాయాలు
» యనమలకుదురు లాకుల వద్ద ఘటన



మేడిశెట్టి తరుణ్(ఫైల్)



కూలిపోయిన మోటారు షెడ్డు

ఆటోనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): శిథిలావస్థలో ఉన్న మోటార్ షెడ్డు కూలి ఓ బాలుడు మృతి చెందగా, ఇద్దరు బాలురలకు తీవ్ర గాయాలైన ఘటన పటమట పోలీస్ స్టేషన్ పరిధిలోని యనమల కుదురు లాకుల వద్ద బుధ వారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. యనమల కుదురుకు చెందిన అన్నదమ్ములైన మేడిశెట్టి షణ్ముఖ్, మేడిశెట్టి తరుణ్(11), పటమట కొత్త వంతెన సెంటర్‌కు చెందిన సూరగాని హరీష్ కుమార్ పటమటలోని గోవిందరాజుల పాఠశాలలో చదువుతున్నారు. బుధవారం పాఠశాలకు వెళ్లకుండా యనమలకుదురు లాకుల సమీపంలోని ఖాళీ స్థలంలోకి ఆడుకోవడానికి వెళ్లారు. కొన్నేళ్ల కింద బావి వద్ద మోటార్ కోసం చిన్న గది ఏర్పాటు చేశారు. ముగ్గురు బాలురులు ఆడుకుంటూ ఆ షెడ్డు పైకి ఎక్కారు. ఒక్కసారిగా ఆ షెడ్డు స్లాబ్ కూలి పోయింది. ఈ ప్రమాదంలో తరుణ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. షణ్ముఖ్ ఎడమ మోకాలు, తలకు.. హరీష్‌కు ఎడమ కాలు తొడ భాగంలో విరిగింది. బాలురు అరుపులు విని స్థానికులు అక్కడకు చేరుకుని వారిని 108 సిబ్బంది సహాయంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి తరుణ్ మృతి చెందినట్లు నిర్ధారించారు. మిగిలిన ఇద్దరు బాలుర ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణవర్మ తెలిపారు. కాగా, పాఠశాలకు వెళ్లి ఉంటే ప్రమాదం తప్పేదని తల్లిదండ్రులు మేడిశెట్టి దుర్గాప్రసాద్, దివ్యలు గుండలవిసేలా రోధించారు. మేడిశెట్టి షణ్ముఖ్, చిన్న తరుణ్(11) పటమటలోని గోవిందరాజుల పాఠశాలలో 7, 6వ తరగతి చదువుతున్నారు. దుర్గాప్రసాద్ ఆటోనగర్‌లో లిఫ్ట్ మెకానిక్‌గా, దివ్య హోటల్‌లో పనిచేస్తున్నారు.

వంశీ బెయిల్‌పై విచారణ నేటికి వాయిదా

విజయవాడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ముదునూరి సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో విజయవాడ జిల్లా జైలులో ఉన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ బెయిల్ పిటిషన్‌పై విచారణను న్యాయస్థానం గురువారానికి వాయిదా వేసింది. తనకు బెయిల్ ఇవ్వాలని వంశీ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై బుధవారం వాదనలు జరిగాయి. తిరిగి ఈ వాదనలను గురువారానికి వాయిదా వేసింది. ఈ కేసులో బాధితుడు సత్యవర్ధన్ తరఫున కౌంటర్ దాఖలు చేయాల్సి ఉంది. దీనికి ఆయన తరఫున న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ ఈ నెల 17 వరకు గడువు కోరడంతో దానికి న్యాయాధికారి హిమబిందు అంగీకరించారు.

టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో బెయిల్ దాఖలు

గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులో బెయిల్ మంజూరు చేయాలని మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ సీఐడీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో వంశీ 72వ నిందితుడిగా ఉన్నాడు. ముందస్తు బెయిల్ కోసం వంశీ హైకోర్టును ఆశ్రయించగా పిటిషన్‌ను కొట్టేసింది. ఈ కేసులో ఆయనను పీటీ వారెంట్‌పై కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించింది. ఇప్పటికే సత్యవర్ధన్ కేసులో బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేయగా, తాజాగా టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులో బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశారు.

ఇతర శాఖల విధులు అప్పగించవద్దన్న సీఎం ఆదేశాలపై రెవెన్యూ సంఘం హర్షం

విజయవాడ (గాంధీనగర్), మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ అధికారులకు రెవెన్యూకు సంబంధం లేని ఇతర శాఖల విధులు అప్పగించవద్దని జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశాలివ్వడంపై ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీహెచ్.రవీంద్రరాజు హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, రెవెన్యూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు బుధవారం ఒక ప్రకటనలో ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇతర శాఖ పనులు, సర్వేలతో రెవెన్యూశాఖకు సంబంధించిన రెవెన్యూ సేవల్లో జాప్యం జరుగుతుందని సంబంధిత మంత్రి దృష్టికి ఇటీవల తీసుకువెళ్లడం జరిగిందని పేర్కొన్నారు. తక్షణమే అన్ని జిల్లాల కలెక్టర్లు క్షేత్రస్థాయిలో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయితీ సెక్రటరీలు సీఎం ఆదేశాల అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కిలోల లెక్క బాదుడు



కొండెక్కిన పుచ్చకాయల ధరలు

- కిలో రూ.30 చొప్పున విక్రయాలు
- ఐదు చిన్న ముక్కల కప్పు రూ.20
- కాయ సైజును బట్టి రూ.50 నుంచి 300 వరకు అమ్మకాలు
- తమిళనాడు రాష్ట్రం దిండివనం, రాష్ట్రంలోని నెల్లూరు, గూడూరు, కోట, కృష్ణపట్నం నుంచి దిగుమతి

వేసవి రాకముందే పుచ్చకాయల వ్యాపారం జోరందుకుంది. రెండు నెలల ముందు నుంచే మార్కెట్‌లోకి పుచ్చకాయలు వస్తున్నాయి. ఎండలు ముదరటంతో జనం పుచ్చకాయల కొనుగోలుపై ఆసక్తి చూపుతున్నారు. ఇదే అదనుగా వ్యాపారులు ధరలు పెంచేశారు. కిలో రూ.30 అని బోర్డులు తగిలించారు. ఐదు కిలోల కాయ కొనాలంటే రూ.150 చెల్లించాల్సి వస్తోంది. ప్రస్తుతం పుచ్చకాయల ధరలు చూసి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

ఆంధ్రజ్యోతి-విద్యాధరపురం: మార్కెట్‌లో ప్రస్తుతం పుచ్చకాయలు ధరలు బెంబేలెత్తిస్తున్నాయి. ఇది వరకు వలే కాయ మొత్తం ఖరీదు కాకుండా కిలోల లెక్కన అమ్మటంతో కొనలేని పరిస్థితి నెలకొంది. సహజంగా నీటి కంటెంట్ ఎక్కువగా ఉండే పుచ్చకాయ బరువులో కూడా అధికంగానే ఉంటుంది. సుమారుగా ఎంత చిన్న కాయను తీసుకున్నా కిలోన్నర నుంచి రెండు కిలోల వరకు తూకం తూగుతుంది. దీంతో ఒక చిన్న పుచ్చకాయను రూ.60 నుంచి ఇంకా ఆపైన ధర పెట్టి కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. సుమారు 5 కిలోల బరువు ఉన్న కాయను రూ.150 కొనాలంటే చాలా మంది వెనకకు తగ్గుతున్నారు. గతంలో ఐదు కిలోల కాయను సుమారుగా రూ.60 నుంచి రూ.100 లోపు అమ్మేవారు. ఇప్పుడు కిలోల లెక్కన ఖరీదు కట్టి బాదుతున్నారు. ఏదైనా అడిగితే అన్నీ పెరిగాయ్ అంటూ ఒక మాట చెప్పేస్తున్నారు.

పుచ్చకాయలో పోషక విలువలు

పుచ్చకాయ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. కేలరీలు, ఫ్యాట్, కొలెస్ట్రాల్, సోడియం, కార్బోహైడ్రేట్స్, ఫైబర్, విటమిన్ సి, పొటాషియం, క్యాల్షియం, విటమిన్ ఎ తదితరాలు సమపాళ్లలో పుచ్చకాయలో ఉంటాయి. చాలా ప్రాంతాల్లో పుచ్చకాయకు గిరాకీ ఉంది. అన్ని రకాలుగా దేహానికి ఆరోగ్యం ఇవ్వటంతో దీని ప్రాధాన్యం పెరిగింది. బెజవాడకు పుచ్చకాయలు తమిళనాడు రాష్ట్రం దిండివనం నుంచి కొనుగోలు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో నెల్లూరు, చప్పిడి, గూడూరు, కోట, కృష్ణపట్నం, కావలి, తెలంగాణ రాష్ట్రం భద్రాచలం నుంచి కూడా దిగుమతి అవుతున్నాయి. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో జోరుగా విక్రయాలు సాగుతున్నాయి.

టన్ను రూ.10 వేల నుంచి 18 వేల వరకు పడుతోంది



పుచ్చకాయ పంట తమిళనాడు రాష్ట్రం దిండివనంలో అధికంగా సాగవుతుంది. అక్కడి నుంచి కొనుగోలు చేస్తున్నాం. ప్రస్తుతం టన్ను ధర రూ.10 వేల నుంచి రూ.18 వేల వరకు ధర పలుకుతోంది. గతంలో కంటే ప్రస్తుతం ధరలు పెరిగాయి. పుచ్చకాయ సైజును బట్టి రూ.50 నుంచి రూ.300 వరకు విక్రయిస్తున్నాం. కేజీ పుచ్చకాయ ధర రూ.30 ఉంది.
- కుమారస్వామి, పుచ్చకాయల వ్యాపారి

వైసీపీ నాయకులు రోడ్డెక్కితే బయటపడేది వారి అరాచకాలే

» స్టేటస్‌కో ఇచ్చిన వైసీపీ కార్యాలయంలో ఎలా కార్యక్రమాలు నిర్వహిస్తారు
» విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకువస్తున్న మంత్రి లోకేశ్
» జగన్‌రెడ్డి ఫీజుల బకాయిలు రూ.760 కోట్లు కూటమి ప్రభుత్వం చెల్లించింది
» పేర్ని నాని ఇష్టారాజ్యంగా మాట్లాడటం హాస్యాస్పదం
» మంత్రి కొల్లు రవీంద్ర



మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు రోడ్డెక్కితే బయటపడేది వారి అరాచకాలేనని, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై మాజీ మంత్రి పేర్ని నాని మాట్లాడటం హాస్యాస్పదమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. మచిలీపట్నం టీడీపీ అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కొట్టేసిన పేర్ని నాని ఒక్కసారి జీవో 340 చదువుకోవాలన్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టినందున కోర్టులో కేసులు నడుస్తున్నాయని, స్టేటస్‌కో ఉన్న సమయంలో వైసీపీ కార్యాలయంలో కార్యక్రమాలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. పార్టీ కార్యాలయం పేరుతో రూ.50 కోట్ల విలువైన భూమిని కొట్టేయడం దుర్మార్గమన్నారు. 340 జీవో ప్రకారం ఏడాది కాలంలో నిర్మాణం చేపట్టాలని, అయితే వైసీపీ కార్యాలయం ఏడాదిలో నిర్మాణం చేపట్టలేదన్నారు. ఐదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు దొంగ జీవోలు, దొంగ ఆదేశాలతో రాష్ట్రాన్ని లూటీ చేశారన్నారు. రూ.40 కోట్లతో బందరుకు వన్నె తెచ్చిన పట్టాభి సీతారామయ్య మెమోరియల్ భవనం నిర్మించేందుకు పేర్ని నాని అడ్డుపడ్డారని, మునిసిపల్ కౌన్సిల్ తీర్మానం చేయనివ్వలేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై రూ.750 కోట్ల బకాయిలు చెల్లించామన్నారు. విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నారన్నారు. మెరుగైన విద్యను అందించేలా విశ్వవిద్యాలయాల్లో గణనీయమైన మార్పులు చేపడుతున్నారన్నారు. ఫీజులు నేరుగా కళాశాలలకు ఇవ్వడం వల్ల సర్టిఫికెట్లను కళాశాలలు ఆపలేవన్నారు. రోడ్డెక్కి మాట్లాడితే వైసీపీ నాయకుల పరువేపోతుందన్నారు. ఏ కాలేజీకి కూడా బకాయిలు లేకుండా చర్యలు తీసుకుంటామని, విద్యార్థులకు అన్యాయం చేయబోమన్నారు.

అసెంబ్లీకి వస్తే జగన్‌రెడ్డి బండారం బయటపడుతుందనే..

అసెంబ్లీకి వచ్చి జగన్‌రెడ్డి మాట్లాడితే బండారం మొత్తం బయట పడుతుందనే భయంతో అసెంబ్లీకి రాకుండా వీధుల్లో డ్రామాలాడుతున్నారన్నారు. అధికారులను పేర్ని నాని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. డ్రెయిన్లు, ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలు తొలగించడం వల్ల నగర ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. బడ్డీలను నిలువరించే విద్యావంతులకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. వైసీపీ నాయకులు బడ్డీలు పెట్టి అద్దెలకు ఇచ్చుకున్నారన్నారు. మచిలీపట్నం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. మూడు నెలలు అడ్రస్ లేకుండా బియ్యం దొంగ పేర్ని నాని పారిపోయారని, బెయిల్ రావడంతో మళ్లీ రోడ్డు మీద కనబడుతున్నారన్నారు. పేర్ని నానిపై సిట్‌ను నియమించామన్నారు. బెయిల్ వచ్చినంత మాత్రాన పేర్ని నాని చట్టం నుంచి తప్పించుకోలేరన్నారు.

పేదల గృహ నిర్మాణానికి అదనపు సాయం

» ఆర్డీవో చైతన్య

బెంజిసర్కిల్, మార్చి12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన విధానం ద్వారా నిరుపేదల గృహ నిర్మాణానికి అదనపు సాయం అందనుందని ఆర్డీవో చైతన్య చెప్పారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పెరిగిన ఖర్చులతో ఇబ్బందిపడుతున్న లబ్ధిదారులకు ప్రభుత్వం సాయం అందజేస్తుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకొని గృహ నిర్మాణలను పూర్తి చేసుకోవాలని కోరారు. ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులకు కూడా అవగాహన కల్పించేందుకు ఈ నెల 15 నుంచి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో విస్తృత అవగాహన సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ. 50వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ. 75వేలు, పీవీటీజీ(పర్వత ప్రాంత షెడ్యూల్ తెగలు)లకు రూ.లక్ష అదనపు సహాయం అందుతుందని వివరించారు.

నోరి దత్తాత్రేయుడిని కలిసిన ఐఎంఏ నేతలు



మచిలీపట్నం టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు నోరి దత్తాత్రేయుడు బుధవారం మచిలీపట్నంలోని అక్క ఇందిర, బావ ఎల్.ఎస్. శాస్త్రి ఇంటికి వచ్చారు. ఆయన్ను ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బి.శ్రీనివాసాచార్య, బందరు ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ కె.వి.శివప్రసాద్, సాయి ప్రసాద్ కలిశారు. రాజధాని అమరావతిలో నిర్మించనున్న క్యాన్సర్ ఆస్పత్రి గురించి చర్చించుకున్నారు. నోరి దత్తాత్రేయుడు మాట్లాడుతూ ఇక తరచూ అమెరికా నుంచి విజయవాడ, మచిలీపట్నం వస్తానన్నారు. తాను రచించిన మంటాడ టూ మన్‌హటన్‌ను ప్రతి ఒక్కరూ చదవాలని వివరించారు.

వాగు పోరంబోకు స్థలం కబ్జాకు యత్నం

» పాతపాడులో ఇరువర్గాల ఘర్షణ.. పోలీసులకు ఫిర్యాదు
» స్థల వివాదంలో తలదూర్చిన సస్పెక్ట్ షీటర్
» ఆ స్థలం పంచాయతీదే అంటున్న ఈవో



కబ్జాకు గురవుతున్న వాగు పోరంబోకు స్థలం

విజయవాడ రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రూరల్ మండలం పాతపాడు గ్రామంలో వాగు పోరంబోకు స్థలం కబ్జాకు గ్రామానికి చెందిన కొందరు ప్రయత్నించారు. పంచాయతీ స్థలంలో మట్టితో చదును చేసి ఆక్రమించేందుకు పూనుకున్నారు. అయితే సదరు స్థలంలో తాము ఎప్పటి నుంచో సాగు చేసుకుంటున్నామని, ఆ స్థలం తమదే అంటూ మరో వర్గం అక్కడికి చేరుకోవడంతో మంగళవారం రాత్రి ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. అనంతరం ఇరువర్గాలు నున్న రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే... పాతపాడు గ్రామం శివారుల్లోని మంచినీటి చెరువు పక్కన పంచాయతీకి చెందిన 15 సెంట్ల వాగు పోరంబోకు భూమి ఉంది. అందులో ఇప్పటికే ఎనిమిది సెంట్ల వరకు ఆక్రమణలు జరిగి నిర్మాణాలు కూడా చేపట్టేశారు. అయితే మిగిలిన ఏడు సెంట్ల ప్రభుత్వ స్థలంపై కన్నేసిన గ్రామానికి చెందిన కొందరు సదరు స్థలంలో మట్టి కొట్టించి చదును చేసి ప్లాట్లుగా విభజించేందుకు ప్రయత్నించారు. అయితే అదే ప్రాంతానికి చెందిన మరో వర్గం అక్కడికి చేరుకుని ఆ స్థలంలో తాము 15 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నామని, స్థలం తమదే అని చెప్పడంతో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. అనంతరం రెండు వర్గాలకు చెందిన వారు ఘర్షణ పడి నున్న రూరల్ పోలీసులకు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు.

ఒక వర్గానికి కొమ్ముకాసిన సస్పెక్ట్ షీటర్

అయితే కబ్జా వ్యవహారంలో ఓ సస్పెక్ట్ షీటర్ తలదూర్చాడు. కబ్జాకు ప్రయత్నించిన ఓ వర్గానికి చెందిన వారికి మద్దతుగా నున్న పోలీస్ స్టేషన్‌లో సస్పెక్ట్ షీటర్‌గా ఉన్న పేటేటి కిషోర్ వాగు పోరంబోకు స్థలంలోకి వచ్చి మరో వర్గంతో ఘర్షణపడినట్లు సమాచారం. అక్కడి వారిని బెదిరింపులకు గురి చేసినట్లు తెలుస్తోంది.

అది పంచాయతీ స్థలమే : ఈవో

స్థలం వివాదంపై పంచాయతీ ఈవో కోటి లింగమ్మను వివరణ కోరగా సదరు స్థలం వాగు పోరంబోకు స్థలమే అని ఆమె నిర్ధారించారు. ఇరువర్గాలకు ఏ విధమైన హక్కు లేదని తెలిపారు. ఈ విషయం తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని వివరించారు.

స్ట్రీట్ వెండర్ల వార్

- రణరంగమైన బీసెంట్ రోడ్డు
- హాకర్ల ముసుగులో కబ్జాదారులు
- కబ్జాదారులకు అండగా పార్టీల నాయకులు
- పోలీసుల జోక్యంతో సర్దుమణిగిన వివాదం



బీసెంట్ రోడ్డులో కొట్టుకుంటున్న ఇరువర్గాలు

గవర్నర్‌పేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బీసెంట్ రోడ్డులో బుధవారం హాకర్ల మధ్య వివాదం చెలరేగింది. మొన్నటి ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేసిన కార్యకర్తలు బీసెంట్ రోడ్డులో కొత్తగా తోపుడు బళ్లు పెట్టుకునేందుకు ప్రయత్నించగా పాత వారు అడ్డుకోవడంతో ఘర్షణలు జరిగాయి. దశాబ్దాల తరబడి బీసెంట్ రోడ్డుపై పెత్తనం చెలాయిస్తున్న వామపక్ష పార్టీలు, మాజీ శాసన సభ్యుని అనుచరులు రంగప్రవేశం చేసి కొత్తగా బళ్లు పెట్టుకునేందుకు ప్రయత్నించిన అధికార పార్టీ అనుచరుల ప్రయత్నాలు అడ్డుకోగా ఇరు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. ఒకరిపై ఒకరు చేయి చేసుకున్నారు. నిత్యం రద్దీగా ఉండే బీసెంట్ రోడ్డు రణ రంగాన్ని తలపించింది. చివరకు పోలీసుల జోక్యంతో వివాదానికి తాత్కాలికంగా తెరపడింది.

దశాబ్దాలుగా వారిదే హవా!

దశాబ్దాలుగా వామపక్షాల హాకర్లు, కాంగ్రెస్ పార్టీ, వైసీపీ అనుచర గణం ఆక్రమణలతో బీసెంట్ రోడ్డు నడవడానికి కూడా వీలు లేకుండా పోయింది. దీనికి తోడు బుధవారం అధికార పక్షానికి చెందిన ప్రజాప్రతినిధి అనుచరులు ఖాళీ జాగాల్లో పాగా వేసేందుకు ప్రయత్నించారు. వామపక్ష పార్టీలకు చెందిన యూనియన్ నేతలు ఇప్పటికే రోడ్డు ఇరుకుగా మారిపోయింది, ఇంకెక్కడ పెడతారు అంటూ అధికార పార్టీకి చెందిన కార్యకర్తలతో గొడవకు దిగారు. ఇరువర్గాలకు అండగా వామపక్ష పార్టీల నేతలు, అధికార పార్టీకి చెందిన స్థానిక నేతలు రంగ ప్రవేశం చేశారు. ఇరువర్గాల మధ్య వివాదం తారాస్థాయికి చేరింది. ఒకరినొకరు తోసుకోవడం, ఒకరిపై ఒకరు చేయిచేసుకోవడం జరిగింది. అరుపులు, కేకలతో కొన్ని గంటల పాటు బీసెంట్ రోడ్డు రణరంగంగా మారింది. కొత్తగా ఏర్పాటు చేసుకున్న తోపుడు బళ్లను స్థానికంగా బీసెంట్ రోడ్డులో పెత్తనం చెలాయిస్తున్న వ్యక్తులు ధ్వంసం చేశారు. ఘర్షణల్లో అధికార పార్టీకి చెందిన ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అధికార పార్టీ కార్యకర్తలు బళ్లు పెట్టుకునే పరిస్థితి లేకుండా పోయింది. గొడవ జరుగుతున్న సమాచారంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. ఇరు వర్గాలను చెదరగొట్టడంతో పాటు ఇలాంటివి పునరావృతమైతే కేసులు పెట్టాల్సి వస్తుందని హెచ్చరించి అక్కడ నుంచి అందర్నీ పంపించి వేశారు.

చిరువ్యాపారులపై కక్ష కట్టారు : సీపీఎం

కొంత మంది అధికార పార్టీ నాయకులు చిరు వ్యాపారులపై కక్ష కట్టి వేధింపులకు గురిచేస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సిహెచ్ బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్ ఆరోపించారు. బీసెంట్ రోడ్డులో అధికార పార్టీ నేతలు చిరువ్యాపారులపై చేస్తున్న వేధింపులను తీవ్రంగా ఖండించారు. పాత వారిని తొలగించి ఆ ప్రాంతాల్లో కొత్తవారిని చేర్చేందుకు అధికార పార్టీ నేతలు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పాత వ్యాపారులకు అడ్డంగా కొత్త వారికి స్థలాలు కేటాయించడం సరి కాదని, దీన్ని తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. దీనిపై మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేయడంతో పాటు ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగ్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాజధాని అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ)లో ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వం పోస్టింగ్‌లు ఇచ్చింది. సీఆర్‌డీఏ డిప్యూటీ కలెక్టర్ - 4 గా ఎన్ఎస్‌వీబీ వసంతరాయుడు, గ్రీవెన్స్ రిడ్రసల్ మేనేజ్‌మెంట్ నోడల్ ఆఫీసర్‌గా పీ జయశ్రీని నియమించింది.

జీవిత సమతుల్యత ముఖ్యం

- ఎన్టీఆర్‌జిల్లా పోలీస్ కమిషనరేట్ అడ్మిన్ డీసీపీ సరిత

విజయవాడ, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : ఆధునిక యుగంలో మహిళలు అన్ని రంగాల్లోను రాణిస్తున్నందున జీవిత సమతుల్యతపై దృష్టిపెట్టాలని ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ అడ్మిన్ డీసీపీ సరిత అన్నారు. కృష్ణాజిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సమితి ఆధ్వర్యంలో విజయవాడ ఎంబీవీకేలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బ్యాంకుల్లో పనిచేసే మహిళలు ఒత్తిడికి గురికాకుండా దాన్ని జయించాలని చెప్పారు. పిల్లలను బాధ్యతయుతమైన పౌరులుగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. అనంతరం వివిధ క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఓల్గా దేవి, జి.సుధ, పూర్ణశోభ, ఏఐబీఈఏ కార్యదర్శి బీఎస్ రాంబాబు, గుంటూరు జీజీహెచ్ వైద్యురాలు డాక్టర్ చంద్రరాధికారాణి తదితరలు పాల్గొన్నారు.

ప్రతి హాస్టల్‌కు సీసీ కెమెరాలు తప్పనిసరి

కమిషనరేట్ పరిధిలోని ప్రతి మహిళా హాస్టల్‌లో భద్రతా చర్యలు ఉండాలని డీసీపీ సరిత స్పష్టం చేశారు. అమ్మాయిలు, మహిళల భద్రత కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హాస్టళ్ల నిర్వాహకులతో విజయవాడలోని కమిషనర్ కార్యాలయంలో ఆమె బుధవారం సమావేశం నిర్వహించారు. పని చేయని కెమెరాలను వెంటనే బాగు చేయించాలని చెప్పారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం • 13 మార్చి 2025

రంగుల పండుగ హోలీని చిన్నా, పెద్దా అందరూ ఇష్టంగా జరుపుకుంటూ ఉంటారు. రంగులను ఇంట్లోనే తయారు చేసుకుని వాటితో హోలీ ఆడుకుంటే ఆనందం రెట్టింపు అవుతుంది. శిరోజాలు, చర్మం ఆరోగ్యంగా మెరుస్తాయి కూడా! రసాయనాలు లేని హోలీ రంగులను ఎలా తయారు చేసుకోవాలో తెలుసుకుందాం.

ఇంట్లోనే హోలీ రంగులు



గులాబీ రంగు

పండుగకు ముందు రోజు రాత్రి స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో బీట్‌రూట్‌ని చక్రాలుగా కోసి వేయాలి. అవి మునిగేవరకూ నీళ్లు పోసి మరిగించాలి. స్టవ్ మీద నుంచి దించి రాత్రంతా అలాగే ఉంచాలి. ఉదయాన్నే ఈ నీళ్లను వడబోసి అవసరమైతే మరికొన్ని నీళ్లు కలుపుకుని వాడుకోవచ్చు. ముదురు గులాబీ రంగులో ఉండే ఈ నీళ్లతో హోలీ ఆడుకోవచ్చు.

పసుపు రంగు

గిన్నెలో రెండు చెంచాల పసుపు, చెంచా శనగపిండి వేసి బాగా కలిపి జల్లెడ పట్టాలి. ఇందులో నీళ్ల చుక్కలు చిలకరిస్తూ పేస్టులా చేయాలి. ఈ మిశ్రమాన్ని ఒక బకెట్ నీళ్లలో వేసి బాగా కలపాలి. పసుపు రంగు సిద్ధం అవుతుంది. పసుపు రంగు బంతి పూల రెక్కలను నీళ్లలో వేసి ఉడికించి తరవాత వడబోసి అందులో చిటికెడు పసుపు కలిపినా కూడా పసుపు రంగు తయారవుతుంది.

ఎరుపు రంగు

హోలీకి ముందు రోజు రాత్రి స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో నీళ్లు, దానిమ్మ తొక్కలు వేసి బాగా మరిగించాలి. ఉదయాన్నే ఈ నీళ్ల వడబోసి మరికొన్ని నీళ్లు కలిపితే ఎరుపు రంగు తయారవుతుంది. బకెట్ నీళ్లలో రెండు చెంచాల ఎర్రని కుంకుమ, చిటికెడు కార్న్‌ఫ్లోర్ వేసి కలిపినా కూడా క్షణాల్లో ఎరుపు రంగు తయారవుతుంది. కొన్ని ఎర్ర మందారం పూలను మిక్సీ గిన్నెలో వేసి అరచెంచా బియ్యం పిండి, తగినన్ని నీళ్లు పోసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని బకెట్ నీళ్లలో వేసి బాగా కలిపి వడబోస్తే ఎరుపు రంగు సిద్ధం.

లేత ఆకుపచ్చ రంగు

కొన్ని ఉసిరి కాయలను మిక్సీ గిన్నెలో వేసి నీళ్లు పోసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ నీటిని వడబోసి అందులో చిటికెడ్ కార్న్‌ఫ్లోర్ వేసి ఉండలు రాకుండా కలపాలి. ఈ మిశ్రమం చిక్కగా అనిపిస్తే మరికొన్ని నీళ్లు కలపవచ్చు. లేత ఆకుపచ్చ రంగు వస్తుంది.

వంకాయ రంగు

వంకాయ రంగులో ఉండే క్యాబేజీని చిన్న ముక్కలుగా కోసి మిక్సీ గిన్నెలో వేయాలి. ఇందులోనే కొన్ని క్యారెట్ ముక్కలు వేయాలి. తగినన్ని నీళ్లు పోసి మెత్తగా గ్రైండ్ చేయాలి.. ఈ మిశ్రమాన్ని వడబోసి మరికొన్ని నీళ్లు, చిటికెడ్ కార్న్‌ఫ్లోర్ వేసి బాగా కలపాలి. చక్కని పర్పుల్ కలర్ తయారవుతుంది.

ముదురు గోధుమ రంగు

స్టవ్ మీద గిన్నె పెట్టి ఒక గ్లాసు నీళ్లు, నాలుగు చెంచాల టీ పొడి లేదా రెండు చెంచాల కాఫీ పొడి వేసి బాగా మరిగించాలి. ఈ డికాషన్‌ని వడబోసి అర బకెట్ నీళ్లలో కలిపితే ముదురు గోధుమ రంగు తయారవుతుంది. కొద్దిగా రోజ్‌వాటర్ కలిపితే సువాసన వెదజల్లుతుంది.

ఆకుపచ్చ రంగు

ఒక గిన్నెలో మూడు చెంచాల గోరింటాకు పొడి, ఒక చెంచా బియ్యప్పిండి వేసి బాగా కలపాలి. ఇందులో కొన్ని నీళ్లు పోసి పేస్టులా చేసి ఈ మిశ్రమాన్ని బకెట్ నీళ్లలో వేసి బాగా కలపాలి. చక్కని ఆకుపచ్చ రంగు తయారవుతుంది.

కాషాయం రంగు

ఒక బకెట్ నీళ్లలో నాలుగు చెంచాల తిరుచూర్ణం, చిటికెడ్ కార్న్‌ఫ్లోర్ వేసి బాగా కలిపితే కాషాయం రంగు సిద్ధం అవుతుంది.

కౌన్సెలింగ్

క్షయ వల్ల పిల్లలు పుట్టరా?

డాక్టర్! మాకు పెళ్లై ఐదేళ్లు. గత మూడేళ్లుగా క్షయ వ్యాధితో బాధపడుతున్నాను. ఈ వ్యాధి సోకిన వాళ్లకు పిల్లలు కలగరని విన్నాను. ఇది ఎంత వరకూ నిజం?

ఓ సోదరి, హైదరాబాద్.

క్షయవ్యాధితో దెబ్బ తినేది ఊపిరితిత్తులే కావచ్చు. కానీ, సత్వరమే చికిత్స తీసుకోకపోతే, ఆ బ్యాక్టీరియా రక్తం ద్వారా శరీరమంతా వ్యాపించి, మూత్రపిండాలు, గర్భసంచి, మెదడు కూడ దెబ్బ తినవచ్చు. వ్యాధి కారణంగా స్త్రీ, పురుషులు ఇద్దర్లోనూ సంతాన శక్తి తగ్గిపోవచ్చు. స్త్రీలల్లో క్షయ వ్యాధి గర్భసంచికి సోకినప్పుడు పిండం సరిగా ఏర్పడదు. మగవారిలో వీర్యకణం అండంలోకి ప్రవేశించేంత శక్తివంతంగా ఉండదు. ఈ వ్యాధి లక్షణాలు అంత త్వరగా బయటపడకపోయినా దాని ప్రభావం మాత్రం సంతానోత్పత్తి పైన పడుతుంది.

- ఎంతో నిదానంగా వ్యాపించే ఈ వ్యాధితో స్త్రీలల్లో రుతుక్రమం తప్పడం, కలయిక సమయంలో నొప్పి కలగడం వంటి ఇబ్బందులు మొదలవుతాయి. మగవారిలో వీర్యకణాల కదలికలు తగ్గడం, హార్మోన్లు సరిగా విడుదల కాకపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. కొందరిలో మంట, దురద ఏర్పడి, అంగస్తంభనకు అంతరాయం ఏర్పడుతుంది.



- ఒకసారి క్షయ వ్యాధి సోకిన చాలా మంది స్త్రీలు ఇక తల్లిని కాగలనో లేదోనని ఆందోళనపడుతుంటారు. కానీ, లక్షణాలు బయల్పడిన వెంటనే వైద్యులను కలిసి, సరైన చికిత్స తీసుకుంటే గర్భధారణ సాధ్యపడుతుంది. ప్రసవంతో క్షయవ్యాధి బిడ్డకు సంక్రమిస్తుందేమోనని భయపడి, కొందరు తల్లులు బిడ్డకు పాలివ్వడం మానేస్తారు. నిజానికి, క్షయ అనేది తల్లిపాల వల్ల కాదు, తల్లి శ్వాస వ ల్ల వస్తుంది. అందువల్ల ముఖానికి మాస్క్ వేసుకుని, నిస్సంకోచంగా బిడ్డకు పాలివ్వవచ్చు.
- సాధారణంగా సరైన పోషకాహారం తీసుకోని వాళ్లు, వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోయి క్షయ వ్యాధికి గురవుతుంటారు. అందువల్ల చికిత్స సమయంలో మందులే సమస్తం అనుకోకుండా, మద్యం, మాంసం, తీపి పదార్థాలు మానేసి, ఐరన్, విటమిన్- డి అధికంగా ఉండే ఆహార పదార్థాలు విరివిగా తీసుకోవాలి. సరైన పోషకాలు శరీరానికి అందకపోతే, మందులేవీ పనిచేయక శరీరం మరికొన్ని ఇతర ఇన్‌ఫెక్షన్ల బారిన పడవచ్చు. దానివల్ల వ్యాధి నుంచి పూర్తిగా కోలుకోడానికి మరింత సమయం పట్టవచ్చు.

• డాక్టర్ స్వాతి మోతె,
గైనకాలజిస్ట్ అండ్ ఐ.వి.ఎఫ్ నిపుణురాలు,
హైదరాబాద్.



మన దేశంలోని ఇతర రాష్ట్రాల్లో నివసిస్తూ కూడా తెలుగుపై మమకారంతో భాషాసేవ చేసేవారందరో! అలాంటి వారిలో **డాక్టర్ తుర్లపాటి రాజేశ్వరి** ఒకరు. ఒడిశాలోని బరంపురంలో నివసిస్తున్న రాజేశ్వరి... జ్ఞానపీఠ పురస్కార గ్రహీత గోపీనాథ్ మహంతి ఒడియాలో రాసిన 'దాడి బుధా' అనే నవలను 'ఈతచెట్టు దేవుడు' పేరిట అనువదించారు. ఈ నవలకు తాజాగా కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం లభించింది. ఈ నేపథ్యంలో రాజేశ్వరిని 'నవ్య' పలకరించింది.

అధ్యయనం చేయకుండానే రాసేస్తున్నారు!

కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద అవార్డు లభించినందుకు అభినందనలు...

కృతజ్ఞతలు. ఈ అవార్డు వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. నేను 50 ఏళ్ల నుంచి రాస్తున్నాను. అనేక అవార్డులు కూడా వచ్చాయి. అయితే జాతీయ స్థాయిలో గుర్తింపు రావటం చిన్న విషయం కాదు. ఈ నా ప్రయాణంలో నా కుటుంబ సభ్యులు ఎంతో సహకరించారు.
ఈ అవార్డు రావటంలో పరోక్షంగా వారి సహకారం కూడా ఉంది.

మీరు కొన్ని స్వతంత్ర రచనలు చేశారు.. అనువాదాలూ చేశారు. ఈ రెండింటిలో ఏది కష్టం?

నా అనుభవంలో అనువాదమే కష్టమనిపిస్తుంది. ఎందుకంటే - కొన్ని ఆలోచనలు, భావోద్వేగాలు, అనుభవాల సమాహారమే స్వతంత్ర రచన. వీటికి అనుగుణంగానే మన రచన సాగుతుంది. కానీ అనువాదంలో ఇంకో రచయిత ఆలోచనలు, భావోద్వేగాలు, అనుభవాలను ఆవాహన చేసుకోవాలి. వాటిని మన భాషలోకి తీసుకురావాలి. మూల రచన భావం చెడకూడదు. ఒక్క మాటలో చెప్పాలంటే మూల రచనలో పూర్తిగా నిమగ్నమైపోవాలి. మూల రచయిత భావనలలోనే బతకాలి. చాలా సందర్భాలలో అనువాద రచన పూర్తయినా... ఆ పాత్రలు ఇంకా వెంటాడుతూ ఉంటాయి. ఇప్పుడు నాకు అవార్డు వచ్చిన 'ఈతచెట్టు దేవుడు'నే తీసుకుందాం. ఈ నవలలోని పాత్రలు చాలా లోతుగా ఉంటాయి. దీని రచన పూర్తయిన కాలం ఆ పాత్రలు నన్ను వెంటాడుతూనే ఉన్నాయి. అందుకే మూల రచన ఒడియా పాఠకులకు అంత దగ్గరయింది.

తెలుగు, ఒడియా సాహిత్యాల మధ్య ఉన్న సామ్యమేమిటి?

తెలుగు, ఒడియాలు మాత్రమే కాదు. ఇతర భారతీయ భాషా సాహిత్యంలో కూడా చాలా పోలికలు ఉంటాయి. భాషపరంగా ఎటువంటి సంబంధం ఉండకపోవచ్చు. కానీ సామాజికంగా అనేక విషయాలు ఒకే విధంగా ఉంటాయి. ఉదాహరణకు మనం తెలుగు ఆధునిక సాహితీ యుగానికి గురజాడను యుగకర్తగా చెప్పుకుంటాం కదా! గురజాడ జీవించిన సమయంలో ఒడియాలో ఫకీర్ మోహన్ సేనాపతి అని ఒక రచయిత ఉండేవారు. ఆయనను ఒడియా సాహితీ దిగ్గజంగా చెప్పుకోవచ్చు. ఆయన 'రేవతి' అనే ఒక కథ రాశారు.



ఈ కథలో చిన్న చిన్న అమ్మాయిలను ముసలివాళ్లకు ఇచ్చి పెళ్లిచేయటం, డబ్బుల కోసం అమ్మాయిలను అమ్ముకోవటం ప్రధానమైన అంశాలు. గురజాడ 'కన్యాశుల్కం'లోని పాత్రల లాంటివే దీనిలో కూడా ఉంటాయి. వాస్తవానికి భాషాపరంగా తెలుగుకు, ఒడియాకు ఎటువంటి సంబంధం లేదు. కానీ ఒకే సమయంలో రెండు ప్రాంతాల్లో ఒకే రకమైన దురాచారాలు ఉన్నాయి. వాటిపై రచయితలు స్పందించారు. కేవలం ఈ రెండు భాషల్లోనే కాదు. ఇతర భాషాల్లో రచయితలు కూడా ఈ తరహా దురాచారాలపై స్పందించే ఉంటారు.

ప్రస్తుతం తెలుగు భాష వ్యాప్తి మీద మీ అభిప్రాయమేమిటి?

మంచి కృషి జరుగుతోంది. జరగటం లేదని చెప్పలేం. కానీ ఈ తరం వాళ్లు తెలుగు భాషకు, తెలుగు సాహిత్యానికి దూరం అవుతున్నారనేది నా అభిప్రాయం. గత మూడు దశాబ్దాలుగా తెలుగు చదివేవారి సంఖ్య తగ్గుతోంది. చిన్నప్పటి నుంచి ఇంగ్లీషు కాన్వెంట్స్‌లో చదువుతున్నారు. దీని వల్ల తెలుగు చదివేవారి సంఖ్య, రాసేవారి సంఖ్య తగ్గిపోతోంది. నా ఉద్దేశంలో ప్రస్తుతం ఎక్కువగా తెలుగు చదివేవారు 50లు దాటినవారే! ఎక్కువ మంది చదవకపోవటం వల్ల మంచి సాహిత్యం రావటం లేదు. అదే సమయంలో సాహితీపరంగా లోతైన అధ్యయనం చేసేవారి సంఖ్య తగ్గుతూ వస్తోంది. కొద్దిమంది చేస్తున్నారు. కానీ అది ప్రభావవంతంగా, సంతృప్తికరంగా ఉండటం లేదు. నా ఉద్దేశంలో పాతను ఎప్పుడూ మనం గౌరవించాలి. పాత మన భవిష్యత్తుకు పునాదిలాంటి. అందుకే తెలుగు సాహిత్యంలో ఉన్న రామాయణ, భారత, భాగవత గ్రంథాలతో పాటు ఇతర సాహిత్యాన్ని కూడా చదవాలి. ఆ గ్రంథాలలో ఉన్న మంచిని గ్రహించాలి. మంచిని గ్రహించాలంటే ముందు అధ్యయనం చేయాలి. అధ్యయనం చేయటానికి బాగా చదవాలి. ఇప్పుడు కొందరు అధ్యయనం చేయకుండా రాసేస్తున్నారు. ఈ విషయం తలుచుకున్నప్పుడు బాధగా అనిపిస్తుంది.

• సివిఎల్ఎన్ ప్రసాద్

రసాయన రంగుల నుంచి రక్షణ ఇలా...

బజారు నుంచి తెచ్చే హోలీ రంగుల్లో రసాయనాలు కలిసి ఉంటాయి. వీటి వల్ల చర్మానికి, కురులకు హాని కలుగవచ్చు. హోలీ ఆడే ముందు కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

- రంగులు చల్లుకున్న తరవాత రసాయనాల ప్రభావం వల్ల చర్మం పొడిబారి మంటగా అనిపించవచ్చు. కాబట్టి ముందుగానే ముఖం, చేతులు, కాళ్లకు మాయిశ్చరైజర్ రాసుకోవడం మంచిది. కొబ్బరి నూనె లేదా బాదం నూనె రాసుకున్నా ఫలితం ఉంటుంది. వీటిని రాసుకోవడం వల్ల రంగులు చర్మం లోపలి పొరల్లోకి ప్రవేశించలేవు.
- హోలీ ఆడే ముందు తలకు కొబ్బరినూనె లేదా ఆలివ్ నూనె రాసుకోవాలి. దీనివల్ల మాడు మీద రక్షణ పొర ఏర్పడి వెంట్రుకల కుదుళ్లలోకి రంగులు చొచ్చుకుని పోకుండా ఉంటాయి. నూనె రాయడం వల్ల శిరోజాలకు రంగులు అంతగా పట్టవు. తలస్నానం చేసిన వెంటనే తేలికగా రంగులు వదిలిపోయి వెంట్రుకలు మృదువుగా మెరుస్తాయి.
- రంగుల నుంచి శిరోజాలను కాపాడుకోవడానికి టోపీ, స్కార్ఫ్ ధరించవచ్చు. శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే తేలికపాటి నూలు బట్టలు వేసుకోవాలి. దుస్తులు మరీ బిగుతుగా కాకుండా కొద్దిగా వ దులుగా ఉన్నవి అయితే మంచిది. పాదాలకు షూస్ వేయడం ఉత్తమం.
- గోళ్లకు రంగులు అంటకుండా నెయిల్ పాలిష్ వేస్తే మంచిది
- హోలీ ఆడడానికి వెళ్లే ముందు పెదవులకు లిప్ బామ్ వేసుకోవాలి. లేదంటే రంగుల వల్ల పెదవులు తేమను కోల్పోతాయి. వాటిపై పగుళ్ల ఏర్పడి రక్తస్రావం కావచ్చు.
- హోలీ ఆడిన తరవాత ముఖాన్ని, చేతులను సబ్బుతో ఎక్కువగా రుద్దకూడదు. సున్నిపిండి లేదా శనగపిండిని ఉపయోగించడం మంచిది.



పేరెంటింగ్

పిల్లలు మొండికేస్తున్నారా?

తల్లిదండ్రుల పెంపకం ఆధారంగానే పిల్లల స్వభావం రూపుదిద్దుకుంటుంది. ఏ మాత్రం అజాగ్రత్త వహించినా పిల్లలు మొండిగా మారే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. పిల్లల్లో మొండితనం పెరగకుండా తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకుందాం.

- ఇతరుల దృష్టిని ఆకర్షించేందుకు పిల్లలు రకరకాల పనులు చేస్తూ ఉంటారు. తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు వాటిని గమనించి పిల్లలను ఉత్సాహపరచాలి. ఇంకా బాగా చేయమని ప్రోత్సహించాలి. దీనివల్ల పిల్లల్లో ఆత్మ విశ్వాసం పెరుగుతుంది. అదే తల్లిదండ్రులు చూసీ చూడనట్లు ఊరుకున్నా, నిర్లక్ష్యంగా వ్యవహరించినా పిల్లలు నిరుత్సాహంతో మొండిగా మారతారు.
- పిల్లలు ఏదైనా తప్పు చేస్తే దాన్ని సరిదిద్దడం తల్లిదండ్రుల బాధ్యత. కాని ఇతరుల ముందు ఆ తప్పును ఎత్తి చూపడం లేదా తిట్టడం చేస్తే పిల్లల మనసులో ప్రతికూల ఆలోచనలు ఏర్పడతాయి. పిల్లలు చేసే పొరబాట్ల గురించి వారితోనే వ్యక్తిగతంగా మాట్లాడాలి. కఠినంగా కాకుండా మెల్లగా వివరించి చెప్పాలి.
- ఏ పని చేసినా తల్లిదండ్రులు విమర్శిస్తూ అసంతృప్తిని వ్యక్తం చేస్తుంటే పిల్లలు మొండిగా వ్యవహరించడం మొదలుపెడతారు. కాబట్టి పిల్లలు చేసే పనులను గమనిస్తూ వాళ్లకి సరైన సలహాలు ఇవ్వడం మంచిది.
- పిల్లలకు ఏదైనా పనిని అప్పజెప్పినప్పుడు వాళ్లు దాన్ని పూర్తిచేసేవరకూ తల్లిదండ్రులు ఓపికగా ఉండాలి. పని మధ్యలో జోక్యం చేసుకోవడం, దిద్దుబాటు చర్యలు, ఇది కూడా తెలీదా అంటూ విమర్శించడం చేయకూడదు. వీటివల్ల పిల్లల్లో ఆసక్తి తగ్గుతుంది. తల్లిదండ్రులపై విముఖత భావం ఏర్పడి మొండిగా మారతారు.
- పిల్లలు ఏ చిన్న సహాయం చేసినా తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలియజేయాలి. ఇదే పద్ధతిని పిల్లలు కూడా అలవాటు చేసుకుంటారు.
- తల్లిదండ్రుల ప్రవర్తనను పిల్లలు గమనిస్తూ అనుసరిస్తుంటారు. కాబట్టి తల్లిదండ్రులు క్రమశిక్షణతో మెలగుతూ ప్రేమపూర్వకంగా వ్యవహరిస్తూ ఉంటే పిల్లలు కూడా మొండితనానికి పోకుండా చక్కని వ్యక్తిత్వాన్ని అలవరచుకుంటారు.



మిమ్మల్ని మీరు పట్టించుకోండి

నీతా అంబానీ... ప్రపంచ కుబేరుల్లో ఒకరైన ముఖేష్ అంబానీ అర్ధాంగిగానే కాదు... సామాజిక కార్యకర్తగా, భరతనాట్య కళాకారిణిగా, ముంబయి ఇండియన్స్ ఐపీఎల్ జట్టు అధిపతిగా... సుపరిచితురాలు. ఆరు పదులు దాటిన వయసులోనూ ఎంతో ఉత్సాహంగా, దృఢంగా కనిపించే ఆమె... వివిధ మాధ్యమాల ద్వారా నిత్యం స్ఫూర్తి నింపే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యంగా మహిళలు తమ గురించి తాము పట్టించుకోవాలని... ఫిట్‌నెస్ కోసం రోజుకు కనీసం ఓ అరగంట సమయం కేటాయించాలని సూచిస్తున్నారు. శారీరక దారుఢ్యం ఆరోగ్యకర, ఆనందమయ జీవనానికి బాటలు వేస్తుందంటూ ఇటీవల ఇన్‌స్టాలో ఓ వీడియో పోస్ట్ చేశారు.



ఇల్లు, ఉద్యోగం, ప్రయాణం... నేటితరం మహిళలకు క్షణం తీరిక దొరకడంలేదు. ఉదయం మంచం దిగింది మొదలు... మళ్లీ నిద్రకు ఉపక్రమించేవరకు ఎడతెరిపిలేని పని. ఈ హడావుడిలో తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇదే తీరు కొనసాగితే వయసు మీద పడ్డాక ఎన్నో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, అందుకే మహిళలు తమ గురించి తాము ఆలోచించుకోవాలనేది నీతా అంబానీ మాట.

'మహిళలు ఇంట్లో తమకు ఆఖరి ప్రాధాన్యం ఇచ్చుకొంటారు. కానీ ఇది సరైంది కాదు. ముఖ్యంగా యాభై దాటిన తరువాత ఆరోగ్యం, శరీరంపై శ్రద్ధ పెట్టాలి. ముప్ఫై ఏళ్ల పైబడినప్పటి నుంచీ ఆడవారు క్రమంగా కండరాల పటుత్వాన్ని కోల్పోతారు. ఎముకల సాంద్రత, సామర్థ్యం, చురుకుదనం తగ్గుతాయి. జీర్ణక్రియ, సమతుల్యత దెబ్బతింటాయి. వీటన్నిటి నుంచి మనల్ని మనం కాపాడుకోవాలంటే వ్యాయామం తప్పనిసరి. నేను రోజుకు కనీసం అరగంట అందుకు కేటాయిస్తాను. వారంలో ఆరు రోజులు కచ్చితంగా వర్కవుట్స్ చేస్తాను. మీకు నేను ఇచ్చే సలహా ఒక్కటే. మీ శరీరం చెప్పేది వినండి. ఇవాళే వ్యాయామాలు ఆరంభించండి. ఈ వయసులోనా... అని వెనకడుగు వేయవద్దు. మన కోసం మనం కాకపోతే ఇంకెవరు ఆలోచిస్తారు?' అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఓ వీడియోలో చెప్పుకొచ్చారు నీతా అంబానీ. అంతేకాదు... 'అరవై ఒక్క ఏళ్ల వయసులో నేను చేయగలుగుతున్నానంటే మీరూ చేయగలరు' అంటూ స్ఫూర్తి నింపే ప్రయత్నం చేశారు. ఆరోగ్యకర జీవనం దిశగా మహిళలను ప్రోత్సహించేందుకు ఇటీవలే 'హ్యాష్‌ట్యాగ్ స్ట్రాంగ్ హర్ మూవ్‌మెంట్'కు శ్రీకారం చుట్టారు.

> **నాట్యం ఒక భాగం...**
>
> నీతా అంబానీ ఫిట్‌నెస్ రొటీన్‌లో స్ట్రెంత్, మొబిలిటీ, ఫ్లెక్సిబిలిటీ ట్రైనింగ్‌తో పాటు యోగా ఉంటుంది. అప్పుడప్పుడు స్విమ్మింగ్, ఆక్వా ఎక్సర్‌సైజ్‌లు చేస్తారు. ఎప్పుడైనా పర్యటనలకు వెళ్లినప్పుడు, జిమ్ అందుబాటులో లేనప్పుడు కూడా కనీసం రోజుకు ఐదారు వేల అడుగులకు తగ్గకుండా నడుస్తారు. ఫిట్‌నెస్ విషయంలో రాజీ ఉండదు. భరతనాట్యం కూడా ఆమె వర్కవుట్స్‌లో ఒక భాగం. 'ఆరేళ్ల వయసులోనే నేను భరతనాట్యం మొదలుపెట్టాను. అప్పటి నుంచీ సాధన చేస్తూనే ఉన్నాను. ఇది కాళ్లకు బలాన్నిచ్చే మంచి వ్యాయామం' అంటున్న ఆమె 'నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్‌'లో పలుసార్లు నాట్య ప్రదర్శనలు ఇచ్చారు. పాఠశాల, కళాశాల స్థాయిల్లో సంప్రదాయ కళలను ప్రోత్సహించేందుకు ఆమె 2023లో ఈ వేదికను ఏర్పాటు చేశారు. దీని ఆధ్వర్యంలో వివిధ అవార్డులు కూడా అందిస్తున్నారు.

శాకాహారి...

'రిలయన్స్ ఫౌండేషన్' చైర్మన్ అయిన నీతా... ఆహారం విషయంలో కచ్చితంగా ఉంటారు. 'నేను పూర్తి శాకాహారిని. సేంద్రియమైన, ప్రకృతిసిద్ధమైన సమతుల ఆహారం తీసుకొంటాను. వాటిల్లో పోషకాలు పుష్కలంగా ఉండేలా చూసుకొంటాను. పంచదార, దాంతో చేసిన తీపి పదార్థాలు ముట్టుకోను.' అంటారు నీతా. రోజూ ఉదయం బీట్‌రూట్ జ్యూస్ తాగుతారు. ఇది తన చర్మాన్ని తాజాగా ఉంచడానికి దోహదపడుతుందని ఓ ఇంటర్వ్యూలో ఆమె చెప్పారు. మధ్యాహ్న భోజనంలో



రకరకాల కాయగూరలు, ఆకుకూరలతో వండిన వంటలు, సూప్‌లు ఉంటాయి. ఉప్పు తక్కువగా వాడతారు. జంక్‌ఫుడ్‌కు దూరం. రాత్రిపూట కూడా మితాహారం తీసుకొంటారు.

'వ్యాయామాలు, యోగావల్ల శారీరక దారుఢ్యమే కాదు, మానసిక ప్రశాంతత కూడా లభిస్తుంది. రోజంతా ఉల్లాసంగా అనిపిస్తుంది. ఆలోచనలు సానుకూల ధోరణిలో సాగుతాయి. హ్యాపీ హార్మోన్లయిన ఎండార్ఫిన్లు విడుదలవుతాయి. దీనివల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుంది. ఫిట్‌నెస్ అంటే కేవలం బరువులు ఎత్తడమే కాదు... అది మన దైనందిన జీవితానికి కావల్సిన శక్తిని, సామర్థ్యాన్ని ఇస్తుంది. నావరకైతే ఫిట్‌నెస్ అనేది నా మనవళ్ల, మనవరాళ్లను ఎత్తుకొని ఆడించడం... వారితో పోటీపడడం' అంటారు నీతా.

ఢిల్లీ ప్రత్యర్థి ఎవరో?



- నేటి ఎలిమినేటర్‌లో ముంబై X గుజరాత్
- నెగ్గిన జట్టుకు ఫైనల్లో చోటు

రాత్రి 7.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్‌లో నాకౌట్ సమరానికి సర్వం సిద్ధమైంది. త్రుటిలో నేరుగా ఫైనల్ చేరే అవకాశాన్ని చేజార్చుకొన్న మాజీ చాంప్ ముంబై ఇండియన్స్.. గురువారం జరిగే ఎలిమినేటర్‌లో గుజరాత్ జెయింట్స్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్‌లో నెగ్గిన జట్టు.. శనివారం జరిగే టైటిల్ పోరులో ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనుంది. లీగ్ దశలో ఆడిన ఎనిమిది మ్యాచ్‌ల్లో ఐదు నెగ్గిన ముంబై.. చివరి పోరులో బెంగళూరు చేతిలో ఓడింది. ఇక కీలక మ్యాచ్‌కు ముంబై జట్టులో ఎటువంటి మార్పులూ చేయడం లేదని సమాచారం. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ దూకుడైన బ్యాటింగ్ జట్టుకు ప్లస్ కాగా.. ఆల్‌రౌండర్‌గా హేలీ మాథ్యూస్ అదరగొడుతోంది. నాట్ సివర్ బ్రంట్ ఎక్కువగా బ్యాటింగ్ భారాన్ని మోస్తోంది. షబ్నిం ఇస్మాయిల్, అమేలియా కెర్‌తోపాటు బ్రంట్ బంతితో ఆదుకొంటున్నారు. మరోవైపు గుజరాత్ కూడా దీటుగానే కనిపిస్తోంది. ఆడిన ఎనిమిది మ్యాచ్‌లో నాలుగు నెగ్గిన జెయింట్స్ మూడో స్థానంతో నాకౌట్ బెర్త్ పట్టేసింది. బెత్ మూనీ, హర్లీన్, లిచ్‌ఫీల్డ్, ఫుల్‌మాలి.. జెయింట్స్‌కు వెన్నెముకగా నిలుస్తున్నారు. కెప్టెన్ గార్డ్‌నర్ కూడా బ్యాట్‌ను ఝళిపిస్తుండడం విశేషం. బౌలింగ్‌లో మేఘన, ప్రియా మిశ్రా, కష్వీ గౌతమ్ రాణిస్తున్నారు. లీగ్ దశలో రెండుసార్లు గుజరాత్‌పై నెగ్గిన ముంబై ఫేవరెట్‌గా కనిపిస్తోంది. అయితే, జెయింట్స్ ఈసారి గట్టిగా బదులు తీర్చుకోవాలనుకొంటోంది.


భారత జట్టు మాజీ ఆల్‌రౌండర్


అబిద్ అలీ కన్నుమూత

అరంగేట్ర టెస్ట్‌లో ఉత్తమ బౌలింగ్

బంతి, బ్యాటుతో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఘనత

ఆ తరంలో అత్యుత్తమ ఫీల్డర్





హైదరాబాద్: భారత జట్టు మాజీ ఆల్‌రౌండర్, హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ అబిద్ అలీ (83) మరణించారు. ప్రస్తుతం కాలిఫోర్నియాలో ఉంటున్న ఆయన గుండె సంబంధిత సమస్యతో కన్నుమూశారు. ఆయనకు ఇద్దరు సంతానం. ఓ కుమారుడు, కుమార్తె. అలీ కుమారుడు..భారత జట్టు మాజీ కీపర్ సయ్యద్ కిర్మాణీ అల్లుడు. కాగా, కుమారుడు కాలిఫోర్నియాలో క్రికెట్ ఆడుతూ గుండెపోటుతో మరణించాడు. ఇక, 1941లో హైదరాబాద్‌లో జన్మించిన అబిద్ అలీ..1967లో బ్రిస్బేన్‌లో ఆస్ట్రేలియాపై టెస్ట్ అరంగేట్రం చేశారు. కుడిచేతి వాటం పేస్ బౌలర్ అయిన అబిద్ తొలి మ్యాచ్‌లోనే అద్భుత ప్రదర్శన చేశారు. ఆ టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో 55 పరుగులకు 6 వికెట్లు పడగొట్టారు. అప్పట్లో అరంగేట్రంలో అత్యుత్తమ బౌలింగ్ చేసిన భారత బౌలర్‌గా రికార్డు నెలకొల్పారు. అలీ 29 టెస్ట్‌ల్లో 47 వికెట్లు పడగొట్టారు. ఈ టెస్ట్‌ల్లో ఏడు మ్యాచ్‌ల్లో అబిద్ అలీ బౌలింగ్‌తోపాటు, బ్యాటర్‌గా భారత ఇన్నింగ్స్‌ను ప్రారంభించడం అరుదైన విషయం. 1974లో వన్డేల్లోకి అడుగుపెట్టిన ఆయన 1975 ప్రపంచకప్ ఆడారు. మొత్తం 5 వన్డేల్లో 7 వికెట్లు తీశారు.

ధైర్యవంతుడైన క్రికెటర్..

అబిద్ అలీ ధైర్యవంతుడైన క్రికెటర్. ఆల్‌రౌండర్, విడిలార్డర్ బ్యాటర్ అయినా..జట్టుకు అవసరమైన సందర్భాలలో ఓపెనర్‌గా దిగారు. లెగ్‌సైడ్‌లో కళ్లు చెదిరే క్యాచ్‌లు పట్టారు. టెస్ట్ మ్యాచ్‌లో తొలి బంతికే రెండుసార్లు వికెట్లు సాధించిన అరుదైన ఘనత ఆయన సొంతం.

- సునీల్ గవాస్కర్

అబిద్ కెరీర్ ఇలా..

బౌలర్‌గా: టెస్ట్‌లు-29, వికెట్లు-47, బెస్ట్-6/55. వన్డేలు- 5, వికెట్లు-7, ఉత్తమ బౌలింగ్-2/22.
బ్యాటర్‌గా: టెస్ట్‌లు-29, పరుగులు-1018. వన్డేలు-5, పరుగులు-93, అత్యధికం-70.

హైదరాబాద్ దిగ్గజం

1956లో హైదరాబాద్ స్కూల్స్‌కు ఆడడం ద్వారా అబిద్ క్రికెట్‌కు శ్రీకారం చుట్టారు. కేరళ జట్టుపై 82 పరుగులు చేసిన అలీ ఉత్తమ ఫీల్డర్ అవార్డును అందుకున్నారు. కొన్నేళ్ల తర్వాత స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్‌లో చేరారు. తొలుత వికెట్ కీపర్‌గా కెరీర్ మొదలుపెట్టిన ఆయన తర్వాత బౌలర్‌గా మారారు. 1958-59లో హైదరాబాద్ జూనియర్ జట్టుకు ఆడిన అలీ మరుసటి ఏడాది రంజీ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. 1967లో రంజీ ట్రోఫీలో సెంచరీ సాధించిన అలీకి ఆ ఏడాది ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో పర్యటించిన భారత జట్టులో చోటు దక్కింది. ఆసీస్ టూర్ తొలి టెస్ట్‌లో కెప్టెన్ ఎంఏకే పటౌడీ గాయంతో వైదొలగడంతో అలీకి తుది జట్టులో చోటు లభించింది. ఆ మ్యాచ్‌లో 6 వికెట్లతో ఉత్తమప్రదర్శన చేశాడు. మూడో టెస్ట్‌లో ఓపెనర్‌గా దిగిన అబిద్ 47 రన్స్‌తో ఆకట్టుకున్నారు. ఆపై నాలుగో, చివరి టెస్ట్‌లో వరుసగా 81, 78 రన్స్ చేశారు.

చారిత్రక విజయాలలో..: 1971లో వెస్టిండీస్‌లో పర్యటన భారత జట్టు టెస్ట్ చరిత్రలో మైలురాయి. 5 మ్యాచ్‌ల ఆ సిరీస్‌ను భారత్ 1-0తో గెలిచింది. అప్పట్లో అత్యంత బలమైన విండీస్‌పై భారత్ నెగ్గిన తొలి టెస్ట్‌తోపాటు మొదటి టెస్ట్ సిరీస్ విజయం కావడం విశేషం. 1971లో ఇంగ్లండ్‌లో పర్యటన కూడా భారత్‌కు చరిత్రాత్మకం. 3 మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 1-0తో నెగ్గింది. ఇంగ్లండ్‌పై మనకది తొలి టెస్ట్ సిరీస్ విజయం. భారత్ గెలిచిన ఓవల్ టెస్ట్‌లో విజయానికి అవసరమైన పరుగులను అబిద్ చేయడం విశేషం. ఈ రెండు సిరీస్ విజయాలు అందుకున్న భారత జట్టులో అబిద్ భాగమయ్యారు.

అద్భుత ఫీల్డర్: అబిద్ అలీ తన తరంలో గొప్ప ఫీల్డర్‌గా పేరు గాంచారు. ఫతే మైదాన్ క్లబ్‌లో గంటల కొద్దీ ప్రాక్టీస్‌లో ఫీల్డింగ్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించేవారు. క్యాచ్‌లు పట్టడాన్నీ సుదీర్ఘంగా సాధన చేసేవారు. వికెట్ల మధ్య చిరుతలా పరిగెత్తేవారు.

కోచ్‌గా..: రిటైరైన తర్వాత అలీ కోచ్‌గా పని చేశారు. ఈ సమయంలో హైదరాబాద్ జూనియర్ జట్టు సేవలు అందించారు. మాల్దీవులు, యూఏఈ జట్లకూ కోచ్‌గా వ్యవహరించారు. 2001-02లో రంజీ ట్రోఫీ సౌత్‌జోన్ లీగ్ చాంపియన్‌షిప్ గెలిచిన ఆంధ్ర జట్టుకు అబిద్ శిక్షణ ఇచ్చారు. అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ క్రికెట్ అకాడమీ కోచ్‌గా పలువురు ఆటగాళ్లను తీర్చిదిద్దారు.

సింధు ఇంటిదారి

ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్



రెండో రౌండ్‌కు రుత్విక జంట



బర్మింగ్‌హామ్: ఆల్ ఇంగ్లండ్ ఓపెన్‌లో ఏస్ షట్లర్ పీవీ సింధు తొలి రౌండ్‌లోనే వెనుదిరగగా.. గాయత్రి జోడీ ప్రీక్వార్టర్స్‌కు చేరుకొంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో వరల్డ్ నెం:16 సింధు 21-19, 13-21, 13-21తో కిమ్ గ వున్ (కొరియా) చేతిలో ఓటమిపాలైంది. తొలి గేమ్‌లో 20-12తో గేమ్ పాయింట్‌పై నిలిచిన సింధు.. తడబాటుతో ప్రత్యర్థికి పుంజుకొనే అవకాశం ఇచ్చింది. కానీ, చివర్లో ఎలాగోలా గేమ్‌ను దక్కించుకొంది. ఆ తర్వాతి రెండు గేముల్లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన కిమ్ మ్యాచ్‌ను సొంతం చేసుకొంది. గాయం నుంచి కోలుకొని రీఎంట్రీ ఇచ్చిన తర్వాత సింధు పేలవ ప్రదర్శనను కొనసాగిస్తోంది. జనవరిలో జరిగిన ఇండోనేసియా మాస్టర్స్ మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించిన సింధు.. ఇండియా ఓపెన్‌లో క్వార్టర్స్ దాటలేక పోయింది. కాగా, మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్ జోడీ 21-17, 21-13తో చైనీస్ తైపీకి చెందిన సంగ్ షు యున్-యు చెన్ హుయ్‌పై వరుస గేముల్లో నెగ్గింది. అయితే, శ్రుతి మిశ్రా-ప్రియా జంట 9-21, 4-21తో కొరియా టాప్ సీడ్ లి సొ హి-బెక్ హ న ద్వయం చేతిలో చిత్తయింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ కపూర్-రుత్విక శివాని జంట 21-10, 7-21, 24-22తో యి హోంగ్ వి-నికోల్ (చైనీస్ తైపీ) జోడీపై గెలిచింది.



గౌతీ..కొత్త ట్రెండ్?

'ఎ' జట్టు టూర్లకూ వెళ్లేందుకు సిద్ధం

న్యూఢిల్లీ: గతంలో భారత క్రికెట్ జట్టు చీఫ్ కోచ్‌లుగా పనిచేసినవారికి భిన్న శైలిలో వెళ్లేందుకు గౌతమ్ గంభీర్ సిద్ధమవుతున్నాడట. ఇకనుంచి సీనియర్ జట్టు బాధ్యతలు లేనప్పుడు భారత 'ఎ' జట్టుతో పాటు విదేశీ పర్యటనలకు వెళ్లాలని భావిస్తున్నాడు. భారత రిజర్వు బెంచ్ బలంపై అవగాహనకు వచ్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నాడని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. గతేడాది సొంతగడ్డపై న్యూజిలాండ్ చేతిలో, ఆ తర్వాత ఆస్ట్రేలియా పర్యటనలో వైఫల్యాల దరిమిలా టెస్టు క్రికెట్‌లో భారత్‌ను గాడిలో పెట్టే దిశగా గంభీర్ తన ప్రయత్నాలను తీవ్రతరం చేయనున్నాడట. అందుకే 'ఎ' జట్టు విదేశీ టూర్ల సంఖ్యను పెంచాలని బోర్డుకు గంభీర్ సూచించాడు. ప్రస్తుతం భారత 'ఎ' జట్టు చీఫ్ కోచ్‌గా సితాంశు కోటక్ వ్యవహరిస్తున్నాడు.

లలిత పసిడి కాంతులు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రపంచ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రీలో పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన లలిత రెండో పతకం సొంతం చేసుకుంది. బుధవారం ఢిల్లీలో జరిగిన టీ11 400 మీటర్ల పరుగులో లలిత స్వర్ణం సాధించింది. మంగళవారం 1500 మీటర్ల రేసులో ఆమె కాంస్యం నెగ్గింది.

ఒలింపిక్స్‌లో 'తార' ప్రకాశిస్తుంది!



ఆనంద్ మహీంద్రా ఆకాంక్ష


ముంబై: ప్రఖ్యాత పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్ర సోషల్‌మీడియాలో చురుకుగా ఉంటారు. తన దృష్టికి వచ్చిన స్ఫూర్తిదాయక అంశాలను పంచుకుంటూ ప్రజలలో చైతన్యం కలిగిస్తుంటారు. ఈకోవలోనే భారత్-అమెరికా స్కేటర్, 24 ఏళ్ల తారా ప్రసాద్ గురించి ఆయన వెల్లడించారు. 'తారా ప్రసాద్ 2019లో అమెరికా పౌరసత్వం వదులుకొని భారత్ వచ్చి స్కేటింగ్‌లో రాణిస్తోంది. మూడుసార్లు జాతీయ చాంపియన్‌గా నిలిచింది. గత వింటర్ ఒలింపిక్స్‌లో పాల్గొనే చాన్సు కొద్దిలో మిస్సయిందని తెలిసింది. కానీ 2026 శీతాకాల ఒలింపిక్స్‌కు ఆమె కచ్చితంగా అర్హత సాధిస్తుంది. ఆ క్రీడల్లో పతకంతో మెరుస్తుంది' అని ఆనంద్ మహీంద్రా తారా ప్రసాద్‌లో స్ఫూర్తి నింపారు. తార తల్లిదండ్రులది తమిళనాడు. అయితే వారు అమెరికా వలస వెళ్లి అక్కడ స్థిరపడ్డారు.

గిల్‌కు ఐసీసీ అవార్డు

దుబాయ్: సూపర్‌ఫామ్‌లో ఉన్న టీమిండియా యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ 'ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డును గెలుచుకున్నాడు. ఇటీవల ఇంగ్లండ్‌తో సిరీస్‌లో అదరగొట్టిన గిల్, అనంతరం చాంపియన్స్ ట్రోఫీలోనూ సత్తా చాటాడు. దీంతో ఫిబ్రవరి నెలకుగాను ఈ ఐసీసీ అవార్డు విజేతగా నిలిచాడు. ఆస్ట్రేలియా స్టార్ స్టీవ్ స్మిత్, న్యూజిలాండ్‌కు చెందిన గ్లెన్ ఫిలిప్స్‌లను వెనక్కి నెట్టి గిల్ ఈ పురస్కారం దక్కించుకోవడం విశేషం. కాగా, ఈ అవార్డు నెగ్గడం గిల్‌కు ఇది మూడోసారి. గతంలో 2023లో రెండుసార్లు దీన్ని అందుకున్నాడు.

మూడో స్థానానికి రోహిత్

ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్



దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో అదరగొట్టిన రోహిత్ శర్మ ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో ముందుకెళ్లాడు. తాజా ర్యాంకింగ్స్‌లో బ్యాటర్ల జాబితాలో రోహిత్ రెండు స్థానాలు ఎగబాకాడు. తద్వారా మూడో ర్యాంకులో నిలిచి టాప్-3లో చోటు దక్కించుకున్నాడు. విరాట్ కోహ్లీ ఓ స్థానం కోల్పోయి ఐదో ర్యాంక్‌కు చేరగా, శ్రేయాస్ అయ్యర్ 8వ స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. ఇక, శుభ్‌మన్ గిల్ టాప్ ర్యాంక్‌ను పదిలం చేసుకొన్నాడు. బౌలర్లలో కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా చెరో మూడు స్థానాలు మెరుగై వరుసగా 3వ, 10వ ర్యాంకుల్లో నిలిచారు. న్యూజిలాండ్ కెప్టెన్ శాంట్నర్ ఏకంగా ఆరు స్థానాలు ఎగబాకి రెండో ర్యాంక్‌కు చేరుకున్నాడు.

క్రికెట్‌కు మహ్మదుల్లా గుడ్‌బై



ఢాకా: బంగ్లాదేశ్ వెటరన్ బ్యాటర్, 39 ఏళ్ల మహ్మదుల్లా అంతర్జాతీయ క్రికెట్‌కు బుధవారం రిటైర్మెంట్ ప్రకటించాడు. మహ్మదుల్లా తన 17 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో 239 వన్డేలు, 50 టెస్ట్‌లు, 141 టీ20లు ఆడాడు. మూడు వన్డే వరల్డ్ కప్‌లలో సెంచరీలు చేసిన బంగ్లా క్రికెటర్‌గా రికార్డు నెలకొల్పాడు. 2021లో టెస్ట్‌లకు, 2024లో టీ20లకు మహ్మదుల్లా వీడ్కోలు పలికాడు. ఇక.వన్డేల్లో 5698, టెస్ట్‌ల్లో 2914, టీ20ల్లో 2444 రన్స్ చేశాడు. ఆఫ్ స్పిన్నర్‌గా మూడు ఫార్మాట్లలో కలిపి 166 వికెట్లు పడగొట్టాడు.

బిజినెస్

అన్నీ మంచి శకునములే..!



దిగొచ్చిన ధరలు.. పుంజుకున్న పారిశ్రామికం

- 7 నెలల కనిష్ఠానికి రిటైల్ ద్రవ్యోల్బణం
- ఫిబ్రవరిలో 3.61 శాతానికి పరిమితం
- జనవరిలో 5 శాతానికి పారిశ్రామికోత్పత్తి సూచీ

న్యూఢిల్లీ: దేశంలో ధరల మంట తగ్గుముఖం పట్టగా.. పారిశ్రామిక వృద్ధి పుంజుకుంది. కేంద్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. గత నెలలో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం 7 నెలల కనిష్ఠ స్థాయి 3.61 శాతానికి దిగొచ్చింది. కూరగాయలు, కోడి గుడ్లు, ప్రొటీన్ ఉత్పత్తులు, పాలు, వాటి ఉత్పత్తుల ధరలు తగ్గడం ఇందుకు ప్రధానంగా దోహదపడింది. ద్రవ్యోల్బణం జనవరి నెలలో 4.26 శాతం ఉండగా గత ఏడాది ఫిబ్రవరిలో 5.09 శాతంగా ఉంది. గత ఏడాది జూలైలో ఆర్‌బీఐకి ప్రభుత్వం నిర్దేశించిన కనిష్ఠ కట్టడి స్థాయి 4% సమీపానికి దిగొచ్చిన ద్రవ్యోల్బణం తిరిగి ఆ స్థాయి కన్నా దిగువకు తగ్గడం ఇదే ప్రథమం. అయితే గత ఏడాది నవంబరు నుంచి ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ కట్టడి (2% ఎగువకు లేదా దిగువకు సద్దుబాటుతో 4%) పరిధిలోనే కదలాడుతూ వస్తోంది.

వడ్డీపోటు మరింత తగ్గే చాన్స్

ద్రవ్యోల్బణం 4 శాతం దిగువకు జారుకోవడంతో కీలక రెపోరేట్లు మరింత తగ్గే అవకాశాలున్నాయని విశ్లేషకులంటున్నారు. వచ్చే నెల 9న ఆర్‌బీఐ తదుపరి ద్రవ్యపరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ప్రకటించనుంది. ఆ సందర్భంగా రెపోరేటును మరో పావు (0.25) శాతం తగ్గించవచ్చని ఆర్థికవేత్తలు భావిస్తున్నారు. అదే జరిగితే రెండు నెలల వ్యవధిలోనే ఇది రెండో కోత అవుతుంది. ఫిబ్రవరి సమీక్షలో ఆర్‌బీఐ రెపోరేటును పావు శాతం తగ్గించింది. దాంతో రెపో 6.25 శాతానికి జారుకుంది. ఇప్పుడు మరో పావు కోత పెడితే రెపో రేటు 6 శాతానికి దిగివస్తుంది. తద్వారా రెపో ప్రామాణిక గృహ, వాహన, వ్యక్తిగత రుణాల వడ్డీరేట్లతోపాటు ఈఎంఐల భారం సైతం తగ్గే అవకాశం ఉంటుంది. ఏప్రిల్‌తో పాటు జూన్ లేదా ఆగస్టు సమీక్షలో రెపోరేటును మరో 0.25 శాతం తగ్గించే అవకాశాల్లేకపోలేవని దేశీయ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా ప్రధాన ఆర్థికవేత్త అదితీ నాయర్ అంచనా వేశారు.

తయారీ రంగం జోరు

తయారీ రంగం దన్నుతో జనవరి నెలలో పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) 5 శాతానికి పెరిగింది. అంతేకాదు, 2024 డిసెంబరు ఐఐపీని సైతం ప్రభుత్వం తొలుత అంచనా వేసిన 3.2 శాతం నుంచి తాజాగా 3.5 శాతానికి పెంచింది. ఐఐపీ గత ఏడాది జనవరిలో 4.2% ఉండగా వర్తమాన ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జనవరి నెలల మధ్య కాలంలో కూడా అదే స్థాయిలో ఉంది. అయితే 2023-24 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జనవరి నెలల్లో నమోదైన 6 శాతం కన్నా ఇది తక్కువే. తయారీ రంగంలో వృద్ధిరేటు గత ఏడాది జనవరితో పోల్చితే 3.6 శాతం నుంచి 5.5 శాతానికి పెరిగింది. అయితే గనుల రంగంలో మాత్రం ఉత్పత్తి 6 శాతం నుంచి 4.4 శాతానికి క్షీణించింది. ఒకపక్క ప్రపంచం మొత్తాన్ని ట్రంప్ సుంకాల హెచ్చరికలు అతలాకుతలం చేస్తున్న వాతావరణంలో మన దేశంలో స్థూల ఆర్థిక గణాంకాలు మెరుగుపడడం ఆనందదాయకమని, రాబోయే సవాళ్లను ప్రభుత్వం ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొనేందుకు ఇవి దోహదపడతాయని అసోచాం అంటోంది.

హైదరాబాద్‌లో టెన్త్‌పిన్ ఏఐ ల్యాబ్స్ గ్లోబల్ సెంటర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): లైఫ్‌సైన్స్ కంపెనీలకు టెక్నాలజీ అడ్వైజరీ సేవలందించే స్విట్జర్లాండ్‌కు చెందిన టెన్త్‌పిన్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్స్ కంపెనీ నగరంలో టెన్త్‌పిన్ ఏఐ ల్యాబ్స్ (టెయిల్), గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించింది. తెలంగాణ ప్రభుత్వ ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. విస్తరణ ప్రక్రియలో భాగంగా టెన్త్‌పిన్ హైదరాబాద్‌ను ఎంచుకోవడం, ఇక్కడ ఏర్పాటు చేసింది కంపెనీకి ప్రపంచంలోనే అతి పెద్ద కేంద్రం కావడం ఆనందదాయకమని ఈ సందర్భంగా జయేష్ రంజన్ అన్నారు. లైఫ్‌సైన్స్ కంపెనీలు తమ నిపుణులతో కలిసి పని చేసేందుకు ఇది ఒక ఇంక్యుబేషన్ సెంటర్‌గా వ్యవహరిస్తుందని కంపెనీ డైరెక్టర్ బార్ట్ రీజ్ అన్నారు.

గ్లెన్‌మార్క్ నుంచి కొత్త మధుమేహ ఔషధం

హైదరాబాద్: మధుమేహ రోగుల్లో గ్లైసెమిక్ కంట్రోల్‌కు, బరువు తగ్గడానికి ఎంపాగ్లిఫ్లోజిన్ టాబ్లెట్లను మార్కెట్లో విడుదల చేసినట్టు గ్లెన్‌మార్క్ ఫార్మా ప్రకటించింది. గ్లెంపా బ్రాండ్ కింద గ్లెంపా (ఎంపాగ్లిఫ్లోజిన్ 10/25 ఎంజీ), గ్లెంపా-ఎల్ (ఎంపాగ్లిఫ్లోజిన్ 10/25 ఎంజీ+లినాగ్లిప్టిన్ 5 ఎంజీ), గ్లెంపా-ఎం (ఎంపాగ్లిఫ్లోజిన్ 12.5 ఎంజీ+మెట్‌ఫార్మిన్ 500/1000 ఎంజీ) డోసేజిల్లో ఇవి అందుబాటులో ఉంటాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

13వ తేదీ			
హైదరాబాద్	385	విజయవాడ	420
వరంగల్	387	గోదావరి	410
చిత్తూరు	443	విశాఖపట్నం	415
		దజను గుడ్లు రూ. 66	


ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	73	విజయవాడ	95
వరంగల్	73	గుంటూరు	90
కరీంనగర్	73	ఒంగోలు	90
మహబూబ్‌నగర్	73	చిత్తూరు	80
కర్నూలు	73	నెల్లూరు	85
విశాఖపట్నం	89	అనంతపురం	85
గోదావరి	95		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	87,980 ▲	80,650 ▲	1,09,000 ▲
విజయవాడ	88,800 ▲	83,600 ▲	1,00,000 ▲
విశాఖపట్నం	86,480 ▲	79,270 ▲	99,540 ▲
రాజమండ్రి	87,980 ▲	80,650 ▲	1,00,200 ▲
ప్రొద్దుటూరు	87,800 ▲	81,300 ▲	99,000 ▲
ముంబై	86,140 ▲	78,910 ▲	98,100 ▲

మిత్సుబిషి కోసం అజాద్ ఇంజనీరింగ్ తయారీ కేంద్రం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రెసిషన్ ఇంజినీరింగ్‌లో సుప్రసిద్ధమైన అజాద్ ఇంజనీరింగ్ కంపెనీ హైదరాబాద్‌లోని తునికిబొల్లారంలో మిత్సుబిషి హెవీ ఇండస్ట్రీస్ (ఎంహెచ్ఐ) కోసం లీన్ మాన్యుఫాక్చరింగ్ కేంద్రాన్ని ప్రారంభించింది. 7,200 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని ఎంహెచ్ఐ జీటీసీసీ బిజినెస్ డివిజ్ వైస్ ప్రెసిడెంట్ మసాహితో కటోకా, తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్, అజాద్ ఇంజనీరింగ్ చైర్మన్, సీఈఓ రాకేష్ చోప్దార్ ప్రారంభించారు. ఎంహెచ్ఐతో తాము దశాబ్ది కాలంగా సాగిస్తున్న ప్రయాణంలో ఇదొక మైలురాయి అని రాకేష్ చోప్దార్ అన్నారు. ప్రస్తుతం ఈ కేంద్రంలో 200 మంది వృత్తి నిపుణులు పని చేస్తున్నారంటూ సమీప భవిష్యత్తులో వీరి సంఖ్య మరెన్నో వందలకు పెరుగుతుందని చెప్పారు. ప్రపంచ తయారీ కేంద్రంగా భారతదేశానికి, ప్రత్యేకించి తెలంగాణకు పెరుగుతున్న ప్రాధాన్యతకు ఈ కేంద్రం ఏర్పాటు నిదర్శనమని జయేష్ రంజన్ అన్నారు.

నాలుగో రోజూ నష్టపోయిన సెన్సెక్స్

రూ.1.4 లక్షల కోట్లు హాంఫట్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ వరుసగా నాలుగో రోజు కూడా నష్టాల్లోనే ముగిసింది. నిస్తేజంగా సాగిన ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 72.56 పాయింట్ల నష్టంతో 74,029.76 వద్ద ముగియగా నిఫ్టీ 27.40 పాయింట్ల నష్టంతో 22,470.50 వద్ద ముగిసింది. దీంతో బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల షేర్ల మార్కెట్ క్యాప్ రూ.1.4 లక్షల కోట్లు దిగజారి రూ.392.84 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఒక దశలో 504.16 పాయింట్ల వరకు నష్టపోయి 73,598.16 పాయింట్ల ఇంట్రా డే కనిష్ఠ స్థాయిని తాకింది.

మ్యూచువల్ ఫండ్స్ జోరుకు బ్రేక్: ఫిబ్రవరి నెల కూడా దేశీయ మ్యూచువల్ ఫండ్ సంస్థలకు కలిసి రాలేదు. ఈ సంస్థలు నిర్వహించే ఈక్విటీ పథకాల్లోకి వచ్చే పెట్టుబడులు 26 శాతం తగ్గి రూ.29,303 కోట్లకు పడిపోయాయి. జనవరిలో నమోదైన రూ.39,688 కోట్లతో పోలిస్తే ఇది రూ.10,385 కోట్లు తక్కువ కాగా గత డిసెంబరులో వసూలైన రూ.41,156 కోట్లతో పోలిస్తే రూ.11,853 కోట్లు తక్కువ

కాగ్నిజెంట్ ఉద్యోగులకు బోనస్

న్యూఢిల్లీ: ఐటీ కంపెనీ కాగ్నిజెంట్ తన ఉద్యోగులకు బోనస్ ప్రకటించింది. అర్హులైన ఉద్యోగులకు 85 నుంచి 115 శాతం బోనస్ చెల్లించనున్నట్టు ఉద్యోగులకు లెటర్లు పంపించినట్టు సమాచారం. గత మూడేళ్లలో కంపెనీ ఇంత పెద్ద మొత్తంలో బోనస్ ప్రకటించడం ఇదే మొదటిసారి. ఈ నెల, వచ్చే నెల జీతాలతో కలిసి ఈ బోనస్‌ను కంపెనీ చెల్లించనుంది.

కోరమాండల్ చేతికి నాగార్జున అగ్రికెమ్

రూ.820 కోట్లకు 53% వాటా కొనుగోలు

త్వరలో 26 శాతం ఓపెన్ ఆఫర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే ఎన్ఏసీఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (గతంలో నాగార్జున అగ్రికెమ్) యాజమాన్యం చేతులు మారింది. మురుగప్ప గ్రూప్‌నకు చెందిన ఎరువుల కంపెనీ కోరమాండల్ ఇంటర్నేషనల్ రూ.820 కోట్లతో ఎన్ఏసీఎల్ ఈక్విటీలో 53.13 శాతం వాటా కొనుగోలు చేసింది. ఎన్ఏసీఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ప్రమోటర్ల నుంచి ఈ వాటాను ఒక్కో షేరు రూ.76.7 చొప్పున కొనుగోలు చేసినట్టు కోరమాండల్ ఇంటర్నేషనల్ బుధవారం రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. దీనికి సంబంధించిన ఒప్పందానికి కోరమాండల్ ఇంటర్నేషనల్ కంపెనీ డైరెక్టర్ల బోర్డు కూడా ఆమోదం తెలిపింది. దీంతో మరో 26 శాతం వాటా కొనుగోలు కోసం కంపెనీ త్వరలో ఓపెన్ ఆఫర్ ప్రకటించబోతోంది. ఎరువులు, పురుగు మందులు, సూక్ష్మ పోషకాల మార్కెట్‌లో తన స్థానాన్ని నాగార్జున అగ్రికెమ్ కొనుగోలు మరింత పటిష్ఠం చేస్తుందని మురుగప్ప గ్రూప్ భావిస్తోంది. నాగార్జున అగ్రికెమ్ తయారు చేసే యాక్టివ్ ఇంగ్రిడియంట్స్, కెమికల్ కాంపౌండ్స్‌ను వరి, మొక్కజొన్న, ఆలు పంటల క్రిమి సంహారక, కలుపు మందుల తయారీలో ఉపయోగిస్తారు. నాగార్జున అగ్రికెమ్ ఈక్విటీలో ప్రస్తుతం ప్రమోటర్లకు 63.65 శాతం వాటా ఉంది. ఎన్ఏసీఎల్ ఇండస్ట్రీస్‌కు ఏపీతో పాటు గుజరాత్‌లోనూ ఉత్పత్తి యూనిట్లు ఉన్నాయి. హైదరాబాద్‌లో పరిశోధన, అభివృద్ధి కేంద్రం ఉంది. ఈ అమ్మకంతో ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన నాగార్జున గ్రూప్ తన ప్రధాన వ్యాపారాల నుంచి దాదాపుగా వైదొలగినట్టయింది.

స్టార్‌లింక్‌తో జియో జట్టు

ఎయిర్‌టెల్ బాటలో అంబానీ కంపెనీ



న్యూఢిల్లీ: భారత్‌లో స్టార్‌లింక్ 'శాటిలైట్ ఆధారిత హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలందించేందుకు ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్‌తో భారత నం.1 ధనవంతుడు ముకేశ్ అంబానీకి చెందిన టెలికాం సంస్థ రిలయన్స్ జియో బుధవారం భాగస్వామ్యం కుదుర్చుకుంది. స్పేస్‌ఎక్స్ అనుబంధ విభాగమే స్టార్‌లింక్. కాగా, స్పేస్‌ఎక్స్‌తో భారతీ ఎయిర్‌టెల్ జట్టు కట్టిన మరుసటి రోజే రిలయన్స్ జియో కూడా ఇదే తరహా ఒప్పందం కుదుర్చుకోవడం గమనార్హం. భారత్‌లో సేవలందించేందుకు స్టార్‌లింక్‌కు ఇంకా అనుమతి లభించలేదు. ఇందుకు అవసరమైన లైసెన్సు పొందాక స్పేస్‌ఎక్స్‌తో భాగస్వామ్యం అమలవుతుందని జియో స్పష్టం చేసింది. ఈ భాగస్వామ్యం ద్వారా రిలయన్స్ జియో తన ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ రిటైల్ స్టోర్లలో స్టార్‌లింక్ డివైజ్‌లతోపాటు సేవలను ఆఫర్ చేయనుంది. అంతేకాదు, ఆ డివైజ్‌ల ఇన్‌స్టాలేషన్, యాక్టివేషన్ సేవలను సైతం అందించనుంది. జియో, స్పేస్‌ఎక్స్ కలిసి ఇరువురి సేవలకు పరస్పరం దోహదపడే మార్గాలను అన్వేషించనున్నాయి.

విరోధులు భాగస్వాములుగా..

తాజా భాగస్వామ్యాల ద్వారా బ్రాడ్‌బ్యాండ్ సేవల రంగంలో విరోధులు భాగస్వాములుగా మారారు. ఎందుకంటే, శాటిలైట్ ఇంటర్నెట్ సేవలకు అవసరమైన స్పెక్ట్రమ్‌ను వేలం వేయాలని జియో, ఎయిర్‌టెల్ డిమాండ్ చేయగా.. స్టార్‌లింక్ సహా ఇతర అంతర్జాతీయ సంస్థలు నేరుగా కేటాయింపులు జరపాలని కోరాయి. కాగా, అంతర్జాతీయంగా ప్రస్తుతం అనుసరిస్తున్న విధానానికి అనుగుణంగా శాటిలైట్ స్పెక్ట్రమ్‌ను నిర్దిష్ట ధరకు నేరుగా కేటాయించడం జరుగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ విషయంలో విరోధాన్ని పక్కన పెట్టి స్టార్‌లింక్‌తో ఎయిర్‌టెల్, జియో జట్టు కట్టడం విశేషం.

ఫీజుల కోసం ఒత్తిడి చేస్తే చర్యలు: లోకేశ్

అమరావతి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఫీజులు చెల్లించాలని ఏవైనా కాలేజీ యాజమాన్యాలు ఒత్తిడి చేస్తే తన దృష్టికి తీసుకురావాలని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ తల్లిదండ్రులకు సూచించారు. ఫీజుల బకాయిలు చెల్లించాలని కొన్ని కాలేజీలు విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయని కొందరు ఎమ్మెల్సీలు తన దృష్టికి తీసుకొచ్చారని, ఒత్తిడి చేసే యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ ఏడాది నుంచి ఉన్నత విద్య ఫీజులను నేరుగా కాలేజీల ఖాతాలకు జమ చేస్తున్నామని, ఇప్పటికే ఒక విడత రూ.788 కోట్లు విడుదల చేశామని బుధవారం ఓ ప్రకటనలో వివరించారు.

యువ పోరు పేరుతో వై'చీప్' పాలిట్రిక్స్

» సీడాప్ ఛైర్మన్ దీపక్ రెడ్డి, నాదెండ్ల బ్రహ్మం

అమరావతి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): 'వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు యువతకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టింది. ఇప్పుడు చీప్‌గా వ్యవహరిస్తూ యువ పోరు అంటూ వీధి నాటకాలకు తెర తీసింది' అని సీడాప్ ఛైర్మన్ దీపక్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మం ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. 'వైసీపీ యువ పోరులో విద్యార్థులు, యువత ఎవ్వరూ పాల్గొనలేదు. అంతా ఐ- ప్యాక్ టీం మనుషులే. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నివేదికలో జగన్ హయాంలో రాష్ట్రం నిరుద్యోగంలో నంబర్ 1 స్థానంలో ఉంది. వైసీపీ రాజకీయ నిరుద్యోగులు యువపోరు పేరుతో ఉపాధి వెతుక్కుంటున్నారు. 9 నెలల్లోనే లోకేశ్ విద్యారంగంలో తీసుకొచ్చిన సంస్కరణలు, ప్రక్షాళనపై మేం చర్చకు సిద్ధం' అని దీపక్‌రెడ్డి, బ్రహ్మం అన్నారు.

అది వైసీపీ ఉనికి పోరు: నిరుద్యోగ జేఏసీ

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పార్టీ మనుగడ కోసమే యువత పోరు పేరుతో వైసీపీ ధర్నాలు చేసిందని నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ సిద్ధిక్ విమర్శించారు. అది యువత పోరు కాదని, వైసీపీ ఉనికి పోరు అని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్నప్పుడు రూ.4,271 కోట్లు బకాయిలు పెట్టి విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిన వైసీపీ... మళ్లీ ఇప్పుడు ఫీజులపై ధర్నాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ అధికారంలో ఉండగా ఒక్క జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదని, ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయలేదని గుర్తుచేశారు. ఐదేళ్లలో ఒక్క ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వని వైసీపీ నేతలు చెప్పే మాటలను వినే పరిస్థితిలో యువత లేదని సిద్ధిక్ స్పష్టం చేశారు.

ప్రజలకు నాణ్యమైన మందులు అందాలి

» డ్రగ్స్ అధికారులకు మంత్రి సత్యకుమార్ ఆదేశాలు

అమరావతి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యానికి కీలకమైన మందుల నాణ్యత, సరఫరాపై నియంత్రణను పటిష్ఠం చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ సూచించారు. బుధవారం సచివాలయంలో డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంపై సమీక్ష నిర్వహించిన ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. తనిఖీల సంఖ్య, నాణ్యత తగ్గడంపై ప్రశ్నించిన ఆయన, వెంటనే తనిఖీలు పెంచాలని డ్రగ్ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. నాణ్యమైన రక్తం ప్రాధాన్యత దృష్ట్యా బ్లడ్ బ్యాంకులపై నిఘా ఉంచాలన్నారు. రాష్ట్రానికి ఏయే ప్రాంతాల నుంచి కల్తీ మందులు వస్తున్నాయో, ఎక్కడెక్కడ విక్రయిస్తున్నారో సమాచారాన్ని సేకరించే వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ కృష్ణబాబు, డీజీ రవిశుభాష్ పట్టన్‌శెట్టి పాల్గొన్నారు.

మొక్కజొన్నకు నిరంతర డిమాండ్: అగ్రి డైరెక్టర్ డిల్లీరావు

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): దేశీయ ఆహార అవసరాలతో పాటు పెరుగుతున్న మార్కెట్ డిమాండ్‌తో మొక్కజొన్న పంటకు ఎగుమతికి అవకాశాలున్నాయని వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు చెప్పారు. బుధవారం విజయవాడలో మొక్కజొన్న పంట దిగుబడుల పెంపుదల, సాగులో సమస్యలపై సాంకేతిక ఆవిష్కరణలు అనే అంశంపై వర్క్‌షాప్ జరిగింది. ఇందులో డిల్లీరావు మాట్లాడుతూ బయో ఇంధనాల జాతీయ విధానాన్ని అనుసరించి, వాహన రంగంలో వాడే పెట్రోల్‌లో 20% ఇథనాల్ కలపాలన్న కేంద్రం ఆదేశాల వల్ల ఇథనాల్ ముడి సరుకుగా వాడే మొక్కజొన్నకు డిమాండ్ పెరిగిందని చెప్పారు. ఆచార్య ఎన్జీ రంగా వర్సిటీ పరిశోధన డైరెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ మొక్కజొన్న సాగులో గుంటూరు జిల్లా ఉత్పాదకతలో హెక్టారుకు 12 టన్నులు సాధించి, దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని చెప్పారు.



జయకేతనం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి నాదెండ్ల, నాయకులు



పిఠాపురం మండలం చిత్రాడ శివారులో చురుగ్గా జనసేన ఆవిర్భావ సభ ఏర్పాట్లు

జనసేన జయకేతనం

రేపు ఆవిర్భావ సభ

» 100% స్ట్రైక్ రేట్ ఉత్సవం

» ప్రవేశ ద్వారాలకు మహనీయుల పేర్లు

» ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వారికి ప్రత్యేక ఏర్పాట్లు

» సభ పోస్టరు ఆవిష్కరించిన మంత్రి నాదెండ్ల మనోహర్

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 12(ఆంధ్రజ్యోతి): 'జనసేన పార్టీ 2024 సార్వత్రిక ఎన్నికల్లో సాధించిన 100 శాతం స్ట్రైక్ రేట్‌ను ఒక ఉత్సవంగా జరుపుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం' అని పార్టీ పీఏసీ ఛైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచన మేరకు సభకు 'జయకేతనం'గా నామకరణం చేసినట్లు చెప్పారు. ఈనెల 14న జరగనున్న సభను పురస్కరించుకుని కాకినాడలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. బుధవారం అక్కడ మంత్రి నాదెండ్ల జయకేతనం పోస్టర్లను ఆవిష్కరించి, మాట్లాడారు. 'సభా స్థలానికి వెళ్లే మూడు ప్రవేశ ద్వారాలకు ఈ ప్రాంతానికి ఎంతో పేరు తెచ్చిన ముగ్గురు గొప్ప వ్యక్తుల పేర్లు పెట్టుకొని వారిని గౌరవించుకుంటున్నాం. మొదటి ద్వారానికి పిఠాపురం రాజాగా ఎన్నో విద్యాలయాలకు స్థలాలు దానం చేసి, నిధులు ఇచ్చి, ఈ ప్రాంతంలో ఎంతోమందికి అక్షర కాంతులను పంచిన పిఠాపురం రాజు శ్రీరాజా సూర్యారావు బహదూర్ పేరును పెట్టాం. రెండో ప్రవేశ ద్వారానికి విద్యాసంస్థలకు, ధార్మిక, సేవా కార్యక్రమాలకు తన సంపాదన దానం ఇచ్చిన మల్లాడి సత్యలింగం నాయకర్ పేరును, అపర అన్నపూర్ణగా పేరుగాంచిన డొక్కా సీతమ్మ పేరును మూడో ద్వారానికి పెట్టాలని పవన్ కల్యాణ్ సూచించారు. ఆవిర్భావ సభ అద్భుతంగా జరిగేలా ఇప్పటికే పార్టీ నాయకులతో వివిధ కమిటీలను ఏర్పాటు చేసిన ప్రణాళిక బద్ధంగా పనిచేస్తున్నాం. ఆంధ్రప్రదేశ్ నుంచి కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్దఎత్తున కార్యకర్తలు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు' అని తెలిపారు. శాసనమండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ... 'పార్టీ ఆవిర్భావ సభకు మీడియాకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రత్యేక గ్యాలరీతోపాటు వారి విధులకు అవసరమైన సాంకేతిక సదుపాయాలు కల్పిస్తున్నాం' అని మంత్రి మనోహర్ అన్నారు.

ఆవిర్భావ సభకు విస్తృత ఏర్పాట్లు

కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడలో జనసేన ఆవిర్భావ సభకు ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. సభావేదిక, గ్యాలరీ నిర్మాణం, లైటింగ్, జనరేటర్ల ఏర్పాటు వంటి పనులు జరుగుతున్నాయి. సభ జరిగే మొత్తం 24 ఎకరాల్లో ఒక ఎకరం విస్తీర్ణంలో సభావేదిక నిర్మిస్తున్నారు. 12-14 ఎకరాల విస్తీర్ణంలో 2 లక్షల మంది కూర్చొనేలా ఏడు గ్యాలరీలను ఏర్పాటు చేస్తున్నారు. వేదికపై 250 మంది వరకూ కూర్చొనే అవకాశం కల్పిస్తారు. సభకు తరలి వచ్చే జనసైనికులు, వీరమహిళలకు నిరంతరాయంగా తాగునీరు, పండ్లు, మజ్జిగ అందజేసేందుకు స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. సభకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చే వారి కోసం ప్రధాన రహదారుల్లో మధ్యాహ్నం, రాత్రి భోజనాలు అందించే ఏర్పాట్లు చేస్తున్నారు.

క్యూఎస్ వరల్డ్ వర్సిటీ ర్యాంకింగ్స్‌లో 'వీఐటీ'కి చోటు

చెన్నై, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్-2025లో వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) స్థానం దక్కించుకుంది. 14 పాఠ్యాంశాల బోధనలో అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాల సరసన నిలిచింది. డేటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పాఠ్యాంశాలకు సంబంధించి.. ఏకంగా ప్రపంచంలోని టాప్-100 వర్సిటీల జాబితాలో చోటు దక్కించుకుంది. అంతర్జాతీయ విద్యావిశ్లేషకుడు క్వాక్వారెల్లి సైమండ్స్ బుధవారం ఈ జాబితాను విడుదల చేశారు. ప్రపంచ వ్యాప్తంగా 1700 విశ్వవిద్యాలయాల్లో 55 రకాల పాఠ్యాంశాలపై సమగ్ర విశ్లేషణ చేపట్టి క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్-2025 ఎడిషన్‌ను రూపొందించారు. ఈ విశ్లేషణాత్మక అధ్యయనంలో వీఐటీ విశేష ప్రతిభను ప్రదర్శించింది. 4 పాఠ్యాంశాల ర్యాంకులను మెరుగుపర్చుకోవడంతోపాటు మరో 8 పాఠ్యాంశాల ర్యాంకులను యథాతథంగా కాపాడుకోగలిగింది. మరో రెండు పాఠ్యాంశాలు తొలి సారి ర్యాంకింగ్ జాబితాలో చోటు సంపాదించుకున్నాయి. విద్య, పరిశోధన నైపుణ్యాలకు వీఐటీ పెద్దపీట వేస్తుందనడానికి ఈ ర్యాంకులే ఉదాహరణ అని నిర్వాహకులు తెలిపారు.

వీఐటీలో బోధిస్తున్న పాఠ్యాంశాలకు దక్కిన పాయింట్లు

ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ: 142, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్:110, డేటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్: 51- 100, ఇంజనీరింగ్ - ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్:151-200, ఇంజనీరింగ్- మెకానికల్, ఏరోనాటికల్ అండ్ మానుఫ్యాక్చరింగ్: 201-250, ఇంజనీరింగ్ - కెమికల్: 251 - 300, న్యాచురల్ సైన్సెస్: 362, మెటీరియల్ సైన్స్: 151-200, మ్యాథమెటిక్స్: 201-250, స్టాటిస్టిక్స్ అండ్ ఆపరేషనల్ రీసెర్చ్: 251-275, కెమిస్ట్రీ: 301-350, ఫిజిక్స్ అండ్ ఆస్ట్రానమీ: 401-450, ఎన్విరాన్‌మెంట్ సైన్సెస్: 451-500, బయోలాజికల్ సైన్సెస్: 351-400, అగ్రికల్చరర్ అండ్ ఫారెస్ట్రీ: 351-400, బిజినెస్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్: 551-600

చప్పగా 'యువత పోరు'!

» జిల్లాకేంద్రాల్లో కనిపించని విద్యార్థులు, యువత

» ఎక్కడికక్కడ తూతూమంత్రంగా నిరసనలు

» కూటమి ప్రభుత్వం వర్ధిల్లాలన్న విశాఖ కార్యకర్తలు!

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయాలని కోరుతూ వైసీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 'యువత పోరు' నిరసన కార్యక్రమం చప్పగా సాగింది. ఈ నిరసనల్లో ఎక్కడా విద్యార్థులు కనిపించలేదు. నిరుద్యోగ భృతి డిమాండ్‌ను లేవనెత్తినప్పటికీ యువత కూడా దూరంగానే ఉంది. వైసీపీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర స్థానిక నాయకులు మాత్రమే నిరసనల్లో పాల్గొన్నారు. తొలుత ఫీజు పోరు పేరిట బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టి, జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించాలని నిర్ణయించారు. అయితే రైతు పోరు, విద్యుత్తు పోరు వరుసగా విఫలం కావడంతో ఐప్యాక్ బృందం డిజైన్ చేసిన ఈ నిరసన కార్యక్రమాన్ని 'యువత పోరు'గా వైసీపీ మార్చేసింది. జిల్లా కేంద్రాల్లో చేపట్టిన ఈ కార్యక్రమానికి ఎక్కడా వెయ్యి మందికి మించి కనిపించలేదు. కలెక్టరేట్లకు చేరుకునేసరికి సగం మంది కూడా లేరు. అమరావతిలో చేపట్టిన 'యువత పోరు'లో వైసీపీ అధ్యక్షుడు జగన్ పాల్గొనలేదు. విద్యార్థులు, నిరుద్యోగ యువత పట్ల చిత్తశుద్ధి ఉంటే నిరసనల్లో జగన్ ఎందుకు పాల్గొనలేదని రాజకీయ పక్షాలు నిలదీస్తున్నాయి. ఇక ఈ నిరసనలకు వైసీపీ ఎమ్మెల్సీలు దూరంగా ఉన్నారు. అయితే బుధవారం యువత పోరుకు జిల్లా కేంద్రాల్లో సగటున 500 నుంచి 1,000 వంది దాకా వచ్చారంటూ జగన్‌సహా నేతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలాఉండగా, విశాఖపట్నం కలెక్టరేట్ వద్ద నిరసనలో.. 'కూటమి ప్రభుత్వం వర్ధిల్లాలి' అంటూ కార్యకర్తలు నినాదాలు చేయడంతో వైసీపీ నాయకులు అవాక్కయ్యారు.

చంద్రబాబూ... ఇది తొలి హెచ్చరిక: జగన్

విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, నిరుద్యోగుల తరపున వైసీపీ తలపెట్టిన 'యువత పోరు' కార్యక్రమం చంద్రబాబు ప్రభుత్వానికి తొలి హెచ్చరికగా వైసీపీ అధ్యక్షుడు జగన్ పేర్కొన్నారు. పేద విద్యార్థులను చదువుకు దూరం చేసేందుకు చంద్రబాబు చేస్తున్న కుట్రను ఖండిస్తున్నామన్నారు. 2024లో ప్రతి త్రైమాసికానికిరూ.700 కోట్ల చొప్పున నాలుగు విడతల్లో రూ.2,800కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. అధికారంలోకి వస్తే 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, లేదా అప్పటివరకూ నిరుద్యోగ భృతిగా నెలకు రూ.3వేలు ఇస్తామన్నారని, దీనిని అమలు చేయాలని జగన్ డిమాండ్ చేశారు.



యువత కాదు వృద్ధుల పోరు..

మార్కాపురం: ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం వైసీపీ చేపట్టిన యువతపోరులో యువకులు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు వద్ద వైసీపీ వృద్ధ నేతలను సమీకరించి 'యువత పోరు' వాల్‌పోస్టర్‌ను ప్రదర్శించడం విశేషం.

చిత్రజ్యోతి

SINCE 1965

విభిన్న కోణాలను స్పృశిస్తుంది



రామ్‌జగదీష్

నూతన దర్శకుడు రామ్‌జగదీష్ తెరకెక్కించిన చిత్రం 'కోర్ట్'. ప్రియదర్శి కథానాయకుడిగా నటించారు. హీరో నాని సమర్పణలో ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా దర్శకుడు రామ్ మీడియాతో ముచ్చటించారు.

"నా జీవితంలో చూసిన ఓ కేసు తాలూకా విషయాలు నన్ను ఆశ్చర్యానికి గురిచేశాయి. ఆ ఇతివృత్తంతో సినిమా చేస్తే బాగుంటుందనిపించింది. అలా, వాస్తవ సంఘటనలకు కొంత కల్పన జోడించి ఈ సినిమా కథను తయారుచేశాను. పోక్సో యాక్ట్ నేపథ్యంలో ఉంటుంది. నానికి ఈ కథను చెప్పడం కోసం ఎనిమిది నెలలు ఎదురుచూశాను. ఆయన సింగిల్ సిట్టింగ్‌లో ఓకే చేశారు. ఇది లవ్ స్టోరీతో కూడిన కోర్ట్ రూమ్ డ్రామా. ఇందులో ప్రియదర్శి పోషించిన లాయర్ పాత్ర చాలా విభిన్నంగా ఉంటుంది. ఆయన కెరీర్‌లో గొప్ప పాత్రగా నిలిచిపోతుంది. రోషన్, శ్రీదేవి తమ పాత్రలకు న్యాయం చేశారు. ఈ సినిమా మన జీవితాల్లోని పలు కోణాల్ని టచ్ చేస్తుంది. ఫైనల్ అవుట్‌పుట్ చూసిన నాని సినిమా చాలా బాగుందని మెచ్చుకున్నారు" అని చెప్పారు.

మీరు గర్వించే సినిమాలు చేస్తా

కిరణ్ అబ్బవరం



కిరణ్ అబ్బవరం, రుక్సర్ థిల్లాన్ జంటగా నటించిన చిత్రం 'దిల్‌రుబా'. విశ్వకరుణ్ దర్శకత్వంలో రవి, జోజో జోస్, రాకేష్‌రెడ్డి... సారెగమ సంస్థతో కలసి నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా యూనిట్ ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ "మీరు నాపై చూపే అభిమానానికి రుణపడి ఉంటాను. ఇకపై మీ అందరూ గర్వపడే సినిమాలు చేస్తానని మాటిస్తున్నా. ఇండస్ట్రీలో నిలదొక్కుకోవాలనుకునే ఔత్సాహికులకు నా వంతు సాయం చేస్తా. ఈ సినిమా విజయంపై చాలా నమ్మకంతో ఉన్నాం. ఈ ఏడాది 'హోలీ'ని థియేటర్స్‌లో సెలబ్రేట్ చేసుకుందాం. సినిమా ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుంది. ఇదో క్లీన్ కమర్షియల్ సినిమా. సినిమా ఏ స్థాయి విజయం సాధిస్తుందో ఇప్పుడే చెప్పలేను కానీ మీరు కోరుకున్న వినోదం అయితే కచ్చితంగా ఉంటుంది" అని చెప్పారు. "ఈ సినిమాలోని ప్రతీ అంశం మీ అందర్నీ అలరిస్తుంది. విజయంపై పూర్తి నమ్మకం ఉంది" అని విశ్వకరుణ్ అన్నారు. "ఈ సినిమాలో అంజలి అనే పాత్రలో నటించా. ఇలాంటి విభిన్న షేడ్స్ ఉన్న రోల్ దొరకడం నా అదృష్టం" అని హీరోయిన్ రుక్సర్ థిల్లాన్ తెలిపారు. "ఈ సినిమాతో టీమ్ అందరికీ సక్సెస్ పక్కా" అని చిత్రనిర్మాత రాకేష్ రెడ్డి అన్నారు.



ఆద్యంతం ఉత్కంఠభరితం


రుషికిరణ్, శివయాదవ్, శ్వేత, రూప ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సస్పెక్ట్'. రాధాకృష్ణ దర్శకత్వంలో కిరణ్‌కుమార్ నిర్మించారు. ఈ నెల 21న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో దర్శకుడు మాట్లాడుతూ "ఓ అమ్మాయి హత్య చుట్టూ సాగే కథ ఇది. హంతకులు ఎవరు?, వారిని పట్టుకొనేందుకు పోలీసులు చేసిన ప్రయత్నాల నేపథ్యంలో సినిమా ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది" అని చెప్పారు. "ఈ సినిమా మా అందరికీ మంచి పేరు తెస్తుందనే నమ్మకం ఉంది" అని చిత్రనిర్మాత కిరణ్‌కుమార్ చెప్పారు. ఈ చిత్రానికి డీఓపీ: రాఘవేంద్ర, సంగీతం: ప్రజ్వల్ క్రిష్

ఏప్రిల్‌లో గద్దర్ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవం



దిల్‌రాజు

వచ్చే నెలలో గద్దర్ తెలంగాణఫిల్మ్ అవార్డులను ప్రదానం చేయనున్నట్టు రాష్ట్ర చలన చిత్ర పరిశ్రమాభివృద్ధి సంస్థ ఛైర్మన్ దిల్‌రాజు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం 2014నుంచి 2023 వరకు పదేళ్ల కాలంలో వచ్చిన చిత్రాలలో ప్రతి ఏడాది ఒక ఉత్తమ సినిమా ఎంపిక చేసి అవార్డులు ప్రదానం చేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు. బుధవారం మాసాబ్‌టాంక్‌లోని సంస్థ కార్యాలయంలో దిల్‌రాజు విలేకరులతో మాట్లాడుతూ ఉర్దూలో వచ్చిన సినిమాలకు ప్రత్యేకంగా 'ఉత్తమ సినిమాఉర్దూ' అవార్డు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రముఖ సినీ దర్శకులు బి.నర్సింగ్ రావు అధ్యక్షతన రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసిన విధి విధానాల రూపకల్పన కమిటీ సిఫారసుల మేరకు గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో నంది అవార్డుల తరహాలోనే సినీ రంగంలోని వివిధ విభాగాల్లో ప్రతిభావంతులకు అవార్డులు ప్రదానం చేయనున్నట్టు వివరించారు. గత ప్రభుత్వం సింహా పేరుతో ఫిల్మ్ అవార్డులు ప్రదానం చేయనున్నట్టు ప్రకటించడంతో పలువురు చలనచిత్ర పరిశ్రామిభివృద్ధి సంస్థకు దరఖాస్తులతో పాటు కట్టిన డబ్బులను తిరిగి వాపస్ ఇవ్వనున్నట్టు దిల్‌రాజు పేర్కొన్నారు. 2024లో తెలుగు చలన చిత్ర పరిశ్రమ రంగంలో వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డులను ఇవ్వనున్నట్లు వివరించారు. దరఖాస్తులు అందిన తర్వాత గద్దర్ అవార్డ్స్ కోసం ఏర్పాటైన జ్యూరీ కమిటీ ఒక వారం రోజుల్లో అవార్డు విజేతలను ఖరారు చేస్తుందన్నారు. డాక్టర్ ఎం.ప్రభాకర్‌రెడ్డి పేరిట ఉత్తమ ప్రజాదరణ చిత్రానికి అవార్డు ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. అలాగే పైడిజయరాజు,కాంతారావుల పేరిట ప్రత్యేక అవార్డులు అందించనున్నట్టు తెలిపారు.



స్పీకర్ చాంబర్‌కు సీఎం

- ఎమ్మెల్యేల క్రీడలు, సభా కార్యక్రమాలపై చర్చ

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ప్రాంగణంలోని స్పీకర్ అయ్యన్న పాత్రుడు చాంబర్‌కు సీఎం చంద్రబాబు వెళ్లారు. బుధవారం మధ్యాహ్నం శాసనసభలో ప్రసంగించిన అనంతరం చంద్రబాబు స్పీకర్ చాంబర్‌కు వెళ్లి సుమారు 15 నిమిషాలపాటు వివిధ అంశాలపై చర్చించారు. సభా కార్యక్రమాలకు సంబంధించిన అంశాలు, ఎమ్మెల్యేలకు క్రీడలు, సాంస్కృతిక పోటీలకు సంబంధించిన అంశాలు చర్చకు వచ్చాయి. కొత్త ఎమ్మెల్యేలకు శిక్షణ తరగతులను ఈ సెషన్‌లో నిర్వహించలేకపోయామని, ఈసారి తప్పకుండా శిక్షణ తరగతులు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించాలని సీఎం సూచించారు. ఈ భేటీలో శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

మండలిలో వైసీపీ రచ్చ!

పోడియంపైకి ఎక్కి.. చైర్మన్ చుట్టూ మోహరింపు

- 3 సార్లు వాయిదావేసినా అదే పరిస్థితి
- నిరసనల నడుమే సభ కొనసాగింపు
- వైసీపీ సభ్యుల వాకౌట్


పోడియం వద్ద నినాదాలు చేస్తున్న వైసీపీ ఎమ్మెల్సీలు, మోహరించిన మార్షల్స్

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): శాసన మండలిలో వైసీపీ సభ్యులు రభస సృష్టించారు. పోడియంపైకి ఎక్కి.. చైర్మన్ చుట్టూ చేరి అరుపులు, నినాదాలతో గందరగోళం సృష్టించారు. తమ తమ స్థానాల్లోకి వెళ్లి నిరసన తెలుపాలని చైర్మన్ సూచించినా వినిపించుకోలేదు. దీంతో ఆయన మార్షల్స్‌ను సభలోకి పిలవాల్సి వచ్చింది. నిరసనలు, నినాదాల నడుమే సభను కొనసాగించారు. దీంతో వైసీపీ ఎమ్మెల్సీలు వాకౌట్ చేశారు. బుధవారం ఉదయం 10 గంటలకు మండలి సమావేశాలు ప్రారంభం కాగానే.. వైసీపీ ఎమ్మెల్సీలు మొండితోక అరుణ్‌కుమార్, రమేశ్ యాదవ్, తోమాటి మాధవరావు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని తిరస్కరించినట్లు చైర్మన్ మోషేన్‌రాజు ప్రకటించారు. ఆ వెంటనే ప్రశ్నోత్తరాలను చేపట్టారు. అయితే నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశాలపై ఇచ్చిన వాయిదా తీర్మానంపై చర్చించాలని డిమాండ్ చేస్తూ వైసీపీ ఎమ్మెల్సీలు ప్లకార్డులను ప్రదర్శిస్తూ.. 'వియ్ వాంట్ జస్టిస్..', 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ..' అంటూ నినాదాలు సాగించారు. గందరగోళ పరిస్థితుల నడుమే చైర్మన్ ప్రశ్నోత్తరాలను కొనసాగించారు. ఈ సందర్భంగా విద్యామంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. 'ఈరోజు మండలి సమావేశాల్లో లఘు చర్చ ఉంది. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యోగాలు, ఉపాధి కల్పనపై చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. గత ప్రభుత్వం పెట్టిన రూ.4,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను మేం చెల్లిస్తున్నాం. దీంతో 'ఫీజు పోరు' అనే పేరుతో ఆందోళన తలపెట్టిన వైసీపీ.. తర్వాత 'యువత పోరు' అని మార్చుకోవడంతో జనం నవ్వుకుంటున్నారు. వైసీపీ ఎమ్మెల్సీలు సభలో దేనికోసం పోరాడుతున్నారో క్లారిటీ ఉంటే బాగుంటుంది' అని అన్నారు. చైర్మన్ ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా వైసీపీ సభ్యులు వినిపించుకోకుండా నినాదాలు కొనసాగిస్తూ కార్యకలాపాలను అడ్డుకోవడంతో 10.15కి సభను వాయిదా వేశారు. దాదాపు 20 నిమిషాల తర్వాత తిరిగి ప్రారంభం కాగానే.. బొత్స తప్ప మిగిలిన వైసీపీ ఎమ్మెల్సీలందరూ పోడియం వద్దకు వెళ్లారు. బిగ్గరగా నినాదాలు చేస్తూ.. పోడియంను చేతులతో గట్టిగా కొడుతూ పెద్దపెద్దగా శబ్దాలు చేయడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. దీంతో 10.44కి రెండోసారి సభ వాయిదాపడింది. గంట తర్వాత 11.40కి మళ్లీ మొదలైంది. వైసీపీ ఎమ్మెల్సీలు తిరిగి నిరసన ప్రారంభించారు. వారిలో కొందరు పోడియంపైకి వెళ్లి చైర్మన్‌ను చుట్టుముట్టి బిగ్గరగా అరుస్తూ.. కేకలు వేస్తూ నానా రభస చేశారు. వారి తీరుపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కాసేపటికే 11.47కి మూడోసారి సభను వాయిదా వేశారు. అనంతరం సుమారు 30 మంది మార్షల్స్ మండలి సమావేశ హాలులోకి వచ్చారు. పోడియంపైకి ఎవరూ వెళ్లకుండా ముందు రక్షణ గోడలా నిలబడ్డారు. 20 నిమిషాల తర్వాత సభ కార్యకలాపాలు తిరిగి మొదలయ్యాయి. యథావిధిగా వైసీపీ ఎమ్మెల్సీలు అరుపులతో పోడియం వద్దకు రావడంతో అప్పటికే సిద్ధంగా ఉన్న మార్షల్స్ వారిని నిలువరించారు. వైసీపీ ఎమ్మెల్సీలు వారిని తోసుకుంటూ ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించడంతో ఉద్రిక్తత నెలకొంది. సభలోకి మార్షల్స్‌ను రప్పించడంపై బొత్స తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 'ఇది దుష్ట సంప్రదాయం. ఇంతమంది మార్షల్స్‌ను పెట్టి ఈ రకంగా సభను నడపడం ఎప్పుడూ చూడలేదు. మేమేమైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నామా? చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటున్నామా? మార్షల్స్‌ను బయటకు పంపించాలి' అని డిమాండ్ చేశారు. చైర్మన్ సమాధానమిస్తూ.. 'సభలో సభ్యులకు నిరసన తెలిపే హక్కుంది. అయితే మీకు కేటాయించిన స్థానాల్లో ఉండి ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపితే ఈ పరిస్థితి రాదు. ప్రతిపక్ష నాయకుడిగా మీరు చెప్పింది పరిగణనలోకి తీసుకుంటాం. మీకు గౌరవంగా కేటాయించిన స్థానాలున్నాయి. అక్కడి నుంచి కూర్చునో, లేదంటే నిలబడో నిరసన తెలిపితే అభ్యంతరం లేదు. అలాకాకుండా పోడియంపైకి వచ్చి నిరసన తెలుపుతామంటే మాత్రం అనుమతించేది లేదు. సభలో నుంచి మార్షల్స్‌ను పంపించేస్తాం. కచ్చితంగా మాకు సభను నడిపించుకోవలసిన అవసరం ఉంది. మాకుండే పద్ధతుల్లో మేం నడిపించుకుంటాం' అని స్పష్టం చేశారు. బొత్స స్పందిస్తూ.. 'ఈ దుష్ట చర్యలతోనే సభను నడిపిస్తామంటే కానివ్వండి చూద్దాం.. ప్రజలే తేలుస్తారు' అని అన్నారు. వైసీపీ సభ్యుల నిరసనల నడుమే చైర్మన్ సభను కొనసాగించారు. కొంతసేపటి తర్వాత బొత్స మళ్లీ మాట్లాడుతూ.. నియంతృత్వ ధోరణికి నిరసన తెలుపుతూ సభ నుంచి వాకౌట్ చేస్తున్నామని చెప్పి బయటకు వెళ్లిపోయారు. మిగిలిన వైసీపీ ఎమ్మెల్సీలూ ఆయన్ను అనుసరించారు. ఆ తర్వాత సభ కార్యకలాపాలు సజావుగా సాగాయి.

పయ్యావుల-బొత్స మాటకు మాట

నిరసనల నడుమ మండలిలో ఆర్థిక, శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్, విపక్ష నేత బొత్స సత్యనారాయణ మధ్య ఆసక్తికరమైన సంవాదం జరిగింది.

పయ్యావుల: సభలో ఎప్పుడూ మార్షల్స్‌ను చూడలేదని బొత్స అంటున్నారు. ఆయనకు షార్ట్ టర్మ్ మెమొరీ లాస్ ఏమైనా వచ్చిందేమో! గత వైసీపీ ప్రభుత్వంలో మార్షల్స్‌ను ఎలా ఉపయోగించారనేది ఎలా మరచిపోయారో అర్థం కావడం లేదు. ఆయన ఒకసారి మెమొరీని రిఫ్రెష్ చేసుకుంటే బెటర్. పెద్దల సభ చైర్మన్‌గా మిమ్మల్ని (మోషేన్‌రాజు) ఎంత చికాకు పెట్టినా.. ఇబ్బంది పెట్టినా సభ్యులను ఒక్క మాట కూడా అనకుండా సభను గౌరవంగా నడిపించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఆ గౌరవాన్ని వాళ్లు కాపాడుకోలేనప్పుడు మీ నిర్ణయం సరైందే.





బొత్స: 'గత ప్రభుత్వంలో ఈ సభలో పయ్యావుల కేశవ్ లేరు. మిగిలిన టీడీపీ సభ్యుల ప్రవర్తన, వాడిన భాష ఏవిధంగా ఉందో.. ఇప్పుడు మా భాష, ప్రవర్తన ఏ విధంగా ఉన్నాయో బేరీజు వేసుకుంటే తెలుస్తుంది

పయ్యావుల: వీళ్ల మంత్రులుగా ఉండి ఆనాటి సభాపతి మీద ఏం చేశారో గుర్తు తెచ్చుకుంటే మంచిది. ప్రతిపక్ష నేతగా ఉన్న బొత్స.. నాటి సభాపతిపై ఏ రకమైన భాష ఉపయోగించారు? ఆయన ఇప్పటికైనా పశ్చాత్తాపాన్ని సభలో ప్రకటిస్తారా.. లేదా?

9 నెలలైనా డీఎస్సీ ఏదీ: బొత్స

వాకౌట్ చేసిన అనంతరం బొత్స మీడియాతో మాట్లాడారు. యువత, విద్యార్థులు, నిరుద్యోగులను ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి 9నెలలు దాటినా డీఎస్సీ నిర్వహించలేదన్నారు. ఫీజు బకాయిలన్నీ జగన్ విడుదల చేసేశారని.. బకాయిలు ఎక్కడున్నాయో దమ్ముంటే చూపించాలన్నారు. ఏటా 4లక్షల ఉద్యోగాలన్న సీఎం.. జాబ్ కేలెండర్ ఎప్పుడిస్తారో చెప్పడం లేదని.. నిరుద్యోగ భృతిపై స్పష్టత లేదని.. గ్రూపు-2 అభ్యర్థులను మోసం చేశారని.. ఇది అసమర్థ ప్రభుత్వమని తేలిపోయిందని ధ్వజమెత్తారు.

కాశినాయన ఆశ్రమం కూల్చివేత దుర్మార్గం

- లక్షలాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతీశారు
- రాష్ట్ర ప్రభుత్వ ఖర్చుతో పునర్నిర్మించాలి
- అసెంబ్లీలో కూటమి ఎమ్మెల్యేల డిమాండ్
- సమస్య పరిష్కారమవుతుంది: ఆనం
- సొంత ఖర్చుతో నిర్మించేందుకు లోకేశ్ సంసిద్ధత



అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పేదవాడి ఆకలి తీర్చే క్షేత్రం.. కాశినాయన ఆశ్రమాన్ని కూల్చడం దుర్మార్గమైన చర్యగా కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. కుల, మత, జాతి తేడాల్లేకుండా ఆశ్రమానికి వచ్చిన ప్రతి ఒక్కరి ఆకలి తీర్చే ప్రాంతాన్ని అటవీ శాఖ అధికారులు ఖాళీ చేయించడం సరికాదన్నారు. కడప జిల్లా బద్వేలు సమీపంలోని నల్లమల అడవుల్లో ప్రతి రోజూ వేలాది మంది ఆకలి తీర్చే అవధూత కాశినాయన ఆశ్రమాన్ని ఇటీవల అటవీ శాఖ అధికారులు కూల్చేశారు. ఆశ్రమాన్ని కూల్చివేయడం రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో పెద్ద దుమారమే రేపింది. బుధవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో గౌరు చరిత (పాణ్యం-టీడీపీ), ఆదినారాయణ రెడ్డి (జమ్మలమడుగు-బీజేపీ) ఈ అంశాన్ని లేవనెత్తారు. బాధ్యులపై చర్య తీసుకోవాలని, కూల్చిన ఆశ్రమాన్ని అక్కడే రాష్ట్ర ప్రభుత్వ ఖర్చుతో నిర్మించాలని డిమాండ్ చేశారు. దేవదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పందిస్తూ.. లక్షలాది మందికి నిరంతరాయంగా అన్నం పెట్టి ఆకలి తీర్చే కాశినాయన ఆశ్రమం కూల్చివేత దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. ఇటీవల శ్రీశైలంలో స్వామి వారికి వస్త్రాలు సమర్పించేందుకు దేవదాయ మంత్రి హోదాలో వెళ్లిన తనను.. అక్కడి అటవీ ప్రాంతంలోని ఇష్టకామేశ్వరీ దేవి దర్శనానికి వెళ్లకుండా అటవీ శాఖ అధికారులు అడ్డుచెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పటి సాధారణ అడవులు ఇప్పుడు రిజర్వ్ ఫారెస్ట్, పులుల అభయారణ్యంగా మారడంతో ఇలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అటవీశాఖ ఆదేశాల మేరకే నల్లమల అటవీ ప్రాంతంలోని ఆశ్రమాన్ని కూల్చేసినట్లు అటవీ శాఖ అధికారులు చెబుతున్నారని.. ఈ విషయమై కేంద్ర అటవీ-పర్యావరణ మంత్రి భూపేంద్ర యాదవ్‌తో ఆరోగ్య మంత్రి సత్యకుమార్ ద్వారా మాట్లాడామని.. సమస్య పరిష్కారమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా.. కూల్చివేసిన ఆశ్రమ నిర్మాణాలను తన సొంత ఖర్చుతో నిర్మించేందుకు విద్యా మంత్రి లోకేశ్ సంసిద్ధత వ్యక్తం చేసినట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి.

98% రెవెన్యూ ఫిర్యాదులు పరిష్కారం..



రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలు 98 శాతం వరకూ పరిష్కారమయ్యాయని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రీసర్వేలో భాగంగా 6,685 గ్రామాల నుంచి 2.74 లక్షల ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. భూమార్పిడి-రిజిస్ట్రేషన్లలో సమస్యలపై టీడీపీ ఎమ్మెల్యేలు అదితి గజపతిరాజు, బండారు శ్రావణిశ్రీ, మిరియాల శిరీషాదేవి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. భూ సర్వే పక్కాగా జరుగుతోందని, రైతులు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి భూమి సరిహద్దులు, వివరాలు సులభంగా తెలుసుకోవచ్చన్నారు. అయితే రెవెన్యూ సమస్యలపై సభలో ఇప్పటికే సమాధానాలు చెప్పిన వాటి గురించే సభ్యులు మళ్లీ మళ్లీ అడుగుతున్నారని ఆయన అన్నారు.

తలసేమియాకు ఆరోగ్యశ్రీ..: మంత్రి



తలసేమియాతో బాధపడుతున్నవారికి నెలకు రూ.25వేల ఆదాయం ఉంటే ప్రభుత్వ సాయం (పెన్షన్) వర్తించడం లేదని, రూ.15వేలలోపు ఆదాయం ఉన్నవారికే ఇస్తున్నారని బీజేపీ సభ్యుడు విష్ణుకుమార్‌రాజు జీరో అవర్‌లో ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. నిరంతర చికిత్స, మందుల ఖర్చు ఆ కుటుంబాలకు భారంగా మారిందని, సర్కారు ఆదుకోవాలని కోరారు. వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ సమాధానమిస్తూ.. 25వేల ఆదాయం ఉన్న వారు ఆరోగ్యశ్రీ వినియోగించుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు. పామాయిల్ రైతులకు కనీస మద్దతు ధర చెల్లిస్తున్నారా అని బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్వీకేకే రంగారావు అడగ్గా.. కేంద్రం రూ.17 వేలు ఇస్తుంటే మన రాష్ట్రంలో 20,700 ఇస్తున్నామని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు బదులిచ్చారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ఉపసంఘం వేయాలి..



ప్రజల సమస్యలను అధికారులు సకాలంలో పరిష్కరించడం లేదని, వినతుల పర్యవేక్షణకు ఉపసంఘాన్ని నియమిస్తే పరిశీలించి పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఏళ్ల తరబడి ప్రజల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వాల్మీకి, బోయలను ఎస్టీల్లో చేర్చుతూ అసెంబ్లీలో తీర్మానాన్ని ఆమోదించి కేంద్రానికి పంపాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి కోరారు. అనంతపురం లాంటి వెనుకబడిన జిల్లాలో ఐదెకరాల కన్నా ఎక్కువ భూమి ఉన్న రైతులకు హార్టికల్చర్ సబ్సిడీ అమలు చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూర విజ్ఞప్తిచేశారు. టీటీడీ దర్శన టికెట్లు ఆన్‌లైన్‌లో జారీచేయడం వల్ల భక్తులకు లభించడం కష్టంగా ఉందని, ఈ-దర్శన్‌లు పునరుద్ధరించాలని ఎమ్మెల్యే రామకృష్ణబాబు కోరారు. జాతీయ, రాష్ట్ర రహదారులపై ప్రమాదాలకు పశువులు కారణమవుతున్నాయని.. వాటిని రోడ్లపైకి రానివ్వకుండా కట్టడి చేయాలని ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. కర్నూలు జిల్లాలో వలసలు నివారించాలని కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి, తిరుపతి శివారు ప్రాంతాల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేయాలని తిరుపతి సభ్యుడు ఆరణి శ్రీనివాసులు కోరారు.

వైసీపీ సర్కారు తప్పిదాలతో విద్యుత్ శాఖకు రూ.1.29 లక్షల కోట్ల నష్టం

- కొవ్వాడ అణు విద్యుత్కేంద్రం పనులు వేగవంతం: గొట్టిపాటి



అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం గత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేసిన తప్పిదాల వల్ల విద్యుత్తు రంగానికి రూ.1.29 లక్షల కోట్ల మేర నష్టం వాటిల్లిందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. ఇంధనశాఖ బడ్జెట్ ఆమోదం కోసం జరిగిన చర్చలో భాగంగా బుధవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడారు. 2014-19 మధ్యలో మిగులు విద్యుత్తుతో ప్రభుత్వాన్ని అప్పగిస్తే, వైసీపీ ప్రభుత్వం 2019-24 మధ్య తొమ్మిదిసార్లు చార్జీలు పెంచి ప్రజలపై రూ.1.29 లక్షల కోట్ల భారం మోపిందని మండిపడ్డారు. డిస్కమ్‌ల ద్వారా పదివేల కోట్ల మేర ఇష్టానుసారంగా విద్యుత్తు పరికరాలను కొనుగోలు చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో ఒక్క రూపాయి కూడా విద్యుత్ బిల్లు పెంచకూడదని, రైతులకు 9 గంటల విద్యుత్ ఇవ్వాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. విద్యుత్ పరికరాల చోరీ సమస్యలను పరిష్కరిస్తామని, ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలతోపాటు, వాటిని కొనుగోలు చేసినవారితో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను పెట్టించే కార్యక్రమం చేస్తున్నామని తెలిపారు. రూ.10వేల కోట్లతో కొవ్వాడలో అణువిద్యుత్కేంద్రం ఏర్పాటుతో పాటు త్వరిగితిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, విష్ణుకుమార్ రాజు, రెడ్డప్పగారి మాధవి, గొండు శంకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ఎలా నాశనం చేసిందన్న దానిపై వివరించారు.

జగన్ సర్కారు ఫీజు బకాయిలు 4,271 కోట్లు

- దశలవారీగా వాటిని చెల్లిస్తున్నాం : లోకేశ్
- విద్యా రంగంలో సంస్కరణలపై మండలిలో చర్చ

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద చెల్లించాల్సిన రూ.4,271 కోట్లు బకాయిలు పెట్టి పోతే.. తమ ప్రభుత్వం వాటిని చెల్లిస్తోందని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. దశలవారీగా బకాయిలు చెల్లిస్తున్నామని, ఇది నిరంతరం సాగే ప్రక్రియ అని పేర్కొన్నారు. కొత్త రీయింబర్స్‌మెంట్ విధానంలో ఏప్రిల్ 24 తర్వాత నేరుగా కాలేజీల అకౌంట్లలోనే మిగిలిన నిధులు జమ చేస్తామని తెలిపారు. కొన్ని కాలేజీల యాజమాన్యాలు కావాలనే విద్యార్థుల నుంచి బలవంతంగా ఫీజులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యారంగంలో సంస్కరణలపై బుధవారం శాసనమండలిలో జరిగిన లఘు చర్చలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరిస్తామని చెప్పారు. విద్యా శాఖ తనకు భారం కాదని, తానే కావాలని బాధ్యతగా తీసుకున్నానని తెలిపారు. "సమాజంలో అసమానతలు పోవాలంటే విద్యతోనే సాధ్యం. గత వైసీపీ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో వాస్తవాలకు దూరంగా పని చేసి విద్యా ప్రమాణాలను దిగజార్చింది. సీబీఎస్ఈ విధానంపై ఎలాంటి కసరత్తు చేయలేదు. ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వకుండా, విద్యార్థులను సన్నద్ధం చేయకుండానే రాష్ట్రవ్యాప్తంగా 1000 ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ పాఠశాలల్లోని విద్యార్థులకు మాక్ టెస్ట్ నిర్వహిస్తే 90 శాతం మంది ఒక సబ్జెక్ట్‌లో ఫెయిలయ్యారు. అందుకే సీబీఎస్ఈని తాత్కాలికంగా వాయిదా వేశాం. విద్యారంగంలో దశల వారీగా సంస్కరణలు అమలుచేస్తాం. గత ప్రభుత్వంలో మాదిరిగా రాజకీయ పార్టీల రంగులు, ఫొటోలు లేకుండా విద్యార్థులకు ఇచ్చే స్కూల్ కిట్లను సర్వేపల్లి రాధాకృష్ణ పేరుతో అందజేస్తున్నాం. ప్రచార పిచ్చితో ఫొటోలు, రంగులకు గత ప్రభుత్వం చేసిన వృథా ఖర్చులు రూ.1000కోట్ల వరకు తగ్గించాం" అని లోకేశ్ అన్నారు.


మండలిలో 'జగనన్న విద్యాకానుక' బ్రోచర్ చూపుతున్న మంత్రి లోకేశ్

ఒక్క స్కూలూ మూతపడదు

"జగన్ తమ కుటుంబ సభ్యులు, వైసీపీ కార్యకర్తలను యూనివర్సిటీలకు వీసీలుగా నియమించుకున్నారు. మా ప్రభుత్వం వచ్చాక ఐఐటీ ఖరగ్‌పూర్, ఎన్ఐటీ వరంగల్ లాంటి ప్రఖ్యాత విద్యాసంస్థలలో పనిచేసిన వారిని తీసుకువచ్చి వీసీలుగా నియమించాం. వాళ్లెవరూ మాకు బంధువులు కాదు.. మిత్రులూ కాదు. విశ్వవిద్యాలయాలకు పూర్వవైభవం తీసుకురావడం కోసం వీసీల నియామక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా పూర్తిచేశాం. వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో ఐటీఐ, పాలిటెక్నిక్‌లలో ప్రవేశాలు 69శాతానికి పడిపోయాయి. ప్రజాప్రతినిధుల సహకారంతో ఐటీఐ, పాలిటెక్నిక్‌లకు భవనాలు నిర్మించి, సిబ్బందిని సమకూరుస్తాం. ఇండస్ట్రీ కనెక్టివిటీ కరిక్యులమ్ తీసుకువస్తాం. రాష్ట్రంలో ఒక్క ప్రభుత్వ పాఠశాలను కూడా మూసివేయకూడదనేది మా లక్ష్యం. అందుకోసం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలను బలోపేతం చేస్తాం. కేజీ నుంచి పీజీ వరకు కరిక్యులాన్ని పటిష్ఠం చేస్తాం. బాగా పనిచేసే ఉపాధ్యాయులను విదేశాలకు పంపించి శిక్షణ ఇప్పిస్తాం. టీచర్ల కోసం అమరావతిలో వరల్డ్ క్లాస్ ట్రెయినింగ్ అకాడమీని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలను పారదర్శకంగా రూపొందిస్తున్నాం. బదిలీలు, ప్రమోషన్ల కోసం టీచర్ ట్రాన్స్‌ఫర్ యాక్ట్‌ను అమలులోకి తెస్తాం. గంజాయి, డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు విద్యాసంస్థల్లో ఈగల్ కమిటీలు ఏర్పాటు చేస్తాం. ప్రతి స్కూల్‌లో మొక్కలు పెంచేందుకు గ్రీన్ క్లబ్‌లను ఏర్పాటు చేస్తాం. సైన్స్ ఫెయిర్, కల్చరల్ ఫెస్ట్, వార్షికోత్సవాలను నిర్వహిస్తాం. ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం 125 భవిత సెంటర్లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం" అని లోకేశ్ వివరించారు. అంతకుముందు టీడీపీ ఎమ్మెల్సీలు వేపాటి చిరంజీవిరావు, కంచర్ల శ్రీకాంత్, బీటీ నాయుడు, దువ్వారపు రామారావు, పీడీఎఫ్ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో తీసుకురావాల్సిన మార్పులపై సూచనలు చేశారు.

జూన్ నాటికి 3లక్షల గృహాలు పూర్తి: మంత్రి కొలుసు



అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జూన్ నాటికి రాష్ట్రంలో 3లక్షల గృహాల నిర్మాణం పూర్తి చేసి, ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. 'కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో 1.25లక్షల గృహాలు పూర్తి చేయగా, 7.25లక్షల ఇళ్లను 2026 మార్చికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందులో 5లక్షల ఇళ్లను వచ్చే జూన్‌లోగా పూర్తి చేస్తాం. మిగిలినవి వచ్చే ఏడాది మార్చికి పూర్తి చేస్తాం' అని తెలిపారు. 5,98,710 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి అదనపు సాయం అందించేందుకు ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తు చేశారు. దీనివల్ల రూ.3,219.75కోట్ల భారం పడుతుందని మంత్రి వివరించారు.

వైసీపీ నేతలకు చేతనైతే చర్చకు రావాలి: పంచుమర్తి

వైసీపీ నేతలు రాజకీయ ఉనికి కోసం నిరసనలు చేయడం మాని, చేతనైతే ప్రజా సమస్యలపై చర్చలకు అసెంబ్లీకి రావాలని ప్రభుత్వ చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ సవాల్ చేశారు. రాష్ట్రాన్ని విధ్వంసం చేసిన వైసీపీని 9నెలలకే ప్రజలంతా మర్చిపోయారని ఎద్దేవా చేశారు. వైసీపీ పాలనలో ఉపాధ్యాయుల బదిలీల్లో ముడుపులు తీసుకున్న వ్యక్తి కూటమి ప్రభుత్వంపై అకారణంగా విమర్శలు చేయడం హాస్యస్పదంగా ఉందని అన్నారు.

ప్రతి ఇంటికి 135 లీటర్ల తాగునీరు

- అమృత్ 2.0 కింద 8,500 కోట్లకు ఆమోదం
- అసెంబ్లీలో మున్సిపల్ మంత్రి నారాయణ

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ 135 లీటర్ల తాగునీరు అందిస్తామని, దీనిని మూడేళ్లలో పూర్తిచేస్తామని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ అన్నారు. బుధవారం అసెంబ్లీలో మున్సిపల్ బడ్జెట్ ఆమోదానికి జరిగిన చర్చ అనంతరం ఆయన సమాధానం ఇచ్చారు. గ్రామాల నుంచి ప్రజలు వలస రావడం వల్లే పట్టణాల్లో జనాభా పెరుగుతోందని, మున్సిపాలిటీల్లో 1.50కోట్ల మంది ప్రజలు ఉన్నారని వివరించారు. గత ప్రభుత్వం సీఎఫ్ఎంఎస్‌లో మున్సిపాలిటీలకు చెందిన నిధులు తిరిగి వాటికి ఇవ్వలేదని తెలిపారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని, ఏప్రిల్ 1నుంచి మున్సిపాలిటీల నిధులు వారే ఖర్చు చేసుకునేందుకు ఆమోదించారని చెప్పారు. మున్సిపల్ శాఖకు బడ్జెట్‌లో రూ.13,862 కోట్లు కేటాయించారని తెలిపారు. అమృత్ 2.0 పథకానికి కేంద్రం దాదాపు రూ.8,500 కోట్లకు అనుమతిచ్చిందని, అందులో 36.7 శాతం నిధులు కేంద్రమే ఇస్తుందని వివరించారు. గత ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వపోవడం వల్ల ఆ ప్రాజెక్టు నిలిచిపోయిందని మంత్రి ఆరోపించారు. దాన్ని పూర్తి చేయడానికి బడ్జెట్‌లో రూ.756 కోట్లు కేటాయించారని తెలిపారు. 360, 430 చదరపు అడుగుల గృహాలను జూన్ నాటికి పూర్తి చేయాలని సీఎం ఆదేశించారని తెలిపారు. 2014-19మధ్యకాలంలో ప్రారంభించిన 204 అన్నక్యాంటీన్లను వైసీపీ ప్రభుత్వం మూసేసిందన్నారు. ప్రస్తుతం మళ్లీ 199అన్నక్యాంటీన్లు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రూరల్ ప్రాంతాల్లో 63 క్యాంటీన్ల ఏర్పాటుకు టెండర్లు ఆహ్వానించామని, వంద రోజుల్లో వాటిని ప్రారంభిస్తామని చెప్పారు. ఎమ్మెల్యేలు అశోక్ రెడ్డి, గణబాబు మాట్లాడుతూ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కోరారు. అమృత్ 2.0 పథకం కింద నీటి సరఫరా నిలిచిపోయిందని, త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే పుల్లరావు కోరారు. జీవీఎంసీలో కమిషనర్‌ను నియమించాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కోరారు.

5 శాఖలకు నిధుల మంజూరుకు ఆమోదం

మున్సిపల్ శాఖకు రూ.13,862 కోట్లు, ప్రణాళిక, సర్వే విభాగానికి రూ.36,414 కోట్లు, వాణిజ్య పన్నుల శాఖకు రూ.472 కోట్లు, కార్మిక శాఖకు రూ.732 కోట్లు, ఇంధన శాఖకు రూ.13,609 కోట్లకు ఆమోదం కోసం డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు సభ ముందు ఉంచారు. ఈ కేటాయింపులకు సభ్యులంతా ఆమోదం తెలపడంతో ఆయా శాఖలకు నిధులు మంజూరు చేసేందుకు సభ ఆంగీకరించింది.

సేఫ్టీ ఆడిట్ చేయనందుకే ప్రమాదాలు: వాసంశెట్టి



గత వైసీపీ ప్రభుత్వం పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ చేయకపోవడంతో పరిశ్రమల్లో ప్రమాదాలో జరుగుతున్నాయని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆరోపించారు. కార్మిక శాఖ బడ్జెట్ ఆమోదం కోసం జరిగిన చర్చలో భాగంగా అసెంబ్లీలో ఆయన బుధవారం మాట్లాడారు. 2019-24 మధ్యలో రాష్ట్రంలో దాదాపు 363 ప్రమాదాల్లో 445 మంది మరణించారని తెలిపారు. ఈఎస్ఐ ఆస్పత్రుల్లో కార్మికుల భద్రత, ఆరోగ్యం విషయంలో వైసీపీ ప్రభుత్వం చిత్తశుద్ధి లేకండా వ్యవహరించిందని ఆరోపించారు.

మాట్లాడొద్దంటే వెళ్లిపోతా: విష్ణు

వివిధ శాఖల గ్రాంట్ల అమోదం కోసం అసెంబ్లీలో జరిగిన చర్చలో భాగంగా టీడీపీ ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, బీజేపీ ఫ్లోర్‌లీడర్ విష్ణుకుమార్ రాజు మధ్య కొంత మాటల యుద్ధం నడిచింది. కార్మికులు, పరిశ్రమల తీరుపై విష్ణు మాట్లాడుతున్న సమయంలో కాలవ శ్రీనివాసులు కొంచెం త్వరగా ముగించాలని కోరారు. సమయం సాయంత్రం 4.50 కావస్తోందని, 5గంటలకు సభ ముగించాల్సి ఉండటంతో సమయాన్ని కూడా చూడాలని, రోజూ మాట్లాడుతున్నారు కదా అని కాలవ సూచించారు. 2 నిమిషాల్లో ముగించాలని డిప్యూటీ స్పీకర్ కూడా కోరినా విష్ణుకుమార్ రాజు సుదీర్ఘంగా వివరించే ప్రయత్నం చేయడంతో త్వరగా ముగించాలని కాలవ మరోసారి అన్నారు. దీనిపై విష్ణుకుమార్ రాజు కొంత ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ఫ్లోర్ లీడర్ హోదాలో తాను మాట్లాడుతున్నానని, ఎంతసేపు మాట్లాడాలో మీరే చెప్పాలన్నారు. మాట్లాడొద్దంటే వెళ్లిపోతానని గట్టిగా చెప్పారు. స్పీకర్ కల్పించుకుని సభ్యులను దృష్టిలో పెట్టుకుని మాట్లాడాలని సూచించడంతో ఇద్దరూ శాంతించారు.

పెద్దిరెడ్డికి హైకోర్టు షాక్

» బుగ్గ మఠం ఈవో షోకాజ్ నోటీసుపై జోక్యానికి నిరాకరణ



అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి, వైసీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి హైకోర్టు షాక్ ఇచ్చింది. తిరుపతి, ఎం.ఆర్‌పల్లి, మారుతి నగర్ ఎక్స్‌టెన్షన్ పరిధిలోని బుగ్గమఠం భూముల ఆక్రమణపై వివరణ ఇవ్వాలని, ఆక్రమణదారుగా భావించి ఎందుకు ఖాళీ చేయించకూడదో చెప్పాలంటూ ఆ మఠం అసిస్టెంట్ కమిషనర్/ఈవో మార్చి7న ఇచ్చిన షోకాజ్ నోటీసుల విషయంలో జోక్యానికి నిరాకరించింది. సర్వే నం. 261/2లోని 2.38 ఎకరాల విషయంలో యాజమాన్య హక్కులు నిరూపణకు పెద్దిరెడ్డి వద్ద ఎలాంటి దస్త్రాలు లేనందున నోటీసులు నిలువరిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని తేల్చిచెప్పింది. సర్వే నం. 261/1లో కేవలం 80 సెంట్ల విషయంలో టైటిల్ ఉందని పిటిషనర్ చెబుతున్న నేపథ్యంలో ఆ భూమి విషయంలో అధికారులు జోక్యం చేసుకోకుండా రెండువారాలపాటు నిలువరించింది. అసిస్టెంట్ కమిషనర్ ఇచ్చిన షోకాజ్ నోటీసుకు వివరణ ఇచ్చేందుకు గడువును పొడిగించింది. ఈ వ్యవహారంపై సవివరంగా ఉత్తర్వులు ఇస్తామని పేర్కొంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ జగడం సుమతి బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. తిరుపతి, ఎం.ఆర్‌పల్లి, మారుతినగర్ ఎక్స్‌టెన్షన్ పరిధిలోని సర్వే నం. 261/1లోని 1.50 ఎకరాలు, సర్వేనం. 261/2లోని 2.38 ఎకరాల బుగ్గ మఠం భూముల ఆక్రమణపై వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని, విఫలమైతే ఆక్రమణదారుగా భావించి.. ఎందుకు ఖాళీ చేయించకూడదో చెప్పాలంటూ తిరుపతి బుగ్గ మఠం అసిస్టెంట్ కమిషనర్/ ఈవో మార్చి7న పెద్దిరెడ్డికి షోకాజ్ నోటీసు ఇచ్చారు. ఈ నోటీసులను సవాల్ చేస్తూ పెద్దిరెడ్డి బుధవారం అత్యవసరంగా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాన్ని న్యాయమూర్తి లంచ్‌మోషన్‌గా విచారణకు స్వీకరించారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సీవీ మోహన్‌రెడ్డి వాదనలు వినిపించారు. గత 30 ఏళ్లుగా భూమి పిటిషనర్ ఆధీనంలోనే ఉందన్నారు. రిజిస్టర్డ్ సేల్ డీడ్ ద్వారా భూమిని కొనుగోలు చేశామన్నారు. షోకాజ్ నోటీసును రద్దు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం, బుగ్గమఠం తరఫున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. సర్వేనం. 261/2లోని 2.38 ఎకరాల భూమిపై హక్కులు నిరూపణకు పిటిషనర్ ఎలాంటి ప్రాథమిక ఆధారాలు కోర్టు ముందు ఉంచనందున షోకాజ్ నోటీసు విషయంలో జోక్యం చేసుకోవద్దని కోరారు.

తిరుమలను కాంక్రీట్ జంగిల్‌గా మార్చొద్దు

» టీటీడీకి స్పష్టం చేసిన హైకోర్టు.. ప్రతివాదులకు నోటీసులు

అమరావతి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తిరుమలను కాంక్రీట్ జంగిల్‌గా మారనీయకుండా చర్యలు తీసుకోవాలని టీటీడీకి హైకోర్టు స్పష్టం చేసింది. భవన నిర్మాణాల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ధార్మిక సంస్థల పేరుతో ఎలాపడితే అలా నిర్మాణాలు చేస్తామంటే కుదరదని వ్యాఖ్యానించింది. అక్రమ నిర్మాణాలను అనుమతిస్తూ పోతే కొన్నాళ్లకు అటవీప్రాంతం కనుమరుగవుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. అక్రమ నిర్మాణాల విషయంలో తాము కఠినంగానే ఉంటామని హెచ్చరించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న దేవదాయశాఖ ముఖ్యకార్యదర్శి, టీటీడీ, పలు మఠాలకు నోటీసులు జారీచేసింది. విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. పలు మఠాలు తిరుమలలో అనుమతులు లేకుండా ఇష్టారీతిన నిర్మాణాలు చేపడుతున్నా, టీటీడీ పట్టించుకోవడం లేదంటూ తిరుపతికి చెందిన టి.మహేశ్ వేసిన పిల్‌పై ఈ ఆదేశాలిచ్చింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది చిత్తరువు నాగేశ్వరరావు, టీటీడీ తరఫున న్యాయవాది సుమంత్ వాదనలు వినిపించారు.

నాకేమైనా అయితే

వివేకా కేసు నిర్వీర్యమే!

ఆ హత్య కేసులో నేనే కీలక సాక్షిని.. భద్రత పెంచాలి: దస్తగిరి

» గతంలో 2+2+ఎస్కార్ట్ వాహనం ఉండేది

» కూటమి ప్రభుత్వం వచ్చాక కుదించారు

» వైసీపీ నేతలు, కార్యకర్తల నుంచి నాకు ప్రమాదం పొంచి ఉంది

» 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి'తో అప్రూవర్ దస్తగిరి

» రక్షణ కోసం కడప ఎస్పీకి వినతిపత్రం

కడప, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో తానే కీలక సాక్షినని.. తనకేమైనా జరిగితే కేసు నిర్వీర్యమైపోతుందని అప్రూవర్‌గా మారిన దస్తగిరి హెచ్చరించారు. అందుచేత తనకు భద్రత పెంచాలని కోరారు. మంగళవారం ఆయన 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. గతంలో తనకు 2+2+ఎస్కార్ట్ వెహికల్ ఉండేదని, కూటమి అధికారంలోకి వచ్చాక 1+1కు కుదించారని తెలిపారు. 'పులివెందులలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు.. వైఎస్ కుటుంబానికి కట్టుబానిసల లెక్కన పనిచేస్తారు. వారి నుంచి ప్రమాదం పొంచి ఉందని నేను అప్రూవర్‌గా మారినప్పటి నుంచీ తెలుసు. అప్పటి సీబీఐ ఎస్పీకి తెలియజేయగా.. ఆయన కడప ఎస్పీతో మాట్లాడి భద్రత కల్పించారు. అయితే అయితే ఇప్పుడు తగ్గించారు. పెంచాలని కోరుతున్నా. వివేకా హత్య కేసులో సాక్షులుగా ఉన్న శ్రీనివాసులరెడ్డి దగ్గర నుంచి వాచ్‌మన్ రంగన్న వరకు జరిగిన మరణాలు సహజమా.. లేక హత్యలా అనేది వైసీపీనే చెప్పాలి. 2019లో వివేకానందరెడ్డి హత్య జరిగినప్పుడు టీడీపీ ప్రభుత్వం ఉంది. అప్పుడు ఒకరిమీద బురదజల్లాలని మాతో ఈ హత్య చేయించి.. చంద్రబాబు చేయించాడని జగన్ చెప్పారు. తర్వాత జగన్ సీబీఐ ఎంక్వైరీ కావాలని కోరారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక కోర్టులో పిటిషన్ విత్‌డ్రా చేసుకున్నారు. సీబీఐ వద్దకు వెళ్లకుండా ఇష్టానుసారంగా సాక్షులను భయభ్రాంతులకు గురిచేశారు. జగన్ అధికారంలో ఉన్న ఐదేళ్లలో, ఆ తర్వాత పలువురు సాక్షులు చనిపోయారు. అవి హత్యలా, అనుమానాస్పద మరణాలా అనేది ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం తేల్చే పనిలో ఉంది. దానిపై నాకు పూర్తిగా నమ్మకం ఉంది' అని చెప్పారు. 2019లో జగన్, వైఎస్ అవినాశ్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి తప్పు చేసి చంద్రబాబుపై బురదజల్లారని.. తాను అప్రూవర్‌గా మారడంతో ఐదేళ్లలో ఎన్నో కేసులు పెట్టించి, ఇబ్బందులు పెట్టి దెబ్బతీయాలని, లొంగదీసుకోవాలని చూశారని.. ఎన్ని సమస్యలొచ్చినా ఎవరికీ భయపడలేదని దస్తగిరి తెలిపారు. 'నేను తప్పు చేశాను. ప్రాయశ్చిత్తంగా అప్రూవర్‌గా మారాను. మళ్లీ వీళ్లతో కలిసి తప్పు చేయాలనే ఆలోచన లేదు. అప్పటి నుంచి ఎన్నో విధాలుగా నాతో సంప్రదింపులు జరిపారు. లైఫ్ సెటిల్‌మెంట్ చేస్తామని చెప్పారు. ఆ విషయాలన్నీ సీబీఐకి చెప్పాను. శ్రీనివాసులరెడ్డి ఏ విధంగా లెటర్ రాసి చనిపోయాడు? కువైట్ గంగాధర్ ఎలుకలు కొరికి చనిపోయాడని కథనాలు నడిపారు.. ఒకరిద్దరి తర్వాత ఇప్పుడు రంగన్న చనిపోయాడు. రంగన్న మరణం వెనుక ఎవరున్నారో తేలాలని పులివెందుల ఏరియా అంతా అనుకుంటోంది. ఈ హత్య కేసు విషయంలో ఎంతో మంది అమాయకులు బలయ్యారు. తప్పు చేసిందొకడు, చేయించిందొకడు. నిజానిజాలు నిగ్గుతేల్చాలని చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్, ప్రధాని మోదీలను కోరుతున్నా' అని చెప్పారు. జగన్ మామ ఈసీ గంగిరెడ్డి మరణంపై మాట్లాడుతూ.. వైఎస్ కుటుంబంలో ఎవరైనా చనిపోతే ఏదీ బయటకు రానివ్వరని, గోప్యత పాటిస్తారని అన్నారు. అనంతరం దస్తగిరి ఎస్పీ కార్యాలయానికి వెళ్లి భద్రత పెంచాలంటూ వినతిపత్రం సమర్పించారు.



ముగ్గురు ఐపీఎస్‌ల సస్పెన్షన్ 6నెలలు పొడిగింపు

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): సినీనటి కాదంబరి జెత్వానీని అక్రమంగా బంధించి, తప్పుడు కేసుతో వేధించిన వ్యవహారంలో నిఘా విభాగం మాజీ అధిపతి పీఎస్ఆర్ ఆంజనేయులు, విజయవాడ మాజీ పోలీస్ కమిషనర్ కాంతిరాణా తాతా, మాజీ డీసీపీ విశాల్ గున్నీ సస్పెన్షన్‌ను ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించింది. గత వైసీపీ ప్రభుత్వంలో జెత్వానీపై ఇబ్రహీంపట్నంలో తప్పుడు కేసు పెట్టించారు. ఎఫ్ఐఆర్ రిజిస్టర్ కాక ముందే విమానంలో ముంబై వెళ్లిన విశాల్ గున్నీ బృందం ఆమెను బలవంతంగా విజయవాడకు తీసుకొచ్చారు. వైసీపీ నాయకుడు కుక్కల విద్యాసాగర్‌కు చెందిన భూమిని ఫోర్జరీ పత్రాలతో విక్రయించేందుకు ప్రయత్నించారంటూ ఆమెపై తప్పుడు కేసు నమోదు చేసి వేధింపులకు గురిచేశారు. జెత్వానీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన విజయవాడ పోలీసులు చేపట్టిన దర్యాప్తులో ఈ ముగ్గురు అధికారుల పాత్రపై ప్రాథమిక ఆధారాలు లభించాయి. అఖిల భారత సర్వీసు నిబంధనలు ఉల్లంఘించారన్న అభియోగాలపై గత ఏడాది సెప్టెంబరు 15న ప్రభుత్వం వారిని సస్పెండ్ చేసింది. కేసు దర్యాప్తు పూర్తికానందున మరిన్ని ఆధారాలు సేకరించే క్రమంలో మరికొన్ని రోజులు వీరిని సస్పెన్షన్‌లో ఉంచాలని ఈ నెల 6న ప్రభుత్వానికి డీజీపీ ప్రతిపాదన పంపారు. దీంతో సస్పెన్షన్‌ను పొడిగిస్తూ సీఎస్ విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

జగ్గయ్యపేట కోర్టుకు వర్రా.. రిమాండ్

విజయవాడ/జగ్గయ్యపేట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ సతీమణి భారతీరెడ్డి పీఏ, వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ వర్రా రవీంద్రారెడ్డిని బుధవారం జగ్గయ్యపేట జూనియర్ సివిల్ కోర్టులో పోలీసులు హాజరు పరిచారు. ఎన్టీఆర్ జిల్లా చిల్లకల్లు పోలీసులు నమోదు చేసిన కేసులో వర్రాకు న్యాయాధికారి శోభారాణి 14 రోజుల రిమాండ్ విధించారు. చిల్లకల్లు పోలీసులు నమోదు చేసిన కేసులో సెక్షన్లు అన్నీ 7 సంవత్సరాలలోపు శిక్ష పడేవేనని, బీఎన్ఎస్ఎస్ 35 ప్రకారం నోటీసు ఇస్తే సరిపోతుందని రవీంద్రారెడ్డి తరఫున న్యాయవాది పసుపులేటి సత్య శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆయనకు అనారోగ్య సమస్యలున్నాయన్నారు. ఈ వాదనలను న్యాయాధికారి తోసిపుచ్చారు. జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం వర్రాను సబ్‌జైలుకు తరలించారు. టీడీపీ అధినేత చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్, కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీలపై వర్రా అసభ్య పోస్టింగ్‌లు పెట్టారని చిల్లకల్లుకు చెందిన టీడీపీ కార్యకర్త ఎనికే గోపి ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుపై నమోదైన కేసులో చిల్లకల్లు పోలీసులు కడప నుంచి జగ్గయ్యపేటకు పీటీ వారెంట్‌పై రవీంద్రారెడ్డిని అరెస్టు చేసి తీసుకొచ్చారు. కడప నుంచి వచ్చే ముందు వర్రా మెడనొప్పి అంటూ హంగామా చేసిన విషయం తెలిసిందే.

కొడాలి నానికి నోటీసులిచ్చి వివరణ తీసుకోండి

» బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నడుచుకోండి.. విశాఖ పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత కొడాలి నానిపై కేసు విషయంలో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నడుచుకోవాలని విశాఖ మూడవ పట్టణ పోలీసులను హైకోర్టు ఆదేశించింది. పిటిషనర్‌పై నమోదు చేసిన సెక్షన్లు అన్నీ ఏడేళ్లలోపు శిక్షకు వీలున్నవేనని గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో పిటిషనర్‌కు నోటీసు ఇచ్చి వివరణ తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. వ్యాజ్యాన్ని పరిష్కరించింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్. హరినాథ్ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులను అసభ్య పదజాలంతో దూషించిన కొడాలి నానిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థిని సత్యల అంజనప్రియ గతేడాది చేసిన ఫిర్యాదుపై విశాఖ పోలీసులు కేసు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ కొడాలి నాని హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ తరఫు న్యాయవాది పప్పుడిపు శ్రీధర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. నోటీసులు ఇచ్చి వివరణ తీసుకొనేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. వివరాలు సమర్పించేందుకు సమయం ఇవ్వాలని ఏపీపీ అభ్యర్థించారు.

చిరు వ్యాపారులకు అండ

» 160 రకాల వ్యాపారాలకు రుణాలు: డూండీ రాకేశ్

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): 'కార్పొరేషన్లు పేద ప్రజలకు అండగా నిలవాలన్నది సీఎం చంద్రబాబు ఆశయం. దానికి అనుగుణంగా కార్పొరేషన్ల ద్వారా రుణాలు అందుబాటులోకి తీసుకొచ్చారు' అని ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేశ్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 'ఏపీ ఆన్‌లైన్ బెనిఫిషియరీ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టం(ఏపీఓబీఎంఎంఎస్) ద్వారా ఆయా వృత్తుల వారు వారికి సంబంధించిన కార్పొరేషన్‌కు రుణం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. 145 రకాల సేవల విభాగాలకు, 16 రకాల పౌల్ట్రీ ఫామ్స్‌కు రుణాలు మంజూరు చేస్తున్నాం. చిరువ్యాపారులు మొత్తం 160 రకాల వ్యాపారాలకు ఈ రుణాలు పొందే అవకాశం ఉంది' అని రాకేశ్ వివరించారు.

దళితుల ఆత్మగౌరవం చంద్రబాబుతోనే సాధ్యం: జవహర్

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): దళితుల ఆత్మగౌరవానికి సీఎం చంద్రబాబు పెద్దపీట వేస్తున్నారని మాజీ మంత్రి కేఎస్ జవహర్ అన్నారు. 'ఎస్సీ వర్గకరణను అమలు చేసిన ఘనత చంద్రబాబుదే. మలుపు, ముందడుగు పథకాలు దళితుల జీవన స్థితిగతులను మార్చాయి. ఎస్సీ రిజర్వేషన్ అమలు కోసం రాజీవ్ రంజన్ మిశ్రాతో కమిషన్ వేశారు. జిల్లాను యూనిట్‌గా తీసుకుని రిజర్వేషన్ అమలుకు చర్యలు తీసుకుంటున్నారు' అన్నారు.

నేడు 237 మండలాల్లో వడగాడ్పులు

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎండ, వడగాలి క్రమంగా పెరుగుతోంది. బుధవారం నంద్యాల జిల్లా చాగలమర్రి, కడప జిల్లా మడూరులో 39.9, అనకాపల్లి జిల్లా బలిఘట్టంలో 39.8, మన్యం జిల్లా బూర్జలో 39.7, కర్నూలులో జిల్లా కమ్మరచేడులో 39.6, విజయనగరంలో 39.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గురువారం 184 మండలాల్లో సాధారణ వడగాడ్పులు ఉంటాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

జగన్‌తో డీఎంకే నేతల భేటీ

నియోజకవర్గాల పునర్విభజనపై నిరసనకు విజ్ఞప్తి

అమరావతి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై తాము తెలుపుతున్న నిరసనకు మద్దతు ఇవ్వాలని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌ను తమిళనాడు అధికారపక్షం డీఎంకే కోరింది. ఈ మేరకు తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో తమిళనాడు మంత్రి ఈవీ వేలు, డీఎంకే రాజ్యసభ సభ్యుడు విల్సన్... జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి లేఖ అందించారు.

'కారుణ్య' కమిటీ చైర్మన్‌గా అజయ్ జైన్

అమరావతి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కారుణ్య నియామకాల రాష్ట్రస్థాయి కమిటీ చైర్మన్‌గా హౌసింగ్ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్‌ను ప్రభుత్వం నియమించింది. సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

డిస్టిలరీస్ జేసీ బదిలీ

ఎక్సైజ్ కమిషనరేట్‌లో డిస్టిలరీస్ విభాగాన్ని పర్యవేక్షిస్తున్న జాయింట్ కమిషనర్ టి.నాగలక్ష్మిని ఆ హోదా నుంచి తప్పిస్తూ ఆ శాఖ కమిషనర్ నిశాంత్ కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. ఫైళ్లపై ఆమె ఎలాంటి రిమార్కులు, అభిప్రాయాలు రాయడం లేదని, దీంతో ఫైళ్ల పరిష్కారంలో జాప్యంజరుగుతోందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

హైకోర్టు ఆగ్రహంతో..

ఎట్టకేలకు బోరుగడ్డ లొంగుబాటు

» రాజమండ్రి జైలులో ఉదయాన్నే ప్రత్యక్షం

» గుంటూరు కోర్టులో హాజరుపరిచిన పోలీసులు

రాజమహేంద్రవరం/గుంటూరు/అనంతపురం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆగ్రహంతో రౌడీ షీటర్ బోరుగడ్డ అనిల్‌కుమార్ దిగొచ్చాడు. విమానంలో వచ్చయినా మంగళవారం సాయంత్రం 5 గంటల్లోపు రాజమండ్రి సెంట్రల్ జైలులో లొంగిపోవాలని న్యాయస్థానం ఆదేశించడంతో బుధవారం ఉదయాన్నే లొంగిపోయాడు. తల్లి అనారోగ్యాన్ని సాకుగా చూపి.. నకిలీ మెడికల్ సర్టిఫికెట్ సృష్టించి.. కోర్టును తప్పుదోవ పట్టించి.. మధ్యంతర బెయిల్ పొడిగింపు పొందిన అతడు.. కోర్టు ఉత్తర్వుల ప్రకారం 11న జైల్లో లొంగిపోవలసి ఉంది. కానీ రాలేదు. మధ్యంతర బెయిల్ పొడిగింపు మళ్లీ లభిస్తుందని ఆశించాడు. కానీ పొడిగించేది లేదని.. గడువులోగా లొంగిపోవలసిందేనని న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప తేల్చిచెప్పారు. అయినా గడువులోగా జైల్లో లొంగిపోకపోవడంతో.. పరారీలో ఉన్నట్లు పోలీసులు పరిగణించారు. అయితే బుధవారం ఉదయం 6.14 గంటలకు బోరుగడ్డ అనూహ్యంగా జైలు వద్ద ప్రత్యక్షమయ్యాడు. ఆ సమయాన్ని అధికారులు రికార్డు చేసుకుని లోపలకు అనుమతించారు. గుంటూరు పట్టాభిపురం స్టేషన్లో నమోదైన కేసులో అతడిని కోర్టులో హాజరుపరచడానికి ఉదయం 7గంటలకు జైలుకు వచ్చారు. అతడిపై పీటీ వారెంటును అధికారులకు సమర్పించారు. వైద్య పరీక్షల అనంతరం ఉదయం 10.20కి అతడిని వారు అప్పగించగా గుంటూరుకు తరలించారు. జీజీహెచ్‌లో వైద్య పరీక్షల అనంతరం గుంటూరు ఎక్సైజ్ కోర్టు మేజిస్ట్రేట్ స్పందన ఎదుట హాజరుపరిచారు. న్యాయాధికారి అతడికి బెయిల్ మంజూరు చేశారు. బోరుగడ్డను తిరిగి పోలీసులు రాత్రి 9.50 గంటలకు రాజమండ్రి కారాగారానికి తరలించారు.

వివరణ కోరరేం?

బెయిల్ గడువు ముగిసిన తర్వాత లొంగుబాటుకు ఎందుకు ఆలస్యమైందో వివరణ ఇవ్వాలంటూ జైలు అధికారులు బోరుగడ్డకు నోటీసు ఇవ్వకపోవడంపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. సాధారణంగా గడువు ముగిసిన తర్వాత ఒక గంట వరకు మానవతా దృక్పథంతో ఖైదీలకు అనుమతిస్తారు. అయినా ఆలస్యంపై రాతపూర్వకంగా వివరణ తీసుకుంటారు. దానిపై సూపరింటెండెంట్ సంతృప్తి చెందకపోతే ములాఖత్‌లలో కోతపెట్టడం వంటి చర్యలుంటాయి. బోరుగడ్డ 12.30గంటలు ఆలస్యంగా వచ్చినా నోటీసు జారీచేసి వివరణ కోరలేదు. దీనిపై రాజమండ్రి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్. రాహుల్ స్పందించారు. 'ఆలస్యంపై బోరుగడ్డను ప్రశ్నించాం. అనంతపురం కోర్టుకు వెళ్లడం వల్ల ఆలస్యమైందన్నాడు. అందుకు ఆధారం అడిగితే హైకోర్టుకు చెబుతామన్నాడు. ఇదే విషయాన్ని కోర్టుకు తెలియజేశాం. అలాగే పోలీసులకు రేడియో మెసేజ్ ఇచ్చాం. కోర్టు ఆదేశాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటాం' అని తెలిపారు.



బోరుగడ్డను రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి గుంటూరు తీసుకెళ్తున్న పోలీసులు

బోరుగడ్డకు బెయిల్ నిరాకరణ

బోరుగడ్డకు అనంతపురం ఎక్సైజ్ కోర్టు బెయిల్ నిరాకరించింది. సీఎం చంద్రబాబును, ఆయన కుటుంబాన్ని దూషించినందుకు అనంతపురం నాలుగో పట్టణ పోలీసుస్టేషన్‌లో అతడిపై కేసు నమోదైంది. బెయిల్ కోసం బోరుగడ్డ కోర్టును ఆశ్రయించగా.. న్యాయాధికారి అతడి బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేశారు.

బోరుగడ్డకు అండగా సీనియర్ ఐపీఎస్?

» కూటమిలోని ఓ కీలక ప్రజాప్రతినిధి కూడా!!

అమరావతి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు బెదిరింపులకు పాల్పడడం.. ప్రైవేటు సెటిల్మెంట్లు చేయడం.. రాజకీయ ప్రత్యర్థులను బూతులతో దూషించడం.. అరెస్టయ్యాక పోలీసులతో సపర్యలు చేయించుకోవడం.. చివరకు హైకోర్టును సైతం నకిలీ మెడికల్ సర్టిఫికెట్‌తో తప్పుదోవ పట్టించి మధ్యంతర బెయిల్ పొడిగించుకోవడం.. వంటి చర్యలకు పాల్పడిన రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కుమార్‌కు ఓ సీనియర్ ఐపీఎస్ అధికారి సహకరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కూటమి ప్రభుత్వంలోని ఓ కీలక ప్రజాప్రతినిధి కూడా అండగా ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై పోలీసులు కూపీ లాగుతున్నారు. అనంతపురం నాలుగో పట్టణ పోలీసులు నమోదు చేసిన కేసులో కోర్టు జ్యుడీషియల్ రిమాండ్ విధించగా.. తనను అనంతపురం జైలులో కాకుండా తనను రాజమహేంద్రవరం జైలుకు పంపాలని అతడు ఎందుకు కోరాడన్నది ఇప్పుడు పోలీసు వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఒక సీనియర్ ఐపీఎస్ అధికారి సాయంతో రాజమహేంద్రవరం జైలుకు చేరినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వంలోని కీలక ప్రజాప్రతినిధికి ఎన్నికల ముందు బోరుగడ్డ కొంత ఫండ్ ఇచ్చాడని.. ఇప్పుడాయన సహాయ సహకారాలు అందిస్తున్నట్లు అతడి అనుచరులు ప్రచారం చేసుకుంటున్నారు. కాగా.. రాజమహేంద్రవరం జైలులో బోరుగడ్డ ఎవరెవరితో ఫోన్లో మాట్లాడారో పోలీసులు దృష్టి సారించారు. హైకోర్టుకు నకిలీ మెడికల్ సర్టిఫికెట్ చూపించి మధ్యంతర బెయిల్ పొడిగింపు పొందాక.. అతడు ఎవరెవరిని కలిశాడు.. ఎక్కడెక్కడ తిరిగాడో కూడా గుట్టుగా ఆధారాలు సేకరిస్తున్నట్లు తెలిసింది. వాటన్నిటినీ క్రోడీకరించుకున్నాక బోరుగడ్డపై చట్టపరమైన చర్యలకు ఉపక్రమించాలని యోచిస్తున్నారు.

చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి నోటీసులు

మార్కాపురం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి యర్రగొండపాలెం సర్కిల్ పోలీసులు నోటీసులు జారీచేశారు. 2024 సార్వత్రికల్లో ఆయన ఒంగోలు వైసీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీచేశారు. ఆ సమయంలో ఆయనపై వైపాలెంలో మూడు, పెద్దారవీడులో ఒకటి, పెద్దదోర్నాలలో ఒకటి చొప్పున కోడ్ ఉల్లంఘన కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల విషయంలో వైపాలెం ఎస్ఐ చౌడయ్య బుధవారం ఒంగోలులోని వైసీపీ జిల్లా కార్యాలయంలో 41 సీఆర్‌పీసీ నోటీసులను అందజేశారు.

అదేవిధంగా ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌కు కూడా ఒక కేసు విషయంలో, టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబుకు ఒక కేసులో పోలీసులు 41 సీఆర్‌పీసీ నోటీసులు అందించారు.

భూకేటాయింపు రద్దుపై హైకోర్టుకు హయగ్రీవ

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): విశాఖలోని ఎండాడలో తమ సంస్థకు కేటాయించిన 12.51 ఎకరాలను రద్దు చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ హయగ్రీవ ఫామ్స్ అండ్ డెవలపర్స్ బుధవారం అత్యవసరంగా హైకోర్టును ఆశ్రయించింది. ఈ వ్యాజ్యాన్ని లంచ్‌మోషన్‌గా స్వీకరించి విచారణ జరిపేందుకు న్యాయస్థానం అంగీకరించింది. పిటిషనర్ తరఫున న్యాయవాది బి.ఆదినారాయణరావు స్పందిస్తూ.. నిర్మాణం కూల్చివేత చర్యలను నిలువరించాలని కోరారు. ప్రభుత్వ న్యాయవాది కేఎం కృష్ణారెడ్డి స్పందిస్తూ.. ఈ కేసులో అడ్వకేట్ జనరల్ వాదనలు వినిపిస్తారని, విచారణను గురువారానికి వాయిదా వేయాలని కోరారు. అప్పటివరకు భవనం విషయంలో తొందరపాటు చర్యలు తీసుకోబోమని తెలిపారు. వివరాలు నమోదు చేసిన న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు విచారణను గురువారానికి వాయిదా వేశారు.

అత్యాధునిక వేర్‌హౌస్ ఏర్పాటుకు సహకరించండి

» కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి ఎంపీ పురందేశ్వరి విజ్ఞప్తి

న్యూఢిల్లీ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నంలో రాబోయే ఓడరేవులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ప్రతిపాదించిన అత్యాధునిక రోబోటిక్ టెక్నాలజీతో కూడిన అల్ట్రా మోడ్రన్ వేర్‌హౌస్ ఏర్పాటుకు సహకరించాలని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ గిడ్డంగుల సంస్థకు సంబంధించిన సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని బుధవారం కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి ఎంపీ దగ్గుబాటి అందించారు. అత్యాధునిక వేర్‌హౌస్ ఏర్పాటుకు సెంట్రల్ వేర్ హౌసింగ్ సహకారం అవసరమని కేంద్ర మంత్రికి ఎంపీ వివరించారు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు ఆలోచనలు ప్రణాళిక బద్ధంగా ఉంటాయని ఈసందర్భంగా కేంద్ర మంత్రి జోషి కొనియాడారు.

ఏపీఎండీసీ నిధుల సమీకరణకు ప్రభుత్వ గ్యారంటీ

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) బాండ్ల జారీ ద్వారా రూ.9,000 కోట్ల సమీకరణకు రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చింది. ఈ మేరకు గనుల శాఖ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ బుధవారం ఉత్తర్వులు (జీఓ33) జారీ చేశారు. ఎండీసీ తొలుత రూ.5 వేల కోట్లను సమీకరించాలనుకుంది. అయితే దానిని రూ.9 వేల కోట్లకు పెంచుతూ, ఆ మేరకు నిధుల సమీకరణకు ప్రభుత్వం గ్యారంటీని ఇచ్చింది. కాగా, రూ.9 వేల కోట్ల సమీకరణకు ఎండీసీ 2% గ్యారంటీ కమిషన్‌ను ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది.

రాబోయే ఐదేళ్లలో ఏపీలో 6,702 కొత్త డెయిరీలు: అమిత్ షా

న్యూఢిల్లీ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా పాలు, పాల ఉత్పత్తులను ప్రోత్సహించాలని కేంద్రం నిర్ణయించిందని కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. రాజ్యసభలో ఎంపీ వైవీ సుబ్బారెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన రాత పూర్వకంగా బదులిచ్చారు. శ్వేత విప్లవం 2.0లో భాగంగా దేశవ్యాప్తంగా 56,586 కొత్త డెయిరీ సహకార సంఘాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో 6,702 కొత్త డెయిరీ సహకార సంఘాలు ఏర్పాటు చేస్తాం. నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు(ఎన్‌డీడీబీ) ఆధ్వర్యంలో వీటిని నెలకొల్పుతాం. మొత్తం పాల ఉత్పత్తిలో ఏపీ వాటా ఆరు శాతం' అని అమిత్ షా తెలిపారు.

విదేశీ విద్య బకాయిలపై దళారుల మాటలు నమ్మొద్దు:ఎండీ

అమరావతి: ఎన్టీఆర్ విదేశీ విద్యకు సంబంధించి 650 మంది ఈబీసీ విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.61.60 కోట్లు ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యార్థుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు ఏపీ ఈబీసీ ఎండీ భీంశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిధులపై దళారులు విద్యార్థులను మోసం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, వారిని నమ్మొద్దని కోరారు.

ఓటరు కార్డుకు ఆధార్, మొబైల్ లింక్

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయని, ఆ ఆదేశాలను అన్ని జిల్లాల ఎన్నికల అధికారులకు సర్క్యులేట్ చేయాలని సీఈవోలకు నిర్దేశించారని పేర్కొంది. 'ఓటర్ల గుర్తింపు సక్రమంగా ఉండేందుకు ఓటరు కార్డుతో ఆధార్, మొబైల్ నంబర్లను అనుసంధానించే అన్ని ప్రయత్నాలూ చేయాలి' అని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేసినట్టు తెలిపింది. దీంతోపాటు జనన, మరణాల నమోదు అధికారులతో సమన్వయం చేసుకొంటూ ఎప్పటికప్పుడు ఓటర్ల జాబితాను అప్‌డేట్ చేస్తుండాలని కూడా సీఈసీ నిర్దేశించినట్టు పేర్కొంది. ఓటరు నమోదుకు ఆధార్ లింక్ తప్పనిసరి కాదని 2022లో సుప్రీంకోర్టుకు ఇచ్చిన వివరణలో ఈసీ స్పష్టం చేసింది. దానికి భిన్నంగా తాజా ఆదేశాలు ఉన్నాయి.

ఏడాదిలో లక్షమంది మహిళా పారిశ్రామికవేత్తలు

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. ఇందుకోసం ఎమ్మెల్యేలు బాధ్యత తీసుకోవాలని, నియోజకవర్గానికి వెయ్యి మంది చొప్పున పారిశ్రామికవేత్తలను తయారు చేయాలనే లక్ష్యంతో పనిచేయాలని చంద్రబాబు స్పష్టంచేశారు. అయితే ఈ విషయంలో రాజకీయాలు చేయొద్దని స్పష్టంచేశారు. దీనిని ఉద్యమంలా ముందుకు తీసుకెళ్తామని, భవిష్యత్తులో మహోద్యమంగా మారి మహిళా పారిశ్రామికవేత్తలు పెరుగుతారని అన్నారు. మహిళా సాధికారతపై బుధవారం అసెంబ్లీలో చేపట్టిన స్వల్పకాలిక చర్చలో సీఎం ప్రసంగించారు. "టీడీపీని ఎన్టీఆర్ స్థాపించినప్పుడే మహిళల సాధికారత కార్యక్రమాలు మొదలయ్యాయి. 1983లో మహిళా విశ్వవిద్యాలయం ఏర్పాటుచేశారు. నేను 1995లో విద్య, ఉపాధిలో 33శాతం రిజర్వేషన్ తీసుకొచ్చాను. అప్పట్లో దీనిని కొందరు వ్యతిరేకించారు. ఇంతకాలం వెనుకున్నవారు ముందుకొస్తే తప్పులేదని చెప్పాను. అందుకే ప్రతిభాభారతిని సభాపతిని చేశాం. దాని ఫలితంగానే ఇప్పుడు సభలో 21 మంది మహిళలు ఉన్నారు. వచ్చే ఎన్నికలనాటికి నియోజకవర్గాల పునర్విభజన జరిగితే వారి సంఖ్య 70 నుంచి 75కు చేరుతుంది. ఆడబిడ్డల జోలికొస్తే ప్రపంచంలో ఎక్కడున్నా పట్టుకొచ్చి శిక్షిస్తాం." అని హెచ్చరించారు.

అసెంబ్లీలో అరకు కాఫీ: "పార్లమెంటులో అరకు కాఫీ స్టాల్ ఏర్పాటుచేయాలని సభాపతిని కేంద్రమంత్రి రామ్మోహన్ కోరారు. అసెంబ్లీలో అరకు కాఫీ స్టాల్ ఏర్పాటుచేస్తే బాగుంటుంది" అని సీఎం కోరారు. సోమవారంనాటికి ఏర్పాటుచేస్తామని ఉపసభాపతి తెలిపారు.

కొడితే తిరిగి కొట్టాలి : మహిళా ఎమ్మెల్యేలు

"ఎవరైనా దాడులు చేస్తే నాన్న వస్తాడు...అన్న వస్తాడు....అని మహిళలు ఎదురుచూడవద్దు. మనల్ని మనమే కాపాడుకోవాలి" అని కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి అన్నారు. వాళ్లు రెండు దెబ్బలు కొడితే, తిరిగి ఒక్క దెబ్బయినా కొట్టాలన్నారు. వైసీపీ ప్రభుత్వం పెళ్లి కానుక పథకాన్ని రద్దుచేసి మహిళలకు అన్యాయం చేసిందని గౌతు శిరీష అన్నారు. సభలో పవిత్ర స్త్రీని అవమానించారని, అందుకే వైసీపీకి ఈ గతి పట్టిందని తంగిరాల సౌమ్య అన్నారు.

ట్రంప్ సుంకాలపై ఈయూ కన్నెర్ర

ప్రతీకార సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటన... 'కెనడాపై డబుల్ టారిఫ్'పై ట్రంప్ యూటర్న్

బ్రస్సెల్స్, మార్చి12: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్టీల్, అల్యూమినియంపై విధించిన సుంకాలపై యూరోపియన్ యూనియన్ కన్నెర్ర చేసింది. అమెరికాకు చెందిన 28.33 బిలియన్ డాలర్ల వస్తువులపై ప్రతీకార సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించింది. అమెరికా ఉత్పత్తులపై ఉన్న టారిఫ్‌ల సస్పెన్షన్‌ను ఏప్రిల్ ఒకటి నుంచి తొలగిస్తున్నట్లు ఈయూ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ తెలిపారు. సుంకాల వల్ల అమెరికా, యూరప్‌లో ధరలు పెరిగిపోతాయని, వినియోగదారులను, వ్యాపారులను కాపాడేందుకు ఈయూ చర్యలు తీసుకోవాలని సూచించారు. మరోవైపు, కెనడాకు చెందిన ఉక్కు, అల్యూమినియంపై 50% టారిఫ్ విధిస్తామని ప్రకటించిన ట్రంప్ యూ టర్న్ తీసుకున్నారు. తొలుత ట్రంప్ 25 శాతం టారిఫ్ విధించడంతో అమెరికాలోని మూడు రాష్ట్రాలకు సరఫరా చేసే విద్యుత్‌పై ఎగుమతి సుంకాలను 25% పెంచుతున్నట్లు కెనడాలోని ఒంటారియో ప్రకటించింది. దీనికి ప్రతీకారంగా 50% సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. అయితే అమెరికా వాణిజ్య కార్యదర్శి లుట్నిక్ జరిపిన చర్చలు ఫలించడంతో విద్యుత్‌పై 25% అదనపు రుసుం వసూలు చేయాలనే ప్రణాళిక విరమించుకున్నట్లు ఒంటారియో ప్రకటించింది. దీంతో ట్రంప్ కూడా వెనక్కి తగ్గారు.

అమెరికా ఆల్కహాల్‌పై భారత్ 150% సుంకం

అమెరికా ఆల్కహాల్ సహా కొన్ని ఉత్పత్తులపై భారత్ 150% సుంకాలు విధిస్తోందని వైట్‌హౌస్ మీడియా కార్యదర్శి కరోలిన్ లివిట్ చెప్పారు. వ్యవసాయ ఉత్పత్తులపైనా భారత్ వంద శాతం సుంకాలు విధిస్తోందని, అందుకే ట్రంప్ పరస్పర సుంకాలను విధించాలని చూస్తున్నారని తెలిపారు. ఏప్రిల్ 2 నుంచి భారత్‌పై ప్రతీకార టారిఫ్‌లు విధిస్తామని ట్రంప్ ఇటీవలే ప్రకటించారు.



టెస్లా కారు కొనుగోలు చేసిన ట్రంప్

ఎలాన్ మస్క్‌కు చెందిన టెస్లా సంస్థ కారును ట్రంప్ కొనుగోలు చేశారు. మస్క్ నేతృత్వంలోని డోజ్ శాఖ ప్రభుత్వ ఉద్యోగుల అంశంలో తీసుకుంటున్న నిర్ణయాలపై తీవ్ర వ్యతిరేకత ఉంది. ఫలితంగా టెస్లా కంపెనీ షేర్ల విలువలు భారీగా పతనమయ్యాయి. టెస్లా కార్లు కొనుగోలు చేయవద్దు అనే ప్రచారమూ అధికమైంది. ఈ నేపథ్యంలో టెస్లాకు మద్దతుగా ఆ సంస్థకు చెందిన కారును కొనుగోలు చేశారు. టెస్లాకు చెందిన ఐదు రకాల కార్లను మస్క్ ఏకంగా వైట్‌హౌస్‌కు తీసుకొచ్చి ట్రంప్ వాకిట్లో పెట్టారు. వాటిల్లో నుంచి ఓ ఎరుపు రంగు కారును ఎంపిక చేసుకున్న ట్రంప్ దాదాపు 80వేల డాలర్ల(దాదాపు రూ.70లక్షలు)కు ఆ వాహనాన్ని కొనుగోలు చేశారు.

కాల్పుల విరమణకు ఉక్రెయిన్ సై

రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలకడానికి అగ్రరాజ్యం అమెరికా చేస్తున్న ప్రయత్నాల్లో కీలక ముందడుగు పడింది. సౌదీ అరేబియాలో అమెరికా-ఉక్రెయిన్ మధ్య జరిగిన చర్చలు ఫలించాయి. ఈ చర్చల్లో భాగంగా 30 రోజుల పాటు కాల్పుల విరమణకు ఉక్రెయిన్ అంగీకరించింది. దీంతో.. ఉక్రెయిన్‌పై విధించిన ఆంక్షలను ఉపసంహరించినట్లు ట్రంప్ ప్రకటించారు. మునుపటిలాగానే ఉక్రెయిన్‌కు మిలటరీ సాయం.. ఇంటెలిజెన్స్ సహకారం అందజేస్తామని వివరించారు. "కాల్పుల విరమణకు ఉక్రెయిన్ అంగీకరించింది. రష్యా స్పందనే మిగిలి ఉంది. రష్యా అధ్యక్షుడు పుతిన్ మా ప్రతిపాదనకు అంగీకరిస్తారని మేము ఆశిస్తున్నాం. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో మరోమారు చర్చలు జరుపుతాం. ఆయనను వైట్‌హౌస్‌కు ఆహ్వానిస్తాం" అని ట్రంప్ వ్యాఖ్యానించారు.అయితే.. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కాల్పుల విరమణకు మూడు షరతులను విధించే అవకాశాలున్నాయని బ్లూంబెర్గ్ ఓ కథనాన్ని ప్రచురించింది. ఇందులో ప్రధానంగా ఉక్రెయిన్ ఇకపై నాటో సభ్యత్వ ఆశలను వదులు కోవాలని డిమాండ్ చేయనుందని పేర్కొంది. దీంతోపాటు.. తాము ఆక్రమించిన భూభాగాలను ఉక్రెయిన్ గుర్తించాలని, తటస్థతను పాటించాలని షరతులను విధించనున్నట్లు తన కథనంలో పేర్కొంది.

ధరలు పెంచేసి.. జనాన్ని బాదేసి!

- జగన్ జమానాలో విద్యుత్ పరికరాలకు రూ.20 వేల కోట్ల అదనపు చెల్లింపులు
- సమగ్ర దర్యాప్తునకు నిపుణుల డిమాండ్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రజాప్రయోజనాలను పణంగా పెట్టి.. వైసీపీ ప్రభుత్వ హయాంలో ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్ వైర్లు, కెపాసిటర్లు తదితర విద్యుత్ పరికరాలను డిస్కమ్‌లు పొరుగు రాష్ట్రాల కంటే రెట్టింపు ధరలకు కొనుగోలు చేశాయి. జనంపై దాదాపు రూ.20,000 కోట్ల అదనపు భారం మోపాయి. ఈ వ్యవహారంపై కూటమి ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరపాలని విద్యుత్ రంగ నిపుణులు డిమాండ్ చేస్తున్నారు. 2019-24 మధ్య ఏపీ జెన్కో కేంద్రాలను 'బ్యాకింగ్ డౌన్' చేశారు. అంటే విద్యుదుత్పత్తి తగ్గించేశారు. విచ్చలవిడిగా బహిరంగ మార్కెట్లో కరెంటు కొన్నారు. అత్యధిక ధరలకు ట్రాన్స్‌ఫార్మర్లు, కెపాసిటర్లు, విద్యుత్ తీగలు, సిమెంట్ పోల్స్ కొనుగోలు చేశారు. ఇందుకైన రూ.20 వేల కోట్ల అదనపు వ్యయాన్ని ట్రూఅప్ చార్జీల పేరిట ప్రజల నెత్తినే రుద్దారు. కూటమి అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యుత్ రంగంపై శ్వేతపత్రం విడుదల చేశారు. డిస్కమ్‌ల విచ్చలవిడి కొనుగోళ్లతో ఆ ఐదేళ్లలో రూ.32,166 కోట్ల మేర ట్రూఅప్ చార్జీల భారాన్ని ప్రజలు మోయాల్సి వచ్చిందని అందులో పేర్కొన్నారు.

గుండెపోటుకు చైనా వ్యాక్సిన్!

న్యూఢిల్లీ, మార్చి 12: గుండె పోటు, బ్రెయిన్ స్ట్రోక్‌ను నివారించడానికి చైనా వ్యాక్సిన్‌ను రూపొందించింది. రక్తనాళాలు గట్టిపడడం, రక్తవాహికల్లో రక్త ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడడానికి కారణమయ్యే 'ప్లేక్స్' ఏర్పడడాన్ని ఈ నానో వ్యాక్సిన్ నిరోధిస్తుంది. నాన్జింగ్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, చైనా యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్తంగా 'కాక్‌టైల్' రూపంలో ఈ నానో వ్యాక్సిన్‌ను రూపొందించాయి. రక్తనాళాలు పెళుసుబారకుండా, వాహికల్లో కొవ్వు పొరలు (ప్లేక్స్) ఏర్పడకుండా అనేక ప్రొటీన్లు పనిచేస్తున్నాయన్న పూర్వ పరిశోధనా ఫలితాలు తాజా రూపకల్పనకు స్ఫూర్తి.

బెయిల్ ఇవ్వకపోతే ఆత్మహత్యే

(మొదటి పేజీ తరువాయి)

మెడ నరికేయండి అంటూ రెచ్చిపోయారు. రెండు రోజుల్లో బెయిలు రాకపోతే ఆత్మహత్య చేసుకుని చస్తానంటూ మెజిస్ట్రేట్ సమక్షంలోనే బెదిరింపులకు దిగారు. జడ్జిని ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేశారు. గత ప్రభుత్వంలో చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీనటుడు పోసానిని కర్నూలు జిల్లా జైలు నుంచి సీఐడీ పోలీసులు బుధవారం రాత్రికి పీటీ వారెంట్‌పై గుంటూరుకు తీసుకువచ్చారు. రాత్రి 8:30 గంటల సమయంలో సీఐడీ కోర్టు ఇన్‌చార్జి మేజిస్ట్రేట్ అయిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టు మెజిస్ట్రేట్ స్పందన ఇంటికి తీసుకు వెళ్లి హాజరుపరిచారు. ప్రస్తుతం తనకు 70 సంవత్సరాల వయసని.. ఇప్పటికే రెండుసార్లు స్టెంట్స్ వేశారని, గొంతుకు పెరాలసిస్ తరహా రోగం వచ్చిందని, ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని జడ్జికి పోసాని చెప్పారు. ఈ వయసులో ఈ విధంగా వేధించడం దారుణమన్నారు. పోసానికి 14 రోజుల రిమాండ్ విధిస్తూ మేజిస్ట్రేట్ స్పందన ఆదేశించారు. దీంతో ఆయన్ను గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. పోసానిపై తెనాలి, బాపట్లలో కూడా కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో ఇప్పటికే పీటీ వారెంట్లు తీసుకున్నారు.

మార్ఫింగ్ వీడియోపై సీఐడీ కేసు: చంద్రబాబు అమిత్‌షా కాళ్లు పట్టుకుంటున్నట్లుగా ఓ మార్ఫింగ్ ఫొటోను సృష్టించి హైదరాబాదులో మీడియా సమావేశంలో పోసాని చూపారు. చంద్రబాబుపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబుకు ముస్లింలు ఓట్లు వేయొద్దు అంటూ పిలుపునిచ్చారు. ఈ వ్యాఖ్యలపై బండారు వంశీకృష్ణ అనే వ్యక్తి గత ఏడాది అక్టోబర్ 9న సీఐడీ అదనపు డీజీకి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోసానిపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో పీటీ వారెంట్‌పై బుధవారం ఆయన్ను గుంటూరు కోర్టులో హాజరుపరిచారు.

లంచ్‌మోషన్‌గా హైకోర్టులో విచారణ

చంద్రబాబును అసభ్యపదజాలంతో దూషించారంటూ మంగళగిరి సీఐడీ పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ పోసాని బుధవారం అత్యవసరంగా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాన్ని లంచ్‌మోషన్‌గా స్వీకరించింది. పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌పై మంగళగిరి కోర్టు పీటీ వారెంట్ జారీ చేసిందని, పోలీసులు వారెంట్‌ను అమలుచేసి పిటిషనర్‌ను అరెస్ట్ చేశారని తెలిపారు. పీటీ వారెంట్ అమలైనందున క్వాష్ పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. న్యాయమూర్తి ఈ వాదనతో ఏకీభవిస్తూ పిటిషన్‌ను కొట్టివేశారు.

హైజాక్ చేసిన రైలు



పాకిస్థాన్‌లో రైలు హైజాకర్ల హతం

కరాచీ, మార్చి 12: పాకిస్థాన్‌లో హైజాక్‌కు గురైన జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను విడిపించేందుకు చేపట్టిన సైనిక చర్య ముగిసిందని పాకిస్థాన్ ఆర్మీ ప్రకటించింది. ఈ ఆపరేషన్‌లో మొత్తంగా 33 మంది హైజాకర్లను హతమార్చి వారి చెరలో ఉన్న 346 మంది బందీలను విడిపించినట్లు వెల్లడించింది. ఈ ఉదంతంలో 21 మంది ప్రయాణికులు, 28 మంది సైనికులు మృతి చెందినట్లు వెల్లడించింది. బలోచిస్థాన్ ప్రావిన్సులోని క్వెట్టా నుంచి పెషావర్‌కు వెళ్తున్న రైలును మంగళవారం బలోచ్ మిలిటెంట్లు హైజాక్ చేసిన సంగతి తెలిసిందే.

Printed and Published by ***Koganti Venkata Seshagiri Rao*** *on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107,* ***Editor : N.Rahul Kumar,*** *RNI No:3470/1960,* ***Managing Director : Vemuri Radha Krishna, Founder :*** *K.L.N. Prasad.*